తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM రాజమహేంద్రవరం : fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

13-8-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 194 పేజీలు: 8+4 వెల: 6.50






**SHOWROOMS: ANDHRA PRADESH:** RENAULT **RAJAHMUNDRY** Ph: 8860294871. RENAULT **BHIMAVARAM** Ph: 8448389650.



బుధవారం న్యూఢిల్లీలో జరిగిన 'హర్ ఘర్ తిరంగా' బైక్ ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, కిషన్ రెడ్డి

# ఎందుకంత జాప్యం

>> నమోదు చేసి జైలుకు పంపించేందుకు కూడా వెనుకాడవద్దని కలెక్టర్, ఎస్పీలను ఆదేశించారు. పనుల్లో అలసత్వం వహించిన ఇఇకి మెమో జారీ చేయాలని ఇఎన్‌సి నరసింహమూర్తిని మంత్రి ఆదేశించారు. ఇకపై పుష్కర లిఫ్ట్ స్కీం పైప్‌లైన్ పనులపై ప్రతిరోజూ వర్క్ ప్రోగ్రెస్ రిపోర్ట్ అందించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఎల్‌నినో వంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రతి నీటి చుక్కను ఎంతో జాగ్రత్తగా కాపాడుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారని మంత్రి తెలిపారు. గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు పుష్కర ఎత్తిపోతల పథకం పనులు కీలకమని పేర్కొన్నారు. ఈ నెలాఖరున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకు గోదావరి జలాలు వెళ్లేలా నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో, పుష్కర ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను, కాంట్రాక్టు ఏజెన్సీలను ఆదేశించారు.

# కీలక ముందడుగు

>> నుంది. నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో అమలు చేసే ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా ఎపి మారిటైమ్ బోర్డు బాధ్యతలు నిర్వహించనుంది. ఐఐటి మద్రాస్ నిపుణుల సాంకేతిక సూచనలు, శాస్త్రీయ అధ్యయనాల ఆధారంగా ఉప్పాడ తీర ప్రాంతానికి అనువైన రక్షణ చర్యలను రూపొందించనున్నారు. తీర కోత తీవ్రత, సముద్ర ప్రవాహాలు, అలల ప్రభావం తదితర అంశాలను సమగ్రంగా అధ్యయనం చేసి, వాటికి అనుగుణంగా తీర రక్షణ నిర్మాణాల డిజైన్‌ను సిద్ధం చేయనున్నారు.

**నవంబర్ నుంచి పనులు ప్రారంభం:**

ఐఐటి మద్రాస్‌తో అధికారిక ఒప్పందానికి సంబంధించిన ప్రక్రియ పూర్తికావడంతో, రానున్న నవంబర్‌నుంచి ప్రాజెక్టు పనులను ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఉప్పాడ తీర ప్రాంత ప్రజలు, మత్స్యకార గ్రామాల రక్షణకు ఈ ప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యత కలిగినదిగా అధికారులు భావిస్తున్నారు. ఈకార్యక్రమంలో కాకినాడ కలెక్టర్ ఎమ్.ఎన్. హారేంధిర ప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మెంబర్ సెక్రటరీ శరవణన్, పాడా డైరెక్టర్ డా.ఎన్.వి. శివరామ ప్రసాద్, ఐఐటి మద్రాస్ ఓషన్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎస్.ఎ.సన్నాసిరాజ్, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖతీబ్ కౌసర్ బానో, ఆంధ్రప్రదేశ్ మారిటైమ్‌బోర్డ్ చీఫ్ ఇంజనీర్ జి.వి.రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

# జూనియర్ ఎన్టీఆర్‌కు సర్జరీ

>> పారు. ఇటీవల జిమ్‌లో ఉండగా ఎన్టీఆర్ భుజానికి గాయం కాగా ప్రత్యేక వైద్య నిపుణుల బృందంతో చర్చించి ఆర్థోస్కోపిక్ శస్త్రచికిత్స ప్రయోజనకరంగా ఉంటుందని నిర్ధారించామని తెలిపారు. ఈనేపథ్యంలో ఆర్థోపెడిక్ సర్జన్ల బృందం ఆర్.ఎ.పూర్ణచంద్ర తేజస్వి, డా.నితిన్ బెజ్జంకి, డా.మధుసూదన్ రావు, డా.శ్రీనివాస్ రావు సూరపనేని ఆధ్వర్యంలో ఈ సర్జరీని విజయవంతంగా పూర్తి చేశారని తెలిపారు. జూనియర్ ఎన్టీఆర్ ఇప్పుడు వైద్య పర్యవేక్షణలో ఉంటారని రెండు నుంచి మూడు నెలల కాల వ్యవధిలో పూర్తిగా కోలుకుని, తిరిగి సాధారణ స్థితికి వస్తారని తాము ఆశిస్తున్నారని హెల్త్‌బులిటెన్‌లో పేర్కొన్నారు.

**మీ అందరి అండతో త్వరలో మీ ముందుకు వస్తా: ఎన్టీఆర్**

తన భుజానికి సర్జరీ విజయవంతం కావడంపై కిమ్స్ వైద్య బృందానికి జూనియర్ ఎన్టీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. మీ అందరి అండతో త్వరలో మీ ముందుకు వస్తా. నా క్షేమం కోరుకున్న అందరికీ కృతజ్ఞతలు అని ఎక్స్ వేదికగా జూనియర్ ఎన్టీఆర్ పోస్టు పెట్టారు.

# పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ మరణించారా?

## అమెరికన్ జర్నలిస్టు ప్రత్యేక కథనం



**రావల్పిండి, ఆగస్టు 12:** పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై తీవ్ర ఉత్కంఠ నెలకొన్నది. ఆయన జైల్లోనే మృతిచెంది ఉండొచ్చంటూ పాకిస్థాన్‌కు చెందిన ఓ సీనియర్ జర్నలిస్టు చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. అయితే ఈ వాదనకు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ధ్రువీకరణ లేదు. అమెరికాలో ఉంటున్న జర్నలిస్ట్ వజాహత్ సయీద్ ఖాన్ ఓ ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇమ్రాన్ ఖాన్ ఇప్పుడు జీవించి లేరని ముగ్గురు సీనియర్ పాకిస్థాన్ సైనిక అధికారులు తనకు చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే వాళ్లు కూడా ఈ సమాచారాన్ని స్వయంగా నిర్ధారించలేదని చెప్పారు. అనధికారిక మార్గాల్లో తమకు సమాచారం అందిందని మాత్రమే వారు చెప్పినట్లు వివరించారు. 73 ఏళ్ల ఇమ్రాన్ ఖాన్ 2023 నుంచి రావల్పిండిలోని అడియాలా జైలులో ఉన్నారు. ఆయనపై పలు కేసులు కొనసాగుతున్నాయి. జైల్లో ఉన్న ఆయనను కలిసేందుకు కుటుంబ సభ్యులకు అనుమతి ఇవ్వడం లేదంటూ పాకిస్థాన్ తెహ్రీక్‌ఏఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ పలుమార్లు ఆరోపించింది. ఆయనకు సరైన వైద్యం అందడం లేదని కూడా పార్టీ నేతలు చెబుతున్నారు. ఇమ్రాన్ కుటుంబసభ్యులు, పీటీఐ నేతలు మంగళవారం మరోసారి ఆందోళన వ్యక్తంచేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇమ్రాన్‌ను కలిసేందుకు అనుమతి ఇవ్వకపోతే సెప్టెంబర్ 27న ఇస్లామాబాద్‌కు లాంగ్ మార్చ్ చేపడతామని పీటీఐ ప్రకటించింది. అంతకుముందే నిరసనలు చేపడతామని పీటీఐ హెచ్చరించింది. ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితిపై అమెరికా నుంచి కూడా పాకిస్థాన్‌పై ఒత్తిడి పెరుగుతోంది. 13 మంది అమెరికా చట్టసభ సభ్యులు అక్కడి విదేశాంగ మంత్రి మార్కో రూబియోకు లేఖ రాశారు. ఇమ్రాన్ ఆయన భార్య బుష్రా బీబీ నిర్బంధ పరిస్థితులపై ఇస్లామాబాద్‌తో మాట్లాడాలని కోరారు.

# నేరాల రూపం మారింది

>> నేరాలు, సోషల్ మీడియా అసభ్య పోస్టుల లాంటి నేరాలు పెరిగాయి. మహిళలపై నేరాల విషయంలో జీరో టాలరెన్స్ అని పదేపదే చెబుతున్నాను. ఈ విషయంలో కఠినంగా ఉండాల్సిందే. నేరం జరిగిన ప్రాంతాన్ని సంరక్షించటంలో విఫలం కాకూడదు. నేర నియంత్రణకు పోలీసులూ గోల్డెన్ అవర్ విధానాన్ని పాటించాలి. తప్పు చేస్తే నేరస్తులు తప్పించుకోలేరని తెలిసేలా చేయాలి. వివేకా హత్య కేసు ఘటనలో పూర్తి సమాచారం రాలేదు. పోలీసుల వైపు నుంచి జరిగిన కాస్ట్ లీ మిస్టేక్ అది. కొందరు కావాలనే తప్పు దోవ పట్టించారు. ఇల్లంతా రక్తం మరకలతో తడిస్తే ఆ ఆధారాలను చెరిపేసే ప్రయత్నం చేశారు. ఇది పూర్తి నిరక్ష్యం. నేరస్తుల పట్ల ఉదాసీనంగా ఉండొద్దు. జీరో డ్రగ్స్, గంజాయి లేకుండా జాతీయ స్థాయిలో ఓ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మహిళల భద్రతతో పాటు గంజాయి, డ్రగ్స్ నియంత్రణ కోసం డ్రగ్స్ వద్దు బ్రో అన్న ప్రచారాన్ని విస్తృతం చేయండి. రహదారి భద్రత కూడా కీలకమైన అంశం. రోడ్డు ప్రమాదాల అరికట్టేలా సైనేజీలు, రోడ్ ఇంజనీరింగ్, హాట్‌స్పాట్‌లను ఆడిట్ చేయాలి. వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించండి' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**చట్టాన్ని ఉల్లంఘించే లైసెన్స్ పార్టీలకు లేదు**

"శాంతిభద్రతల విషయంలో విఫలమైతే తీవ్రమైన పరిణామాలు మనం అంతా ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఒక్క చిన్న నిరక్ష్యం మొత్తం పోలీసు వ్యవస్థపైనే మరక పడుతుంది. సింగయ్య వాహనం కింద పడిపోయి చనిపోతే కూడా ఎదురు ఆరోపణలు చేశారు. జగన్ కారు కింద పడిపోయినట్టుగా వీడియో వచ్చింది. కారు తొక్కేస్తే పొదల్లో పడేశారు. ప్రాణాలు కాపాడబోయిన పోలీసులపైనే నెపం పడింది. ఇబ్రహీంపట్నంలో రాజకీయ పార్టీ ర్యాలీలో రోడ్డుపై మోటారు సైకిల్ విన్యాసాలు ఏమిటి? పోలీసులపై కూడా దాడులు జరిగే పరిస్థితి ఉంది. ఏ పార్టీ అయినా రోడ్డుపై విన్యాసాలు చేసేందుకు అవకాశం లేదు. ప్రజలకు అసౌకర్యం కలిగించకుండా వెళ్లటం అన్ని పార్టీల బాధ్యత. రాజకీయ పార్టీ నేతలు కాబట్టి ఫ్రీగా వదిలేస్తామంటే శాంతిభద్రతల పరిస్థితి వస్తుంది. రాజకీయ పార్టీలకు ఇష్టానుసారం వ్యవహరించే లైసెన్సు ఇవ్వలేదు. ప్రస్తుతం రోడ్లపై వీరంగం సృష్టిస్తున్న వారిలో 94శాతం మంది ఒక పార్టీ నుంచే ఉంటున్నారు. పరామర్శలకు వెళ్లటం తప్పేం కాదు. రోడ్లపై చేసే ప్రదర్శనల వల్లే ప్రజలకు ఇబ్బందులు. విశాఖపట్నంలో 3 గంటల పాటు రోడ్లను బ్లాక్ చేశారు. అంబులెన్సులో ఆస్పత్రికి వెళ్లే వారు, ఆఫీసుకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రజలకు ఇబ్బందులు కలగకూడదనే సిఎంగా నేను కూడా వాహన కాన్వాయ్ కుదించుకున్నాను. మానసిక పరిస్థితి సరిగాలేని కొందరు వ్యక్తులు చేసే నేరాలపై ప్రజల్లోనూ చర్చ జరగాలి. కొందరు రౌడీలే సామాజిక మాధ్యమాల్లో హీరోలుగా మారుతున్నార్లు' అని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**ఇక నెలవారీ పోలీసు పెర్ఫార్మెన్స్ రిపోర్టు**

"శాంతిభద్రతల విషయంలో ఎపి అత్యుత్తమ రాష్ట్రంగా ఉండాలన్నదే లక్ష్యం. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత దూషణలు, అసభ్య ప్రచారం పై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. నేర నిర్ధారణ రేటు పెరిగితే నేరాలు తగ్గుతాయి. పోలీసులు దర్యాప్తు చేసి విజయం సాధించిన కేసుల వివరాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం పూర్తి స్థాయిలో అమలు కావాలి. రాజకీయ పార్టీల ముసుగులో కొందరు గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను ప్రోత్సహిస్తున్నారు. గతంలో మద్యం తాగించేవారు, ఇప్పుడు గంజాయి మత్తులో వీరంగం చేస్తున్నారు. కొన్ని సామాజిక మాధ్యమాల సాయంతో నేరస్తులుగా మారుతున్నారు. టెక్నాలజీ నేరస్తులను పట్టిస్తోంది, అదే సమయంలో నేరాలు పెంచుతోంది. బ్యాలెన్సింగ్, ప్రాపర్ పోలిసింగ్ ఉండాలి. పోలీసులు అంటే ప్రజల్లో గౌరవం, సంఘ విద్రోహ శక్తులకు భయం కలగాలి. రాష్ట్ర అభివృద్ధితో పాటు శాంతిభద్రతలు కూడా కీలకం. అప్పుడే సుపరిపాలన సాధ్యం. డిజి కార్యాలయం నుంచి పోలీసు స్టేషన్ వరకూ పోలీసులకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఇక నుంచి ప్రతీ నెలా పోలీసు పెర్ఫార్మెన్సు రిపోర్టును విడుదల చేయాలి. బెస్ట్ ప్రాక్టీసెస్, సక్సెస్ స్టోరీస్ సహా వివిధ అంశాలను ప్రజలకు వివరిద్దాం' అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా 1200 పోలీసు స్టేషన్ల నుంచి స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, సహా శాంతిభద్రతలు, ట్రాఫిక్, జీఆర్పీ సహా వివిధ విభాగాలకు చెందిన 1650 మంది అధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సమావేశానికి హోం మంత్రి అనిత, డిజిపి హరీష్ కుమార్ గుప్తా, శాంతి భద్రతల అదనపు డిజి ఎన్. మధుసూధన రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్హా, ఈగల్ టాస్క్‌ఫోర్సు ఐజి రవికృష్ణ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## నీట్ యుజి పేపర్ లీక్ కేసు..

# సిబిఐ ఛార్జ్‌షీట్ ఓకే

- ఆ వివరాలు బయటకెలా వచ్చాయి
- ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఆందోళన

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** నీట్ యుజి పేపర్ లీక్ కేసులో 13 మంది నిందితులపై సిబిఐ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ను ఢిల్లీ రైస్ అవెన్యూ కోర్టు బుధవారం పరిగణనలోకి తీసుకుంది. ఈ కేసులో దర్యాప్తు సంస్థ సమర్పించిన తుది నివేదికను ప్రత్యేక న్యాయమూర్తి అజయ్ గుప్తా స్వీకరించారు. సిబిఐ ఛార్జ్‌షీట్ వివరాలు మీడియాకు వెల్లడి కావడంపై కోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా మైనర్లతో సహా సాక్షుల వివరాలు బయటకు రావడంపై కోర్టు అసహనం వ్యక్తం చేసింది. కోర్టులో వాదనలు జరగకముందే ఛార్జ్‌షీట్‌లోని అంశాలు ప్రచురితం కావడం తీవ్ర ఆందోళనకరమైన విషయమని రౌస్ అవెన్యూ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి అజయ్ గుప్తా పేర్కొన్నారు. ఇటువంటి వెల్లడి చర్యలు క్రిమినల్ విచారణ ప్రక్రియ నిష్పాక్షికతను దెబ్బతీసే అవకాశం ఉందని కోర్టు అభిప్రాయపడింది. మీడియా సహా సంబంధిత వర్గాలన్నీ, తమ కథనాల వల్ల కోర్టు విచారణ ప్రభావితం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత కలిగి ఉన్నాయని కోర్టు నొక్కి చెప్పింది. మైనర్లతో సహా సాక్షుల పేర్లను మీడియా కథనాలు బయటపెట్టాయని సిబిఐ ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలపడంతో ఈ విషయం తెరపైకి వచ్చింది. నిందితులకు నిష్పాక్షిక విచారణ పొందే హక్కుపై ఇటువంటి ప్రచారం ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొంటూ డిఫెన్స్ లాయర్లు కూడా ఈ కథనాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. నీట్ యుజి ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంలో 13 మంది నిందితులపై సిబిఐ దాదాపు 20,000 పేజీల ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేసింది. దర్యాప్తు సంస్థ ప్రకారం, ముగ్గురు సబ్జెక్ట్ నిపుణులు ఢిల్లీలోని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) కార్యాలయం నుండి పరీక్ష ప్రశ్నలను సేకరించి, వివిధ మార్గాల ద్వారా లీక్ చేశారు. అత్యంత గోప్యమైన విభాగం నుండి బయటకు వచ్చేటప్పుడు తనిఖీ విధానాలు లేకపోవడాన్ని నిందితులు తమకు అనుకూలంగా మలుచుకున్నారని కూడా ఆ సంస్థ ఆరోపించింది. కోర్టు ఛార్జ్‌షీట్‌ను స్వీకరించింది. అభియోగాల నమోదుపై వాదనలు ఆగస్టు 13 నుండి ప్రారంభమవుతాయని ఆదేశించింది. కేసులో తదుపరి దర్యాప్తునకు అనుమతి కోరుతూ సిబిఐ కూడా ఒక దరఖాస్తును దాఖలు చేసింది. తదుపరి దర్యాప్తు కోసం సిబిఐ దాఖలు చేసిన దరఖాస్తుపై నిందితుల నుంచి స్పందనలు కోరిన కోర్టు, గురువారం ఈ విషయాన్ని విచారించనుంది.

# ఇకపై నేరుగా తిరుపతికే

>> నేరుగా తిరుపతికి వచ్చి ఇక్కడి ఇమ్మిగ్రేషన్ తనిఖీల ద్వారా మన దేశంలోకి ప్రవేశించవచ్చు. ప్రధానంగా తిరుమలకు చేరుకునే వెసలుబాటు కలిగింది. తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంగా రూపుదిద్దుకుంది. ఇప్పటికే 11వరకు విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి. త్వరలోనే విదేశాలకు తిరుపతినుండే విమానాలు ఎగిరే రోజులు ఉన్నాయి. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో విదేశీ శ్రీవారి భక్తులకు కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 15కి ముందే శుభవార్త చెప్పింది. కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారి దర్శనార్థం ప్రపంచ నలుమూలల నుండి విదేశీ భక్తులు వస్తున్నారు. వీరిసౌలభ్యం కోసం తిరుపతి రేణిగుంట విమానాశ్రయాన్ని ఇ వీసా ప్రవేశ పాయింట్‌గా గుర్తించింది. ఈ నిర్ణయంతో విదేశీ యాత్రికులు ఇకపై ఇమ్మిగ్రేషన్ ప్రక్రియ కోసం ఇతర ప్రధాన నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా నేరుగా తిరుపతిలోనే ఆ ప్రక్రియ పూర్తిచేసుకోవచ్చు. ప్రస్తుత నిర్ణయంతో ఇమ్మిగ్రేషన్ సమస్యకు పరిష్కారం లభించింది. ఇకపై విదేశీ భక్తులు నేరుగా తిరుపతి విమానాశ్రయంలోనే ఇవీసా ప్రక్రియ పూర్తి చేసుకుని, సులభంగా శ్రీవారి దర్శనానికి వచ్చే వెసలుబాటు కలిగింది. విదేశీ పౌరులు భారతదేశ పర్యటన కోసం ఆన్‌లైన్‌లో పొందే వీసానే ఇవీసా అంటారు.

ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకుని, ఫీజు చెల్లించి సేవలు అందుకుంటారు. ఇప్పటికీ తిరుపతి విమానాశ్రయానికి రెగ్యులర్ అంతర్జాతీయ విమాన సర్వీసులు లేనప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ముందుగానే ఇ వీసా ఎంట్రీ పాయింట్‌ను మంజూరు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. భవిష్యత్తులో తిరుపతి నుండి అంతర్జాతీయ సర్వీసులను ప్రారంభించేందుకు మార్గం సుగమం చేస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. తిరుపతిలో రన్‌వేను 2,286 మీటర్ల నుండి 3,819 మీటర్లకు విస్తరించారు. 2024 డిసెంబర్‌లో సింగపూర్ నుండి ఓ చార్టర్డ్ విమానం తిరుపతిలో ల్యాండ్ అవ్వడం కూడా ఈ దిశగా పడిన తొలి అడుగుగా భావిస్తున్నారు.ఈ నిర్ణయంతో తిరుపతి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అంతర్జాతీయంగా మరింత గుర్తింపు పొందింది. తిరుపతి విమానాశ్రయానికి శ్రీవేంకటేశ్వరస్వామి పేరు కూడా సార్థకం కానుంది.

# డియర్ యంగ్ ఫ్రెండ్స్

>> అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన యువతను ఉద్దేశించి మాట్లాడుతూ "ప్రియమైన యువ మిత్రులారా, మీరే మా శక్తి. మీరే మా బలం. రేపటి ఆశ, వాగ్దానం మీర్లే' అని పేర్కొన్నారు. ప్రతి యువతీ యువకుడు తమకు నచ్చిన మార్గాన్ని ఎంచుకుని, ఆశించిన జీవితాన్ని గడిపేందుకు అవసరమైన స్వేచ్ఛ, ఆత్మవిశ్వాసం, అవకాశాలు కల్పించే భవిష్యత్తును నిర్మించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. యువత కలలు కనడమే కాకుండా, వాటిని సాకారం చేసుకునేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. "మేము ఈ రోజు చేస్తున్న ప్రతి పని అంతిమంగా మీకు మెరుగైన రేపటిని అందించడం కోసమే. విస్తృత అవకాశాలు, కలలు కనే స్వేచ్ఛ, వాటిని నిజం చేసుకునేందుకు అవసరమైన మద్దతుతో కూడిన భవిష్యత్తును అందించడమే మా ధ్యేయమ్లు' అని చంద్రబాబు వివరించారు. ఈ భవిష్యత్ నిర్మాణంలో యువత కూడా భాగస్వాములు కావాలని, అందరం కలిసికట్టుగా నవ సమాజాన్ని నిర్మిద్దామని ఆయన పిలుపునిచ్చారు. యువతకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తనతో కలిసి రావాలని ఆహ్వానించారు.

## వారం - వర్జ్యం

13-08-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, ఆశ్లేషకార్తె
తి.పాడ్యమి రా.8.46
న1.ఆశ్లేష ఉ.6.06, న2.మఖ తె.4.39
వ.1. ఉ.6.20-ఉ.9.18
వ.2. రా.9.19-రా.12.21
దు.1. ఉ.10.04-ఉ.10.55
దు.2. మ.3.10-సా.5.01
రాహు మ.1.30-మ.3.00 శుభ లేదు.

## వార్తాఫలం

**మేషం :** క్రీడలయందు ఆసక్తి కలిగి ఉంటారు. బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తారు. బంధువుల రాక ఆనందం కలిగిస్తుంది.

**వృషభం :** సంఘంలో గుర్తింపు కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పరచుకుంటారు. ప్రయాణాలు. మిత్రుల కలయికతో విందు, వినోదాలు.

**మిథునం :** గృహనిర్మాణం ఆలోచనలు కొనసాగిస్తారు. వృత్తి, వ్యాపారాలలో ఎదురైన ఆటంకాలు తొలగుతాయి.

**కర్కాటకం :** చిన్ననాటి మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. మొండి బాకీలు వసూలవుతాయి. స్వల్ప ధనలాభం పొందుతారు.

**సింహం :** అనుకోని అతిథుల నుండి శుభవార్తలు అందుకుంటారు. వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వస్త్ర లాభం.

**కన్య :** కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి.

**తుల :** చిన్ననాటి మిత్రుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. గృహ నిర్మాణ ఆలోచనలు సాగిస్తారు. ప్రయాణాలు.

**వృశ్చికం :** బంధువులతో ఏర్పడిన విభేదాలు పరిష్కారమవుతాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**ధనుస్సు :** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. సకాలంలో ఋణాలు తీరుతాయి. స్వల్ప ధనలాభం పొందుతారు.

**మకరం :** ఆస్తి విషయంలో నూతన ఒప్పందాలు కుదురుతాయి. ఉద్యోగాలలో మంచి మార్పులు ఉంటాయి.

**కుంభం :** చేపట్టిన పనులు సవ్యంగా పూర్తి చేస్తారు. నూతన పెట్టుబడులకు అనుకూలంగా ఉంటుంది. కాంట్రాక్టులు లాభిస్తాయి.

**మీనం :** కొన్ని విషయాలలో వట్టిందల్లా బంగారంగా ఉంటుంది. ఆరోగ్య సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



బుధవారం కురిసిన భారీ వర్షాలకు కాశ్మీర్ లోయలోని అవంతిపోరా గురుద్వారా జాతీయ రహదారి జలమయమయిన దృశ్యం

# ధైర్యముంటే అసెంబ్లీకి రావాలి

>> చర్చించి సమాధానం చెప్పేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. అసెంబ్లీ కంటే గొప్ప ప్రజాస్వామ్య వేదిక మరొకటి లేదు' అని పేర్కొన్నారు. బుధవారం టిడిపి కేంద్ర కార్యాలయంలో మంత్రి అనిత మీడియాతో మాట్లాడుతూ, ఐదేళ్లలో డిఎస్సీ చేయని వారు ఇప్పుడు మెగా డిఎస్సీపై వైసిపి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. డిఎస్సీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామని, నియామకాలపై వచ్చిన ఆరోపణలకు సంబంధిత అధికారులు ఆధారాలతో వివరణ ఇచ్చారని పేర్కొన్నారు. అయినప్పటికీ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని, సిబిఐ విచారణ జరపాలని వైసిపి పదేపదే డిమాండ్ చేయడం రాజకీయ ప్రయోజనాల కోసం యువతలో అనుమానాలు సృష్టించే ప్రయత్నమేనన్నారు. 'ఐదేళ్ల అధికారంలో ఉండి ఒక్క డిఎస్సీని కూడా పూర్తి చేయలేని వారు... ఇప్పుడు ఉద్యోగాలు పొందిన తర్వాత అక్రమాలు జరిగాయని ఆరోపించడం విడ్డూరంగా ఉంది. మీ వద్ద ఆధారాలు ఉంటే అసెంబ్లీకి వచ్చి చూపించండి. ప్రతి అంశంపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని హోంమంత్రి అనిత పునరుద్ఘాటించారు.

వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోవడంపై స్పందిస్తూ, ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలకు శాసనసభలో తమ నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించే బాధ్యత ఉందన్నారు. గతంలో శాసనమండలిని రద్దు చేయాలని నిర్ణయం తీసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి, ఇప్పుడు అదే మండలికి తమ పార్టీ ప్రతినిధులను పంపుతున్నారని పేర్కొన్నారు. మరోవైపు ప్రజలు ఎన్నుకున్న వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరుకాకపోవడం సమంజసం కాదన్నారు. 'ఎమ్మెల్యేగా గెలవడం ఎంత గొప్ప బాధ్యతో, నియోజకవర్గ ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించడం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత. జగన్‌తో పాటు గెలిచిన వైసిపి ఎమ్మెల్యేలకు కూడా సభలో ప్రజల తరఫున మాట్లాడే అవకాశం ఉండాలి' అని అన్నారు.

**ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల కష్టాన్ని అవమానించొద్దు:**

మెగా డిఎస్సీ నియామకాలన్నీ అక్రమమంటూ ఆరోపణలు చేయడం ద్వారా ప్రభుత్వం మీదనే కాకుండా, కష్టపడి ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల ప్రతిభపై కూడా అనుమానాలు కలిగిస్తున్నారని హోంమంత్రి పేర్కొన్నారు. ఐదేళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ, కుటుంబాలకు దూరంగా ఉండి కోచింగ్ తీసుకుని, ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ఎంతోమంది అభ్యర్థులు కష్టపడి ఉద్యోగాలు సాధించారని తెలిపారు. 'ఎంతో కష్టపడి చదివి ఉద్యోగం సాధించిన యువత ఇప్పుడు తమ భవిష్యత్తుపై భరోసాతో ముందుకు వెళ్తున్నారు. మొత్తం డిఎస్సీ నియామకాలే అక్రమమని మాట్లాడితే వారి కష్టాన్ని, ప్రతిభను, వారి కుటుంబాల ఆనందాన్ని అవమానించినట్లే కాదా? రాజకీయాల కోసం యువత మనోభావాలతో ఆడుకోవద్దు' అని హితవు పలికారు. 'నిందలు వేయడం, అలజడి సృష్టించడం కాకుండా జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై బాధ్యతాయుతంగా చర్చించాలి. ప్రజలకు వాస్తవాలు తెలుసు. ప్రభుత్వం ప్రతి అంశంపై సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉంది' అని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు.

# ఎస్క్రో ఖాతాల్లో ప్రోత్సాహకాలు

>> చేశారు. సచివాలయంలో సిఎం చంద్రబాబు అధ్యక్షతన 20వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం అయ్యింది. పరిశ్రమలు, ఇంధనం, ఐటి ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో మొత్తం 25 ప్రాజెక్టులకు సంబంధించి రూ.2,08,406 కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలకు ఎస్ఐపిబి ఆమోదాన్ని తెలియచేసింది. తద్వారా 21,627 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలను కల్పించనున్నారు. ఇప్పటి వరకూ జరిగిన 20 ఎస్ఐపిబి సమావేశాల ద్వారా 363 ప్రతిపాదనల ద్వారా రూ.13.78 లక్షల కోట్ల పెట్టుబడు లకు ఆమోదం దక్కింది. ఈ పెట్టుబడుల ద్వారా 10.86 లక్షల మందికి ఉద్యోగాలు రానున్నాయి. గ్రీన్ అమ్మోనియాతో పాటు లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్ రంగాల్లో పెట్టుబడులపై దృష్టి సారించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ రంగంలో పరిశ్రమల్ని ప్రోత్సహించేలా ఏం చేయాలన్న దానిపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు అవుతున్న పారిశ్రామిక ప్రాజెక్టుల గురించి ప్రజలకు వివరించి అవగాహన కల్పించాలని సిఎం సూచించారు. కొందరు పనిగట్టుకుని కాలుష్యకారకాలంటూ దుష్ప్రచారం చేస్తున్నారని అసత్యాలను నమ్మించి అభివృద్ధిని అడ్డుకుంటున్నారని అన్నారు.

ఉత్తరాంధ్రలో ఏర్పాటు అవుతున్న డేటా సెంటర్లన్నిటికీ 3.5 టిఎంసిల నీరు సరిపోతుందని అన్నారు. డేటా సెంటర్లపై ఉన్న అపోహలను తొలగించేలా చర్యలు చేపట్టాలని సిఎం సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలన్నారు. కొందరు రాజకీయ నిరుద్యోగులు సామాజిక మాధ్యమాల ద్వారా ఫేక్ ప్రచారాన్ని చేస్తున్నారని అన్నారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గ్రావిటీపై విశాఖలోని పరిశ్రమలకు పుష్కలంగా నీటిని తీసుకెళ్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వస్తున్న పరిశ్రమల ద్వారా రాష్ట్రంలోని ఎకోసిస్టమ్‌కు ఎంత విలువ జోడిస్తున్నామన్న అంశాన్ని విశ్లేషించాలని సిఎం సూచించారు. ఎపికి వచ్చే పర్యాటకులను ఆకట్టుకునేలా ఆతిథ్య రంగంలో వస్తున్న హోటల్ భవనాలు ప్రత్యేక నిర్మాణాలుగా ఉండేట్టు చూడాలని అన్నారు.

**సెప్టెంబరు నాటికి అందుబాటులోకి 175 ఎంఎస్ఎంఇ పార్కులు**

రాష్ట్రంలో ఏర్పాటవుతున్న రక్షణ రంగ ప్రాజెక్టులన్నీ జాతికి గర్వకారణమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పుట్టపర్తి సమీపంలో డిఫెన్సు, హిందుపూర్ సమీపంలో ఏరో స్పేస్ ప్రాజెక్టులు రావాలని సిఎం నిర్దేశించారు. మూలపేట పోర్టు డిసెంబరులో ప్రారంభించేలా నిర్మాణం పూర్తి చేయాలని అన్నారు. రాష్ట్రంలో లాజిస్టిక్స్, ఆధునిక వేర్ హౌసింగ్, కోల్డ్ చైన్ ప్రాజెక్టులను అనుసంధానించాలని అన్నారు. రాయలసీమలో పండే ఉద్యాన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు వెళ్లేలా రోడ్ రైల్, పోర్టు కనెక్టివిటీ ఉండాలన్నారు. గత యేడాది నుంచి కుదుర్చుకున్న పెట్టుబడి ఒప్పందాలు, ఎస్ఐపిబిలో అనుమతి పొందిన ప్రాజెక్టులు వేగంగా పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ యేడాది సెప్టెంబరు నాటికి మిగిలిన 37 ఎంఎస్ఎంఇ పార్కులను కూడా పూర్తి చేసి 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక వాడలు అందుబాటులోకి రావాలన్నారు. వన్ ఫ్యామిలీ వన్‌ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమాన్ని కూడా పెద్ద ఎత్తున చేపట్టాలని సిఎం నిర్దేశించారు.

**20వ ఎస్ఐపిబి సమావేశంలో ఆమోదం పొందిన ప్రాజెక్టుల వివరాలు**

1. ఓకెయిర్ గ్రీన్ ఫ్యూయెల్స్ కర్నూలు జిల్లాలో రూ.616 కోట్ల పెట్టుబడి, 130 మందికి ఉద్యోగాలు2. జాక్సన్ గ్రీన్ రెన్యూవబుల్ కర్నూలు జిల్లాలో రూ.1533 కోట్ల పెట్టుబడి, 250 మందికి ఉద్యోగాలు3. ఎఫ్‌పిఇఎల్ రవ్వేద పవర్, విజయనగరం జిల్లాలో రూ.480 కోట్ల పెట్టుబడి, 275 మందికి ఉద్యోగాలు4. వారీ క్లీన్ ఎనర్జీ సొల్యూషన్స్, కాకినాడ జిల్లాలో రూ.15000 కోట్ల పెట్టుబడి, 1500 మందికి ఉద్యోగాలు5. ఆరాధ్యా బయోగ్యాస్ , కర్నూలు జిల్లాలో రూ.143.47 కోట్ల పెట్టుబడి, 595 మందికి ఉద్యోగాలు6. ఉషోదయా బయోగ్యాస్, నెల్లూరు జిల్లా, రూ.143.47 కోట్ల పెట్టుబడి, 595 మందికి ఉద్యోగాలు7. డేటా సెంటర్ హోల్డింగ్స్ ఇండియా, విశాఖపట్నం, రూ.58,743 కోట్లు, 1250 మందికి ఉద్యోగాలు8. మునోథ్ లీథియం బ్యాటరీ లిమిటెడ్, తిరుపతి జిల్లాలో రూ.500 కోట్ల పెట్టుబడి, 240 మందికి ఉద్యోగాలు9. ఎఐఎల్ డిక్సన్ ఇండియా లిమిటెడ్, కడప జిల్లా కొప్పర్తి క్లస్టర్‌లో, రూ.450 కోట్ల పెట్టుబడి, 7000 మందికి ఉద్యోగాలు 10. రెన్యూ ఎపి గ్రీన్ డేటా సెంటర్, అనకాపల్లి జిల్లా, రూ.85,200 కోట్ల పెట్టుబడి, 1880 మందికి ఉద్యోగాలు11. ఎఎం ఇంటెలిజెన్స్ ల్యాబ్స్ లిమిటెడ్, విశాఖ జిల్లా, రూ.31,387 కోట్ల పెట్టుబడి, 1000 మందికి ఉద్యోగాలు12. సిఆర్ఆర్ హాస్పిటాలిటీ ఎల్ఎల్‌పి, తిరుపతి జిల్లాలో రూ.192.02 కోట్ల పెట్టుబడి, 200 మందికి ఉద్యోగాలు13. ఆర్కే 2 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, తిరుపతి జిల్లాలో రూ.150 కోట్ల పెట్టుబడి, 150 మందికి ఉద్యోగాలు14. సన్ రైజ్ హోటల్స్ ఇండియా లిమిటెడ్, కాకినాడ జిల్లాలో రూ.54 కోట్ల పెట్టుబడి, 75 మందికి ఉద్యోగాలు15. జెఎస్పీ హోటల్స్, రిసార్ట్స్ ఎల్ఎల్‌పి, కృష్ణా జిల్లాలో రూ.63.79 కోట్ల పెట్టుబడి, 100 మందికి ఉద్యోగాలు

16. పావులూరి హోటల్స్, తిరుపతి జిల్లా, రూ.58.74 కోట్ల పెట్టుబడి, 150 మందికి ఉద్యోగాలు17. అగస్త్యా గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, కర్నూలు జిల్లాలో రూ.7799.96 కోట్ల పెట్టుబడి, 1000 మందికి ఉద్యోగాలు18. అక్షత్ గ్రీన్ టెక్ లిమిటెడ్, విశాఖపట్నం జిల్లా రూ.1600 కోట్ల పెట్టుబడి, 750 మందికి ఉద్యోగాలు19. కోరమాండల్ ఇంటర్నేషనల్, శ్రీకాకుళం జిల్లా, మూలపేట, రూ.2125 కోట్ల పెట్టుబడి, 400 మందికి ఉద్యోగాలు20. హిందాల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్, చిత్తూరు జిల్లా కుప్పంలో రూ.880 కోట్ల పెట్టుబడి, 447 మందికి ఉద్యోగాలు21. ఎస్ట్రేలా లాజిస్టిక్స్, విశాఖపట్నం జిల్లాలో రూ.90 కోట్లు, 100 మందికి ఉద్యోగాలు 22. గణేష్ సాయి మోనిష స్టీల్ వైర్స్, విజయనగరం జిల్లాలో రూ.66 కోట్ల పెట్టుబడి, 120 మందికి ఉద్యోగాలు23. విపిఆర్ మైనింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, నెల్లూరు జిల్లా, మనుబోలు, రూ.500 కోట్ల పెట్టుబడి, 2000 మందికి ఉద్యోగాలు (ప్రైవేట్ పార్క్)24. జయాదిత్యా ఆగ్రో లిమిటెడ్, కర్నూలు జిల్లాలో రూ.300 కోట్లు పెట్టుబడి, 350 మందికి ఉద్యోగాలు25. ప్రిసోల్ ఆగ్రో ఇండస్ట్రీస్, నెల్లూరు జిల్లాలో, రూ.330.71 కోట్ల పెట్టుబడి, 1110 మందికి ఉద్యోగాలు.

వాసుల్ గత నాలుగు వారాలు బెస్ట్ సెల్లర్స్
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
13-8-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 194 పేజీలు: 8+4 వెల: 6.50

జలశక్తి కార్యదర్శిగా సీనియర్ ఐఎఎస్ అర్చనావర్మ
8లో

ఒమన్ తీరంలో నౌకపై హౌతీల దాడి

## స్టైపెండ్ పెంచాల్సిందే!

### కొనసాగుతున్న జూనియర్ డాక్టర్ల ఆందోళన

### ప్రభుత్వంతో ఫలించని చర్చలు



**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** తమ స్టైపెండ్‌ను 30శాతం వరకు పెంచాలని డిమాండ్ చేస్తూ జూనియర్ డాక్టర్లు చేస్తున్న నిరసన రెండో రోజుకు చేరుకుంది. ప్రభుత్వంపై ఆర్థిక భారం పడకూడదనే ఉద్దేశంతో కనీసం 15శాతమైనా పెంచాలని జూడాలు విజ్ఞప్తి చేసినప్పటికీ అటు ప్రభుత్వం నుంచి మాత్రం సానుకూల స్పందన రావడంలేదు. దీంతో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని జూనియర్ డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉండగా హెల్త్ సెక్రటరీతో జూడాల ప్రతినిధులు జరిపిన చర్చలు ఎలాంటి ఫలితాన్ని ఇవ్వలేదు. దీంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు బుధవారం విజయవాడతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 18 ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో నిరసన కార్యక్రమాలను జూనియర్ డాక్టర్లు మరింత ఉధృతం చేశారు. పొరుగున ఉన్న తెలంగాణ రాష్ట్రంలో ఇస్తున్న రీతిలోనే తమకు కూడా గౌరవప్రదమైన స్టైపెండ్ అందించాలని జూనియర్ డాక్టర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సమానమైన సేవలు అందిస్తున్నప్పుడు ఎపిలో తక్కువ స్టైపెండ్ ఇవ్వడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని జూనియర్ డాక్టర్లు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నారు. అత్యవసర సేవలు, ఐసియు సేవలకి ఎలాంటి అంతరాయం కలగకుండా రోగులకు ఇబ్బంది లేకుండా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్వచ్ఛందంగా రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తక్షణమే జోక్యం చేసుకుని స్టైపెండ్ పెంపుపై స్పష్టమైన, సానుకూల ప్రకటన చేయాలని జూనియర్ డాక్టర్లు కోరుతున్నారు.

# నేరాల రూపం మారింది

## పోలీసింగ్ మారాలి

### క్రైమ్ దర్యాప్తులో గోల్డెన్ అవర్ కీలకం

### ఎపిపోలీస్ కీర్తి దేశమంతా మార్మోగాలి

### పోలీసులకు పూర్తి స్వేచ్ఛ, గౌరవం

### ప్రతి నెలా పోలీస్ పెర్ఫార్మెన్స్ రిపోర్టు

### పరామర్శల పేరుతో రోడ్లపై విన్యాసాలతోనే ఇబ్బందులు

### రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడితే కఠినంగా ఉండండి

### రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ పోలీసు అధికారులతో సిఎం చంద్రబాబు



బుధవారం సచివాలయంలో డిజిపి, స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల రూపం కూడా మారిపోయిందని, దీనికి అనుగుణంగానే పోలీసింగ్ మారాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నేరాల నియంత్రణలో తక్షణం ఆధారాలు కోల్పోకుండా చూడాలని పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. నేర నియంత్రణలో గోల్డెన్ అవర్ అత్యంత కీలకమని ఆయన అన్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి డిజిపి నుంచి క్షేత్రస్థాయిలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో సిఎం సమావేశం నిర్వహించారు. డిజిపి సహా రేంజ్ ఐజిలు, డిఐజిలు, డిఎస్పీలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో సిఎం వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడారు. ఎపి పోలీసుల కీర్తి దేశమంతా మార్మోగాలని దానికి అనుగుణంగా సిద్ధం కావాలని అన్నారు. నేరాల దర్యాప్తులో టెక్నాలజీ ఇంటిగ్రేషన్ పెరగాలని సూచించారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ "డిజిపి నుంచి ఎస్‌హెచ్‌ఓ వరకూ సమావేశం నిర్వహించటం ఇదే తొలిసారి. శాంతిభద్రతల విషయంలో లోటుపాట్లను సవరించుకుంటూ ముందుకు వెళ్తున్నాం. ప్రజలు ప్రశాంతంగా ఉండాలన్నా, రాష్ట్రానికి పెట్టుబడులు రావాలన్నా శాంతిభద్రతలు ముఖ్యం. రాష్ట్ర ప్రభుత్వానికి పోలీసువిభాగం ఓ ప్రైడ్. ప్రజల విశ్వాసాన్ని చూరగొనేలా అంతా వ్యవహరించాలి. ఇన్విజిబుల్ పోలీసు, విజిబుల్ పోలీసింగ్ విధానం అమలు చేయాలి. గడచిన రెండేళ్లుగా కాగ్నిజబుల్ క్రైమ్స్ 14 శాతం మేర తగ్గాయి. కాలానుగుణంగా నేరాలు కూడా మారుతున్నాయి. డిజిటల్ క్రైమ్, డిజిటల్ అరెస్టులు తదితర నేరాలు కొత్త సవాళ్లుగా మారుతున్నాయి. దీనికి అనుగుణంగా సాంకేతికతను పోలీసులు అందిపుచ్చుకోవాల్సి అని దిశానిర్దేశం చేశారు

**పోలీసులకు పూర్తి స్వేచ్ఛ, గౌరవం**

"2019-24 మధ్య ఉన్న పాలకులు గంజాయి, కల్తీ మద్యాన్ని ప్రధాన సమస్యగా తయారు చేశారు. పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తాం. గౌరవం పెరిగేలా చర్యలు చేపడతాం. రాష్ట్రవ్యాప్తంగా 14,770 సిసి కెమెరాలతో పాటు ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసుకున్న కెమెరాలను కలిపి 1 లక్ష కెమెరాలను అనుసంధానించాం. నేరాల దర్యాప్తులో ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్, డిఎన్‌ఏ డిటెక్షన్ లాంటి ఆధునిక విధానాలు పెరిగాయి. వేగంగా నేరాలను గుర్తించగలుగుతున్నాం. టెక్నాలజీ, నాలెడ్జి, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను పోలీసుఅధికారులు సమర్థంగా అమలు చేస్తే శాంతిభద్రతలు నియంత్రణలోకి వస్తాయి. రాజకీయ నేరాలు, డిజిటల్ >>2



## సభలో సుదీర్ఘ చర్చకు సిద్ధమే

8లో

### స్పీకర్ ఓంబిర్లాకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా లేఖ

### విపక్షాలకు తగిన సమాధానమిస్తామని వెల్లడి



## షార్ట్‌కట్‌లు నేర్చుకుంటే జీవితం షార్ట్ అవుతుంది

### మాజీ రాష్ట్రపతి కోవింద్ ఆత్మకథ ఆవిష్కరణలో ప్రధానిమోడీ

8లో

## ఎస్క్రో ఖాతాల్లో ప్రోత్సాహకాలు

- డిసెంబర్ నుంచి వేసేలా చర్యలకు శ్రీకారం
- పల్లెలు అభివృద్ధి చెందేలా పారిశ్రామిక ప్రాజెక్టులు
- గ్రీన్ అమ్మోనియా, లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్ రంగాలపై దృష్టి
- రూ.2,08,406 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపిబిలో ఆమోదం
- వివిధ ప్రాజెక్టుల ద్వారా 21,627 మందికి ఉద్యోగాల కల్పన
- సిఎం చంద్రబాబు అధ్యక్షతన పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం

**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఈ యేడాది డిసెంబరు నుంచి పారిశ్రామిక ప్రోత్సాహకాలను ఎస్క్రో ఖాతాలో వేసేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించేందుకు ఎస్క్రో ఖాతాలను అనుసంధానించాలని సిఎం సూచించారు. పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఇన్సెంటివ్‌లు తప్పనిసరి అయినా ఎంత వరకూ ఆ ప్రోత్సాహకాలను ఇవ్వగలమన్న అంశంపై దృష్టి సారించాలని అధికారులకు దిశానిర్దేశంచేశారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందేలా పారిశ్రామిక ప్రాజెక్టులను ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసేలా ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం >>2

## డియర్ యంగ్ ఫ్రెండ్స్

- యువత కలలు సాకారం చేసుకునేందుకు పూర్తి స్వేచ్ఛ, అవకాశాలు కల్పిస్తాం
- మెరుగైన భవిష్యత్ అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: సిఎం సందేశం
- ఈ భవిష్యత్ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని చంద్రబాబు పిలుపు
- అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా యువతకు శుభాకాంక్షలు

**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్తప్రతినిధి:** అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు "డియర్ యంగ్ ఫ్రెండ్స్" అంటూ రాష్ట్ర యువతకు శుభాకాంక్షలు తెలిపారు. యువతే మన శక్తి, బలంఅని, రేపటి భవిష్యత్తుకు వారే ఆశాకిరణాలని ఆయన అభివర్ణించారు. యువత ఆశయాలకు అనుగుణంగా, వారికి బంగారు భవిష్యత్తును >>2




## విదేశీ భక్తులు ఇకపై నేరుగా తిరుపతికే

### శ్రీవారి భక్తులకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు

### తిరుపతి విమానాశ్రయానికి ఇ-వీసా ఎంట్రీ పాయింట్‌గా గుర్తింపు

### త్వరలో అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభమయ్యే సూచనలు

**తిరుమల, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం దేశం నలుమూలల నుండేగాక విదేశాల నుండి ప్రతిరోజూ భక్తులు తరలివస్తున్నారు. విదేశాల నుండి వచ్చే భక్తులకు ఇదివరకు తిరుపతి విమానాశ్రయంలో ఇ వీసా తనిఖీ ప్రవేశించే కేంద్రం లేదు. దీనివల్ల విదేశీ భక్తులు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు విమానాశ్రయాల నుండి తిరుపతికి రావలసి ఉండేది. దీనివల్ల యాత్రికులకు సమయం వృధానేగాక డబ్బు కూడా అదనంగా భారమవుతుంది. ఈ కష్టాలతో చాలామంది విదేశీ హిందూ భక్తులు నేరుగా తిరుపతి విమానాశ్రయం చేరుకునే వీలులేకపోయింది. ఇప్పుడు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సిఎం చంద్రబాబు నాయుడుకు విదేశాల్లోని హిందూ భక్తుల నుండి వచ్చిన విజ్ఞప్తులతో కేంద్ర ప్రభుత్వం దృష్టికి ఈసమస్య తీసుకెళ్లారు. కేంద్ర విమానాయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తిరుమల భక్తుల పట్ల సానుకూలంగా స్పందించడంతో విదేశీ భక్తులు >>2

## ఎందుకంత జాప్యం



### షెడ్యూల్ ప్రకారం పుష్కర లిఫ్ట్ పూర్తి చేయాల్సిందే

### అధికారులకు మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశం

### పైప్‌లైన్ పనుల ఆలస్యంపై ఏజెన్సీ ప్రతినిధులపై ఆగ్రహం

**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** పుష్కర ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ పనుల పురోగతిపై బుధవారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పనుల పురోగతి ఆశించిన స్థాయిలో లేకపోవడంపై అధికారులు, కాంట్రాక్టు ఏజెన్సీల ప్రతినిధులపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీక్షలో పోలవరం జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఇఎన్‌సి నరసింహామూర్తి, ఇఇలు, కాంట్రాక్టు ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఇటీవల పుష్కర ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ పనులకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులు వర్క్ షెడ్యూల్ అందజేశారని మంత్రి తెలిపారు. ఆ షెడ్యూల్ ప్రకారం పనులు జరుగుతున్నాయా లేదా అన్నదానిపై ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు క్షేత్రస్థాయిలో పరిశీలించి మంత్రికి నివేదిక అందించారు. వర్క్ షెడ్యూల్ ఇచ్చి కూడా పనుల్లో వేగం పెంచకపోవడం ఏమిటని మంత్రి అధికారులను ప్రశ్నించారు. ప్రజాప్రయోజనాలకు సంబంధించిన అత్యంత కీలకమైన పనుల్లో అలసత్వాన్ని ఎంతమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టు ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రజాప్రయోజనాలకు నష్టం కలిగించే విధంగా కాంట్రాక్టర్లు వ్యవహరిస్తే క్రిమినల్ కేసులు >>2

## ఉప్పాడ తీర రక్షణకు కీలక ముందడుగు



బుధవారం మంగళగిరి క్యాంపు కార్యాలయంలో ఐఐటి మద్రాస్ ప్రతినిధులతో డి.సిఎం పవన్ సమక్షంలో ఎంఒయు కుదిరిన దృశ్యం

### డి. సిఎం పవన్ సమక్షంలో ఐఐటి మద్రాస్‌తో ఒప్పందం

### రక్షణ గోడ డిజైన్, డిపిఆర్, పర్యవేక్షణ బాధ్యతలు వారిదే

### రూ.323 కోట్లతో రక్షణ గోడ నిర్మాణం, నవంబర్ నుంచి పనులకు శ్రీకారం

**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** సముద్ర కోతతో తీవ్రంగా దెబ్బతింటున్న ఉప్పాడ తీర ప్రాంత పరిరక్షణకు కీలక ముందడుగు పండింది. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని ఈ తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణానికి అవసరమైన డిజైన్, సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్టు (డిపిఆర్), సాంకేతిక పర్యవేక్షణ బాధ్యతలను ఐఐటీ మద్రాస్‌కు అప్పగిస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమక్షంలో బుధవారం మంగళగిరి క్యాంపు కార్యాలయంలో అవగాహన ఒప్పందం కుదిరింది. రూ.323 కోట్లతో ఈ తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణం కానుంది. కేంద్ర ప్రభుత్వ విపత్తు నిర్వహణ నిధి (ఎన్‌డిఎమ్ఎఫ్) ఆమోదంతో చేపట్టనున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఎస్‌డిఎమ్ఎ) నోడల్ ఏజెన్సీగా వ్యవహరించ >>2

## టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ రాజీనామా

8లో



## జగన్‌కు ధైర్యముంటే అసెంబ్లీకి రావాలి

- ఆధారాలతో చర్చకు మేం సిద్ధం
- డిఎస్సీపై ఆరోపణలు విడ్డూరం
- హోంమంత్రి అనిత

**మంగళగిరి, ఆగస్టు 12 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వంపై వైసిపి చేస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పేందుకు తాము సిద్ధంగా ఉన్నామని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. 'రోడ్లపై ఆరోపణలు చేయడంకాదు. జగన్‌మోహన్ రెడ్డికి ధైర్యముంటే అసెంబ్లీకి రావాలి. వారివద్ద ఉన్న ఆధారాలను సభముందు ఉంచాలి. ప్రతి అంశంపై >>2

## జూనియర్ ఎన్టీఆర్‌కు సర్జరీ



### భుజానికి శస్త్ర చికిత్స విజయవంతమైంది

### కోలుకోవడానికి 2-3 నెలల సమయం

### హెల్త్ బులెటెన్ విడుదల

**హైదరాబాద్, ఆగస్టు 12,ప్రభాతవార్త:** ప్రముఖ సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ భుజానికి శస్త్రచికిత్స విజయవంతం అయ్యింది. ఈమేరకు బుధవారం సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలోసర్జరీ నిర్వహిం చినట్లు వైద్యులు తెలిపారు. సర్జరీఅనంతరం ఎన్టీఆర్ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని తెలి >>2

వార్త

బుర్రలో ఎన్నో విషయాల్ని నింపి గందరగోళం చేసేది విద్య కాదు. వ్యక్తిలో శీలాన్ని పెంపొందించి జీవితాన్ని తీర్చి దిద్దుకునే అవగాహన కలిగించేదే నిజమైన విద్య.

- సిసిరో

# కేన్సర్ కని'కట్టు'!


శంఖంలో పోస్తే తప్ప గంగాజలం తీర్థం కాబోదు. ఇదో సిద్ధాంతం. రాజపుండులా మానవ జీవాలను పీల్చిపిప్పి చేస్తున్న కేన్సర్‌ను నోటిఫై చేయాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలే దానికి నిదర్శనం. కేన్సర్ లక్షణాలు కనిపించగానే ఒక్క క్షణం కూడా జాప్యం చేయకుండా వైద్యానికి చేరువయితేనే ఆ ప్రాణం నిలబడుతుంది. లేకుంటే అదీ ఒకటి, రెండు దశలు దాటాక ఆసుపత్రికెళ్లినా ఉపయోగం ఉండొచ్చు, ఉండకపోవచ్చు. దశలు మారే కొద్దీ ప్రాణాంతకమని, ఇక సాధారణ పరిస్థితికి రాలేమని కేన్సర్ వ్యాధి చికిత్స నిపుణులు హెచ్చరిస్తూనే ఉంటారు. కానీ వైద్యానికి ఖర్చుపెట్టుకునే ఆర్థిక స్తోమత లేక ఎంతో మంది చచ్చే చావు వచ్చేవరకు మంచాన్ని వదిలిపెట్టి కదలరు. ఏనాటికైనా పోవాల్సిందే కదా! అని సరిపెట్టుకోవడం కద్దు. కేన్సర్ కూడా నయమవుతుందన్న భరోసా కల్గిస్తున్న నైపుణ్యం కలిగిన డాక్టర్లు ఉన్నా దానిగుర్తింపు వైద్య చికిత్సల కోసం ఖర్చు పెట్టేందుకు ఎంతో మందికి స్తోమత ఉండటం లేదు. అందుకే కేన్సర్‌ను నయం చేయగలిగిన వ్యాధిగా డాక్టర్లు చెప్పినా కూడా వైద్య ఖర్చులకు తట్టుకోలేక తాము జీవిత చరమాంకంలో ఉన్నామనిచెప్పుకుంటూ బతికేస్తున్నారు. స్తోమత ఉన్నవారు మంచి ఖరీదైన వైద్యం చేయించుకుని ఎంచక్కా ఆరోగ్యంతో తిరగ్గలుగుతున్నారు. మరి ఏదారీ దిక్కుతోచని వారే తమ అంతిమ యాత్ర కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. కేన్సర్ పీడిత రోగులను వారి ఖర్మకు వారిని వదిలేసేందుకు ఎవరూ సిద్ధంగాలేరు. కొన్ని విధాన నిర్ణయాల విషయంలో ప్రభుత్వాలు చొరవ చూపాల్సిన అవసరముందంటూకొందరు బాధితులుసుప్రీం కోర్టు మెట్లెక్కారు. ఉన్నత ధర్మాసనం నుంచి తగు మార్గదర్శకాలు వెలువడ్డాయి. కేన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి తగిన చికిత్స అందించేందుకు వీలుగా ఆ వ్యాధిని నోటిఫైయబుల్ డిసీజ్‌గా ప్రకటించాలని తాజాగా సుప్రీం కోర్టు ఆదేశించింది. పార్లమెంటు స్థాయీ సంఘం చేసిన సిఫార్సులను 17 రాష్ట్రాలు అమలు చేసి నోటిఫైడ్ వ్యాధి'గా కేన్సర్ ప్రకటించారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు కేన్సర్ వ్యాధి చికిత్సలో ఒకే రకమైన విధానాన్ని అమలు చేయాలని సుప్రీం మార్గదర్శకాలు జారీ అవసరమని సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహన్‌ల త్రిసభ్య ధర్మాసనం అభిప్రాయపడింది. దేశంలో అంతకంతకూ పెరుగుతున్న కేన్సర్ మహమ్మారిని అణచివేయడంలో రోగులకు సకాలంలో మెరుగైన వైద్యాన్ని అందించడానికి ఈ వ్యాధిని దేశమంతటా అన్ని రాష్ట్రాలు నోటిఫై చేయాల్సిన ఆవశ్యకత ఉంది. ప్రస్తుతం సుప్రీం త్రిసభ్య ధర్మాసనం జోక్యంతో ఆ వ్యాధికి దేశమంతటా ఒకే రకమైన ఆరోగ్య విధానం ఉండేలా ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రముఖ వైద్యులు అనురాగ్ శ్రీవాస్తవ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలు అత్యంత కీలకమైనవిగానే చెప్పాలి. ఈ ఆదేశాలు అమలైతే ఇప్పటికే ఉన్న రాష్ట్రాలతోపాటు మరో 19రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కూడా ఏకరూప వైద్య చికిత్సలకు లోబడి కేన్సర్ రోగుల వైద్యంలో తరిస్తాయి. నిజానికి దేశంలో కేన్సర్‌కు సంబంధించినడేటా కొరత ఉంది. కోర్టు ఆదేశాలు అమలై కేన్సర్‌ను 'నోటిఫైయబుల్ వ్యాధి'గా నిర్ధారిస్తే దేశంలోని ప్రతి ఆసుపత్రి, వైద్యుడు వాటి డేటాను ప్రభుత్వానికి అందించాల్సి ఉంటుంది. వ్యాధి తీవ్రత, విస్తృతిని బట్టి ప్రభుత్వం నివారణ చర్యలకు ఆరోగ్య ప్రణాళిక సిద్ధం చేసేందుకు అవకాశముంటుంది. భారత రాజ్యాంగంలోని అధికరణ 14కిందనోటిఫై చేయబడిన రుగ్మతలకే ఆరోగ్య సంరక్షణ ఉంటుంది. నోటిఫై చేయడమనేది కొన్ని రాష్ట్రా లకే పరిమితమైతే మిగిలిన రాష్ట్రాలలో కేన్సర్ రోగులకు ప్రభుత్వపరంగా వైద్యభరోసా ఉండదు. కేన్సర్‌పైజాతీయ స్థాయి డిజిటల్ రిజిస్ట్రీఏర్పాటు కావాలని పిటీషనర్ కోరుతున్నారు. వ్యాధి ముదిరిన తర్వాత ఖరీదైన చికిత్సల కోసం వెంపర్లాడడం కన్నా ప్రాథమిక దశలోనే గుర్తిస్తే ప్రాణాలను నిలబెట్టుకోవచ్చు. ఇలా ఒకే ఒక లక్ష్యంతో ఫిర్యాదీ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఇదొక దేశ ప్రజారోగ్యానికి సంబంధించిన ఒక దిశానిర్దేశంగా చెప్పుకోవాలి. ఆరోగ్య రక్షణ వ్యవస్థకు ఇదొక పటిష్టమైన పునాదిగా చూడాలి. దేశవ్యాప్తంగా జాతీయ కేన్సర్‌నియంత్రణ విధానాన్ని రూపొందించేందుకు మార్గదర్శనం ఏర్పడ్తుంది. ప్రజలను సరైన అవగాహన లేమితో గోమూత్రం వంటి శాస్త్రీయ ఆధారాలు లేని ప్రత్యామ్నాయ చికిత్సల నుండి కాపాడిన ట్లవుతుంది. కేన్సర్ అంటువ్యాధి కాదు నయమౌతుందన్న నినాదమే కేన్సర్ రోగిని సగం బతికిస్తుంది. అదే కేన్సర్ వ్యాధి నియంత్రణకుదారులు తెరిచే ఉంటే ఆ రోగి సంపూర్ణ ఆరోగ్యంతో బయటపడే వీలుంది. కేన్సర్ నియంత్రణకు అవసరమైన వైద్యనిర్మాణసౌకర్యాలు, స్క్రీనింగ్ కేంద్రాలు, రేడియో థెరపి, ఖీమో థెరపీ, ఆంకాలజీ స్పెషలిస్టులు పాలియేటిక్ కేర్ అందుబాటులోకి రాగలవు. కేన్సర్ వ్యాధిలో తెలుగు రాష్ట్రాలో పేరొందిన వైద్య చికిత్సలున్నందున అధునాతన స్కానింగ్ సౌకర్యాల కారణంగా వాళ్లు సరైన చికిత్సల ద్వారా స్వస్థతనొందుతారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్రెస్ట్, సర్వైకల్, ఓరల్, ఊపిరితిత్తులు కేన్సర్ వంటి వాటికి అధునాతన వైద్యం లభిస్తుంది. అనేక రాష్ట్రాలలో అవగామన లేమి కారణంగా వ్యాధి ముదిరిన తర్వాతనే వైద్యం మొదలైన కారణంగా ఎంతో కాలం రోగి బతికేందు కు చాన్సులు బహుతక్కువని పిటీషనర్ పేర్కొన్నారు. వైద్యానికి లొంగదని ఇన్నాల్లూ చెప్పుకుంటూ వస్తున్న కేన్సర్‌కు ఒక 'టీకా' దొరికిందన్న వార్త ఎంతో శుభదాయకం. కానీ అది ఏదశలో వాడాలి. ఎలా వాడాలి అన్న అంశాలపై స్పష్టమైన వైద్య అవగాహన లభ్యమైన రోజుల్లో ఆసుపత్రి డేటా బేస్‌లు ప్రభుత్వ భీమా పథకాలతో అనుసంధా నించబడిన డేటాలేనిదే కేన్సర్ చికిత్స సాధ్యంకాని పరిస్థితి ఉంది. ఇవన్నీ పద్ధతిగా జరిగితే కేన్సర్ రోగుల సంఖ్య నానాటికీ తగ్గుముఖాన్ని పట్టనుండటం శుభ పరిణామం కాగలదు.

ఆదర్శాన్ని నిలపడానికి వెయ్యిసార్లు ప్రయత్నించండి. ఆ వెయ్యిసార్లు విఫలమయితే మరొకసారి ప్రయత్నించండి.



స్వామి వివేకానంద

ఆకలి రుచి ఎరుగనట్లే మనకు అవసరమైన దాంట్లో తప్పులు కనిపించవు.



ఆస్కార్‌వైల్డ్

# ప్రజావాక్కు

### పెద్దల సభకు పెద్దలనే పంపాలి

ఒక ప్రయోగం చెయ్యండి సీఎం గారూ గవర్నర్ కోటలో శాసనమండలి సభ్యులకు కానీ రాజ్యసభ సభ్యులకుగాని పూర్వం సమాజంలో రకరకాల సేవలు చేసినవారిని గౌరవంగా గుర్తించి ఆయా పదవులలో నియమించేవారు. లేక ఎన్నుకునేవారు. పార్టీలతో నిమిత్తం లేకుండా ఎన్నుకునేవారు. వావిలాలలాంటివారు అలా ఎన్నికాకబడ్డవారే! అలాంటి వారిని నియమిస్తేనే ఆయా సభలకు గౌరవం పెరుగుతుంది. అలాంటి వారిని నియమిస్తేఅవినీతికి తావు లేకుండా, స్వార్థంలేకుండా నిజంగాసమస్యల మీద పోరాడతారు. అయితే ఈరోజు బాగా డబ్బున్నవారికి, కుల పిచ్చి వాళ్లకు, మత పిచ్చగాళ్లకు రాజ్యసభ, శాసనమండలిలోకి పంపిస్తున్నారు. మనరాష్ట్రంలో రేపుఇద్దరినిగవర్నరు కోటాలో శాసనమండలికి నియమించబోతున్నారు. సమాజాన్ని బాగా అవగాహన చేసుకున్నవారికి, వివిధ రంగాలలో పని చేస్తున్నవారికి ఇచ్చినట్లయితే ఆయా పదవులకు న్యాయం చేసిన వారవుతారు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ప్రవర్తనే ప్రపంచ శత్రువుగా మారుస్తుంది

ప్రపంచాన్ని శాసించాలన్న దురాలోచనతో పలు దేశాలతో కాలు దువ్వి కయ్యం తెచ్చుకుంటున్న ట్రంప్ ప్రపంచ శత్రువుగా మారి ఒంటరౌతున్నాడు. శత్రుత్వం ఒక్కసారిగా పుట్టదు. అది చిన్నచిన్న మాటలవల్ల, చిన్నచిన్న అపార్థాల వల్ల క్రమంగా పెరుగుతుంది. కాని అంతకంటే పెద్ద పెద్ద తప్పులతో కళ్లున్న కబోదిలా ప్రవర్తించడం విడ్డూరంగా ఉంది. అవమానపరిచే మాటలు మాట్లాడితే ఎదుటివారి భావాలను గౌరవించకపోతే కోపంతో, అహంకారంతో మాట్లాడితే ఎప్పుడూ తానే సరైందని భావిస్తే ఇలాంటి ప్రవర్తన వల్ల మనకు దగ్గరగా ఉన్నవాళ్లే దూరమవుతారు. మిత్రులు కూడా శత్రువులుగా మారిపోతారు. ట్రంప్ దీనికి అతీతులు కాదు.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

### ఈ కేవైసీ తప్పనిసరి

రాష్ట్రవ్యాప్తంగా గ్యాస్ సిలిండర్‌కలిగి ఉన్న లబ్ధిదారులందరూ ఎవరి పేరు పై రిజిస్ట్రేషన్ అయిందో వాళ్ళుఈ నెల 15లోపు కచ్చితంగా ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలి. భవిష్యత్‌లో అనేక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశంఉంది. ఇదివరకే ఈకేవైసీ చేసుకున్నవారు మరల చేసుకోవాల్సిన అవసరం లేదని అధికారులు సూచిస్తున్నారు.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### సమీకృత ఉపాధి హామీ

ఉపాధి హామీని సుస్థిరం చేయడం వైపు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. సగటు కూలి రోజులు 125కి పూర్తి స్థాయిలో చేరుకోవాలి. సమీకృత ఉపాధి వైపు అడుగులు వేయాల్సిందే. మరి అది ఎలాసాధ్యం. పండ్లతోటల పెంపకం వల్లనే సాధ్యం అవుతుంది. లేదా నీటి కుంటల నిర్మాణం వల్లనే సాధ్యం అవుతుంది. సమీకృత ఉపాధి హామీ అంటే ఏమిటి ఒక రైతుకు ఉపాధి హామీ ద్వారా ఒకే దగ్గర వివిధ రూపాలలో లబ్ధి చేకూర్చడం. ఉదాహరణకు పంట కుంటల నిర్మాణం చేసి వాటిలో చెప పిల్లలను పెంచి ఆ చేప కుంటల గట్టు చుట్టూ కూరగాయలు పండ్ల తోటల పెంపకం చేపట్టేట్టు వాళ్లకి అవగాహనా కల్పించాలి. తద్వారా సమీకృత ఉపాధి హామీ సాధ్యం అవుతుంది. తద్వారా ఎక్కువ రోజులు కూలి ఉపాధి హామీలోభాగం కాగలుగుతాడు. వేసవి కాలంలో వ్యవసాయధారులంతా పని లేకుండా ఉంటారు. కావున వారిని 3 నెలల పాటు కాపాడే ఆదాయం అది సమకూర్చగలదు.

- భారత అవినాష్, జనగామ

### శక్తివంతమైన వేదికలు సామాజిక మాధ్యమాలు

సామాజిక మాధ్యమాలు సమాచారాన్ని క్షణాల్లో ప్రపంచమంతా వ్యాప్తి చేసే శక్తివంతమైన వేదికలుగా మారాయి. అయితే అదే వేగంతో తప్పుడు వార్తలు, మార్ఫింగ్ చేసిన వీడియోలు, దారితప్పించే పోస్టులుకూడా విస్తరిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. నిజానిజాలు నిర్ధారించకముందే ఇటువంటిసమాచారం లక్షలాది మందికి చేరి అనవసర భయాందోళనలుసృష్టించడంతోపాటువ్యక్తులప్రతిష్టను దెబ్బతీయగలదు. అంతేకాకుండా ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసి సామాజిక సామరస్యానికి విఘాతం కలిగించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా యువత ఎక్కువ సమయం డిజిటల్ వేదికలపైనే గడపడం వల్ల నిర్ధారణ లేని సమాచారాన్ని సులభంగా నమ్మే, ఇతరులకు పంపించే పరిస్థితి ఏర్పడుతోంది.

- హెచ్.సాయిరుత్విక్, శ్రీకాకుళం

### పెరుగుతున్న వృద్ధుల సంఖ్య

ఈమధ్య దేశం మొత్తం మీద వయోవృద్ధుల సంఖ్య, యువకులకంటే ఎక్కువ ఉన్నట్లు తెలిసింది. అది సహజం, వాస్తవం కూడా. యువకుల సంఖ్యబలం ఎక్కువగా ఉన్నప్పుడే మానవ వనరులు కాస్త ఎక్కువ పొందొచ్చు. ఇది ఆయా పరిస్థితుల్లో వారి ఆరోగ్యాలు, సామాజికస్థితి, అనుకూల ధోరణి ప్రధానం. పెడత్రోవ ధోరణులు అతిగా పెరిగి వ్యక్తి వినాశనం జరుగుతున్నది. ప్రభుత్వం యువకులకు తప్పక ఉపాధి కల్పించాలి.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)


# 'పులి' ఉంటేనే అడవికి మనుగడ!

**నేపాల్‌లో బఫర్‌జోన్ కమ్యూనిటీ ఫారెస్ట్ మోడల్ సక్సెస్ అయ్యింది. అక్కడ స్థానికులకు టూరిజం ఆదా యంలో వాటా ఇచ్చారు. ఫలితంగా వారు స్వచ్ఛందంగా పులులను కంటికి రెప్పలా కాపాడుతున్నారు. రష్యాలో 'అముర్ టైగర్' కోసం గ్రామాలచుట్టూ ఎర్లీవార్నింగ్ సిస్టమ్ పెట్టారు. మనం కూడా ఇలాంటి మోడల్స్‌ని ఆచరణలోకి తెస్తే మరిన్ని ఆశించిన ఫలితాలు రావచ్చు. అంకితభావం గల అటవీ అధికారుల పర్యవేక్షణలో క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతర నిఘాలో రిజర్వ్ అడవులలో పులులసంఖ్య పెరిగినట్టే, ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతేపులి బఫర్ జోన్ దాటి టైగర్ కారిడార్‌లో కూడా సురక్షితంగా బతకగలుగుతుంది. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రభుత్వాలకూ, పౌర సమాజానికి, పత్రికలూ, ప్రసార సాధనాల సహకారం, వన్యప్రాణుల సంరక్షణ కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రభుత్వేతర సంస్థల క్రియాశీలక పాత్రలు తోడైతే ఇది 21వ శతాబ్దపు అతి గొప్ప 'పెద్దపులి సంరక్షణ' కార్యక్రమంగా నిలుస్తుందని చెప్పక తప్పదు.**



డా. నీలం సంపత్

పులుల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమౌతుందనే పర్యావరణ వేత్తల అభిప్రాయాన్ని గౌరవిస్తూ మన దేశంలో పులుల సంరక్షణ కోసం ప్రభుత్వాలు త్రికరణ శుద్ధిగా కృషి చేస్తుండడం అభినందనీయం. స్వతంత్ర భారతంలో తొలి ఇరవై ఐదు సంవత్సరాల కాలంలో దేశంలో పులుల సంఖ్య గణనీయంగాతగ్గి పులి సంతతి దేశంలో అంతర్థానమోతుందేమోననే భయం మొదలైంది. పర్యవసానంగా పులుల సంరక్షణ కోసం 1973లో ప్రాజెక్ట్ టైగర్‌ను భారత ప్రభుత్వం ప్రారంభించింది. తద్వారా పులుల సంరక్షణలో మన దేశం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది. ఇది బహిరంగ రహస్యం. మొదట 9 రిజర్వ్‌లు, 18,278 చ.కి.మీ.ల నుండి నేడు 58రిజర్వ్‌లు, 84,488 చ.కి.మీ.కు పెరిగింది. ఇది దేశ భూభాగంలో 2.6 కావడం గమనార్హం. రిజర్వ్ ఫారెస్ట్‌ల ఏర్పాటు, ఆదివాసీల తోడ్పాటు, సుశిక్షితులైన అటవీ అధికారుల స్ఫూర్తిదాయకమైన మార్గదర్శకత్వం, క్షేత్ర స్థాయి అటవీశాఖ సిబ్బంది త్యాగాల ఫలితంగా 2006లో 1,411గా ఉన్న పులులసంఖ్య 2022 లో 3,682కి పెరిగింది. ప్రపంచ పులుల్లో 75 భారత్‌లోనే ఉన్నాయి. ఈ అద్భుతమైన విజయగాథ చిరస్మరణీయమే. రిజర్వ్ అడవులలో పెరుగుతున్న పులులు ఇరుకుగా మారిన వాటి ఆవాసాలలో ఇమడలేక రిజర్వ్ అడవుల్లో చోటుచాలక 3540 పులులు ఇప్పుడు రిజర్వ్ ఫారెస్ట్ బయటకు వలస వెళ్లాల్సి వస్తోంది. నూతన ఆవాసాల అన్వేషణలో పులులు గ్రామాలు, పొలాలు, రోడ్లతో కూడిన జనావాసాల వైపు దూసుకువస్తున్నాయి. దీంతో మనిషిపులి ఘర్షణలు పెరుగుతున్నాయి. మనుషుల, పశువుల ప్రాణనష్టం జరుగుతోంది. ఫలితంగా పులుల పట్ల ప్రజల్లో తీవ్రవ్యతిరేకత, భయం పెరిగి వాటిని వేటాడే పరిస్థితులు వస్తున్నాయి. తెలంగాణ, కర్ణాటకతో సహా పలురాష్ట్రాల్లో ప్రజల ఆగ్రహానికి పెద్ద సంఖ్యలో పులులు బలైన వైనం బహిరంగ రహస్యమే. దీనికి తోడు అంతర్జాతీయ విఫణిలో పులి చర్మానికి, గోర్లకు ఉన్న డిమాండ్, 'ఔషధ గుణాలున్నాయి' అనే మూఢనమ్మకాల కారణంగా వేటగాళ్ల ఉచ్చులో పడి రిజర్వ్ అడవుల లోపలే అడపా తడపా పులులు ప్రాణాలు కోల్పోతున్నాయి. దుర్భేద్యమైన రిజర్వ్ అడవులలోనే పోచింగ్ సాధ్యమైనప్పుడు రిజర్వ్ అడవుల బయట పులులను పోచింగ్ బెడద నుండి కాపాడడం కష్టంగా మారుతుందని చెప్పక తప్పదు. ఈ సమస్య పరిష్కారానికి 2025 అక్టోబర్ 6న డెహ్రాడూన్ లోని ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్‌లో జరిగిన వైల్డ్ లైఫ్ వీక్‌లో భాగంగా కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ, నేషనల్ టైగర్‌కన్జర్వేషన్ అథారిటీలు సంయుక్తంగా రూ.88.7 కోట్ల బడ్జెట్‌తో మూడు సంవత్సరాల కాలపరిమితితో టిఒటిఆర్ అనే వినూత్న పులుల సంరక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. రిజర్వ్‌ఫారెస్ట్ బయట కూడా శాస్త్రీయంగా, ల్యాండ్‌స్కేప్ ఆధారితంగా పులులను కాపాడటం. అదే సమయంలో మనుషుల ప్రాణాలు, జీవనోపాధికి భంగం కలగకుండా చూడటం. రియాక్టివ్‌గా కాకుండా ప్రోయాక్టివ్‌గా, టెక్నాలజీ, ప్రజల భాగస్వామ్యంతో పని చేయడమే దీని స్ఫూర్తి. త్రిముఖ వ్యూహంగా టి.ఒ.టి.ఆర్ పని చేస్తుంది? కమ్యూనికేషన్ సిస్టమ్స్ అప్ గ్రేడ్, త్వరితగతిన స్పందించే రెస్క్యూ టీములు, రెస్క్యూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మెరుగుపరచడం. రిజర్వ్ అడవుల బయట మనుషులు పులులు కలిసి జీవించే పరిస్థితులుసృష్టించడం. అవగాహన కార్యక్రమాలు, నష్టపోయిన వారికి సకాలంలో పరిహారం. ఆలస్యం చేస్తే ప్రజలు



ప్రభుత్వంపై నమ్మకం కోల్పోతారు. గ్రామస్తులను భాగస్వాములుగా చేయాలి. ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ 2022 ప్రకారం 212 ఫారెస్ట్ డివిజన్లలో పులులున్నాయి. వాటిలో మొదటి ఫేజ్‌గా 9 రాష్ట్రాల్లోని 40డివిజన్లను ఎంపిక చేయడం జరిగింది. అవి ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, అస్సాం, తెలంగాణలు. తెలంగాణలో కవ్వాల్ టైగర్ రిజర్వ్‌ను ఎంపిక చేయడం హర్షనీయమే. సమీప గతంలో మహారాష్ట్ర లోని తాడోబా, తిప్పేశ్వర్, ఛత్తీస్‌గఢ్ ఇంద్రావతి నుండి కవ్వాల్‌కు పులులు వచ్చేందుకు కుమ్రం భీం టైగర్ కన్జర్వేషన్ కారిడార్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒక రిజర్వ్ నుండి మరో రిజర్వ్‌కు పులులు వలసవెళ్లే క్రమంలో అనివార్యంగా రిజర్వ్ బయట వాటిసంచారం కనిపిస్తోంది. అందుకే రిజర్వ్ బయట వాటి సంరక్షణ కోసమే టి.ఒ.టి.ఆర్‌ను ప్రతిపాదించారు. గతంలో రిజర్వ్ ఫారెస్ట్‌లను వ్యతిరేకించిన రాజకీయ పార్టీలే నిన్న గాక మొన్న టైగర్ కారిడార్ ప్రాంతాలలో నివసిస్తున్న గిరిజనులను, సమీప ప్రాంతాలలో నివసిస్తున్న గిరిజనేతరులను టైగర్ కారిడార్‌కు వ్యతిరేకంగా రెచ్చగొట్టిన వైనం శోచనీయం. పులుల సంరక్షణతో పర్యావరణ పరిరక్షణ, సుస్థిరతతో కూడిన అభివృద్ధి జరుగుతుందన్న విషయాన్ని పక్కనపెట్టి కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఈధోరణిని ప్రదర్శించడం దురదృష్టకరమనేది పులుల సంరక్షణ నిపుణుల నిశ్చితాభిప్రాయం. ఎందుకంటే టైగర్ కారిడార్ మూలంగా పోడుసేద్యం చేసుకుంటున్న గిరిజనులు, గిరిజనేతరుల ఆవాసాలు చెదిరి వారి మనుగడే ప్రమాదంలో పడుతుందని వాదిస్తున్న రాజకీయపార్టీల నేతలు దేశంలో అనేక ఇతరరాష్ట్రాలలో పాలన కొనసాగిస్తున్న తమ పార్టీ ప్రభుత్వాలు అభివృద్ధిసాకుతో లక్షల హెక్టార్ల అటవీ భూములను కార్పొరేట్లకు అప్పణంగా అప్పగిస్తుంటే మౌనంగా ఉండడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమే ననేది పర్యావరణ వేత్తల అభిప్రాయం. ఈ పరిస్థితులలో కొమ్రం భీం టైగర్ కారిడార్‌లో పోయినేడాది ప్రవేశపెట్టిన టి.ఒ.టి.ఆర్‌కు రాజకీయ పార్టీల నేతలు ఏవిధంగా సహకరిస్తారో వేచిచూడక తప్పదు. మరోవైపు గ్రామాల్లో పులి మ్యానీటర్ గామారింది 'పులి వస్తే చంపేయాలి' అనే భయం ఉంది. ఈ భయాన్ని పోగొట్టి 'పులి ఉంటే అడవి బాగుంటుంది, అడవితోనే మానవ మనుగడ సుస్థిరమౌతుందనే అవగాహన ప్రజలలో కలిగించాలి. టెక్నాలజీ తోడ్పాటు మానవ వనరుల కల్పన గిరిజన భాగస్వామ్యంతో పైలట్ ప్రాజెక్ట్ అమలులో వున్న రాష్ట్రాల్లో కెమెరా ట్రాప్స్, డ్రోన్స్, నిఘా, ముందస్తు హెచ్చరికలతో పాటు శిక్షణ పొందిన అటవీ సిబ్బంది, వెటర్నరీ డాక్టర్లు, రెస్క్యూ టీములు పని చేస్తాయి. బాధితులకు పరిహారం వేగంగా అందించడం కూడా జరుగుతోంది. ఇక్కడ అత్యంత కీలకం ఆదివాసీ భాగస్వామ్యం. శతాబ్దాలుగా అడవిలో బ్రతికే గిరిజనులకు పులి కదలికలు, అడవి రహస్యాలు బాగా తెలుసు. వారిని 'ఫారెస్ట్ గార్డ్స్' 'ఈకో గైడ్స్'గా నియమిస్తే టి.ఒ.టి.ఆర్ 200 సక్సెస్ అవుతుంది. వారిని భాగస్వాములు చేయకుండా పైనుండి ఉత్తర్వులుఇస్తే ఈ ప్రాజెక్ట్ ఆశించిన ఫలితాలను అందించడంలో విఫలమయ్యే ప్రమాదం ఉంది. నేపాల్‌లో బఫర్‌జోన్ కమ్యూనిటీ ఫారెస్ట్ మోడల్ సక్సెస్ అయ్యింది. అక్కడ స్థానికులకు టూరిజం ఆదాయంలో వాటా ఇచ్చారు. ఫలితంగా వారు స్వచ్ఛందంగా పులులను కంటికి రెప్పలా కాపాడుతున్నారు. రష్యాలో 'అముర్ టైగర్' కోసం గ్రామాలచుట్టూ ఎర్లీవార్నింగ్ సిస్టమ్ పెట్టారు. మనం కూడా ఇలాంటి మోడల్స్‌ని ఆచరణలోకి తెస్తే మరిన్ని ఆశించిన ఫలితాలు రావచ్చు. అంకితభావం గల అటవీ అధికారుల పర్యవేక్షణలో క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతర నిఘాలో రిజర్వ్‌అడవులలో పులులసంఖ్య పెరిగినట్టే, ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతే పులి బఫర్ జోన్ దాటి టైగర్ కారిడార్‌లో కూడా సురక్షితంగా బతకగలుగుతుంది. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రభుత్వాలకూ, పౌర సమాజానికి, పత్రికలూ, ప్రసార సాధనాల సహకారం, వన్య ప్రాణుల సంరక్షణ కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రభుత్వేతర సంస్థల క్రియాశీలక పాత్రలు తోడైతే ఇది 21వ శతాబ్దపు అతి గొప్ప 'పెద్దపులి సంరక్షణ' కార్యక్రమంగా నిలుస్తుందని చెప్పక తప్పదు. ●

# గిగ్ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక ప్రణాళిక

సి.హెచ్.ప్రతాప్

డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మారిన శ్రామికులకు సామాజిక భద్రత అవసరం అన్న డిమాండ్ ప్రస్తుతం ఊపందుకుంది. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తున్న కొద్దీ గిగ్, ప్లాట్‌ఫామ్ ఆధారిత ఉపాధి అవకాశాలు వేగంగా పెరుగుతున్నాయి. డెలివరీ సిబ్బంది, క్యాబ్ డ్రైవర్లు, కిరాణా సరుకులు అందించే సిబ్బంది, గృహ సేవలు అందించే కార్మికులు ఆధునిక నగర జీవనానికి అవిభాజ్య భాగంగా మారారు. వినియోగదారుడి ఇంటి గడపకు చేరే ప్రతి సేవ వెనుక ఒక శ్రామికుడి శ్రమ ఉంది. అయితే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు అభివృద్ధి చెందుతున్న వేగంతో కార్మికుల సామాజిక భద్రత కూడా బలోపేతం కావాల్సిన అవసరం ఉంది. గిగ్ పనిలో సమయసౌలభ్యం, కొంత స్వతంత్రత ఆకర్షణీయ అంశాలే. కానీ దాని వెనుకఆదాయ అనిశ్చితి, ఇంధన వ్యయం, వాహన నిర్వహణ భారం, రోడ్డు ప్రమాదాల ముప్పు, వర్షం-ఎండలో పనిచేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. అనారోగ్యం లేదా ప్రమాదం కారణంగా పనిచేయలేకపోతే ఆదాయం వెంటనే నిలిచిపోవచ్చు. రేటింగ్‌లు, ప్రోత్సాహకాలు, పనుల కేటాయింపు, ఖాతా నిలిపివేత వంటి ప్లాట్‌ఫామ్ నిర్ణయాలు కూడా జీవనోపాధిపై ప్రభావం చూపగలవు. అందువల్ల ఫ్లెక్సిబిలిటీ పేరుతో భద్రతను విస్మరించడం సమర్థనీయం కాదు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్లాట్‌ఫామ్ బేస్డ్ గిగ్ వర్కర్స్ (రిజిస్ట్రేషన్, సోషల్ సెక్యూరిటీ అండ్ వెల్ఫేర్) యాక్ట్, 2026 ఒక ముఖ్యమైన ముందడుగు. ఈ చట్టం గిగ్ కార్మికుల నమోదు, ప్రత్యేక గుర్తింపు, సంక్షేమ బోర్డు, సంక్షేమ నిధి, సామాజిక భద్రతా పథకాలు, ఫిర్యాదు పరిష్కారం వంటి అంశాలకు వ్యవస్థను కల్పిస్తోంది. అయితే చట్టం అమలులోకి వచ్చే తేదీని ప్రభుత్వం ప్రత్యేక గెజిట్ నోటిఫికేషన్ ద్వారా నిర్ణయించాల్సి ఉంటుంది. అలాగే నిర్దిష్ట బీమా మొత్తం లేదా ప్రతి కార్మికుడికి ఒకే విధమైన సంక్షేమ ప్రయోజనాలను చట్టం నేరుగా హామీ ఇవ్వదు. ప్రభుత్వం రూపొందించే పథకాల ద్వారా ప్రయోజనాలు అమలవుతాయి. ఇక చేయాల్సింది మరింత స్పష్టంగా ఉండాలి. పని గంటలకు గరిష్ఠ పరిమితి, నిర్బంధ విశ్రాంతి విరామాలు, వరుసగా అధిక గంటలు పనిచేయకుండా రక్షణ వంటి నిబంధనలను భవిష్యత్ నియంత్రణలో పరిగణించాలి. ప్రమాదంలో గాయపడినప్పుడు తక్షణ వైద్య సహాయం, ఆసుపత్రి ఖర్చుల భర్తీ, ప్రమాద మరణం లేదా శాశ్వత వైకల్యానికి తగిన పరిహారం కల్పించే సమగ్ర ప్రమాద బీమా అవసరం. కుటుంబ ఆరోగ్యం, ఆసుపత్రి చికిత్స, ప్రసూతి, మానసిక ఆరోగ్యం వంటి అంశాలను కూడా ఆరోగ్య బీమా పరిధిలోకి తీసుకురావాలి. అదేవిధంగా అనారోగ్యం, ప్రమాదం లేదా ప్రసూతి సమయంలో ఆదాయ పరిరక్షణ, వృద్ధాప్యానికి పెన్షన్ లేదా దీర్ఘకాలిక పొదుపు, నైపుణ్యాభివృద్ధి, చట్టపరమైన సహాయం వంటి భద్రతా వ్యవస్థలు అవసరం. ఒక ప్లాట్‌ఫామ్ నుంచి మరొకదానికి మారినా ప్రయోజనాలు కోల్పోకుండా పోర్టబుల్ సామాజిక భద్రతా ఖాతా ఏర్పాటు చేయాలి. చెల్లింపులు, కోతలు, ప్రోత్సాహకాలు, రేటింగ్‌లు, అల్గారిథమిక్ నిర్ణయాలపై పారదర్శకత తప్పనిసరి చేయాలి. అన్యాయంగా ఖాతా నిలిపివేతకు స్వతంత్ర అప్పీల్ వ్యవస్థ ఉండాలి. కేంద్ర స్థాయిలో కోడ్ ఆన్‌సోషల్ సెక్యూరిటీ, 2020కూడా గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులను సామాజిక భద్రతా చట్రంలోకి తీసుకొచ్చింది. ఈశ్రమ్ వంటి నమోదు వ్యవస్థలతో రాష్ట్రాల సంక్షేమ పథకాలను అనుసంధానించడం ద్వారా కార్మికుల ప్రయోజనాలను మరింత పోర్టబుల్‌గాచేయవచ్చు. కార్మిక సంక్షేమం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు. ప్లాట్‌ఫామ్ సంస్థలు కూడా తమ వ్యాపార నమూనాలో సామాజిక భద్రతా వ్యయాన్ని అంతర్భాగంగా చూడాలి. తెలంగాణ ప్రభుత్వం గతంలో ప్రతిపాదించిన విధానంలోప్రమాద, ఆరోగ్య బీమాకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది కూడా. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ విజయం యాప్‌ల వేగంతో కాదు. ఆయాప్‌ల వెనుక పనిచేసే మనుషుల భద్రత, గౌరవం, భవిష్యత్తుతో కొలవాలి. సాంకేతిక ఆవిష్కరణఉపాధిని సృష్టించాలి. గిగ్ ఆర్థికవ్యవస్థకు నిజమైన బలం కావాలంటే ఫ్లెక్సిబిలిటీతో పాటు భద్రత, ఆదాయంతోపాటు బీమా, ఉపాధితో పాటు గౌరవం ప్రతి కార్మికుడికి అందాలి. ●

# సామాన్యుడి నెత్తిపై ధరల పిడుగు



జీ. శ్రీలత

ఒక కుటుంబం ఆర్థిక పరిస్థితిని అంచనా వేయడానికి భారీ ఆర్థిక గణాంకాలు అవసరం లేదు. ఆ కుటుంబం నెలకు తెచ్చే సరుకుల జాబితాను ఒకసారి పరిశీలిస్తే చాలు. బియ్యం, పప్పు, వంటనూనె, పంచదార, గోధుమలు, కూరగాయలు, పాలు, ఇంధనం. వీటి ధరలు ఎంత పెరిగాయి? అనే ప్రశ్నలకు సమాధానం వెతికితే సామాన్యుడి ఆర్థిక స్థితి ఏ దిశగా వెళ్తుందో స్పష్టంగా అర్థమవుతుంది. ప్రస్తుతం దేశంలో అదే జరుగుతోంది. ఆదాయాలు పెరిగే వేగం కంటే నిత్యావసరాల ధరలు పెరుగుతున్న వేగం ఎక్కువగా ఉండటంతో కోట్లాది కుటుంబాల నెలవారీ బడ్జెట్ అస్తవ్యస్తమవుతోంది. ధరల పెరుగుదల ఇప్పుడు కేవలం మార్కెట్‌లో కనిపించే సంఖ్య కాదు.. అది ప్రతి ఇంటి వంటగదిలో కనిపిస్తున్న మంట. గత ఫిబ్రవరి 28 నుంచి ఆగస్టు 3 మధ్య కేవలం ఐదు నెలల వ్యవధిలోనే వంటింట్లో నిత్యం ఉపయోగించే అనేక సరుకుల ధరలు 5 శాతం నుంచి 40శాతం వరకు పెరిగినట్టు మార్కెట్ గణాంకాలు చెబుతున్నాయి. ప్రాథమిక ఆహార వస్తువుల ధరలు పెరగడం అంటే పేద, మధ్యతరగతి కుటుంబాలపై నేరుగా అదనపు భారం పడటమే. సంపాదనలో గణనీయమైన భాగం ఆహారం, ఇంధనం, విద్య, వైద్యం వంటి ప్రాథమిక అవసరాలకే వెచ్చించాల్సి వస్తే పొదుపు ఎలా సాధ్యం? భవిష్యత్తు కోసం పెట్టుబడి ఎలా పెట్టగలరు? పిల్లల విద్య, ఆరోగ్యం వంటి అవసరాలకు ఎలా కేటాయించగలరు? ధరల పెరుగుదలకు అంతర్జాతీయ పరిణామాలు, యుద్ధాలు, వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితులు, ఇంధన ధరలు, దిగుమతులపై ఆధారపడటం వంటి అనేక కారణాలు ఉన్నాయనడంలో సందేహంలేదు. ప్రపంచ ఆర్థికవ్యవస్థ పరస్పర ఆధారితంగా మారిననేపథ్యంలో ఒక దేశంలో జరిగేయుద్ధం, మరో దేశంలో ఏర్పడే వాతావరణ సంక్షోభం కూడా మన వంటింటిపై ప్రభావం చూపుతోంది. యుద్ధాలు ప్రభుత్వాల చేతుల్లో ఉండకపోవచ్చు. వాతావరణాన్ని కూడా నియంత్రించలేం. అంతర్జాతీయ మార్కెట్లను పూర్తిగా శాసించలేం. కానీ వాటి ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి దేశీయమార్కెట్‌ను రక్షించే విధానాలను రూపొందించడం మాత్రం ప్రభుత్వాల బాధ్యత. ఆహారనిల్వలను సమర్థంగా నిర్వహించడం, సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం, రైతులను ప్రోత్సహించడం, దిగుమతులపై అధిక ఆధారపడకుండావ్యూహాలు రూపొందించడం, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరతను అరికట్టడం వంటి చర్యలు ప్రభుత్వ పరిధిలోనే ఉంటాయి. అందుకే ధరలు పెరిగిన ప్రతిసారీ అంతర్జాతీయ పరిస్థితులను కారణంగా చూపడం కంటే ప్రభుత్వం ముందస్తుగా



ఏం చేసింది? ఇంకా ఏం చేయాలి? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. భారతదేశంలో కోట్లాది కుటుంబాలకు బియ్యం కేవలం ఒక ఆహార పదార్థం కాదు. అది వారి రోజువారీ జీవితంలో అత్యంత ప్రాథమిక అవసరం. అలాంటి బియ్యం ధరలు గణనీయంగా పెరగడం ఆందోళన కలిగించే పరిణామం. దేశంలో 2025-26పంట సంవత్సరంలో వరి ఉత్పత్తి రికార్డు స్థాయిలో ఉంటుందని ప్రభుత్వ అంచనాలున్నప్పటికీ, మార్కెట్‌లో బియ్యం లభ్యత తగ్గి ధరలు పెరగడం విరుద్ధమైన పరిస్థితిని సూచిస్తోంది. ఉత్పత్తి ఉన్నప్పటికీ వినియోగదారుడికి ధర ఎందుకు తగ్గడం లేదు? రైతు నుంచి వినియోగదారుడి వరకు ఉన్న సరఫరా గొలుసులో ఎక్కడ సమస్య ఉంది? నిల్వలు ఎలా ఉన్నాయి? మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా? మధ్యవర్తుల పాత్ర ఎంత? ప్రభుత్వం వద్ద ఉన్న బఫర్ స్టాక్స్ పరిస్థితి ఏమిటి? రైతుకు తగిన ధరరావాలి. అదే సమయంలో వినియోగదారుడిపై అనవసరమైన భారం పడకూడదు. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడమే సమర్థవంతమైన వ్యవసాయ, ఆహార విధానానికి కొలమానం. నిత్యావసర వస్తువుల ధరల్లో వంటనూనెది ప్రత్యేక స్థానం. భారతదేశం తన దేశీయ అవసరాల్లో గణనీయమైన భాగం కోసం దిగుమతులపై ఆధారపడుతోంది. అంతర్జాతీయమార్కెట్లలో ధరలు పెరిగినా, యుద్ధాలు జరిగినా, సముద్ర రవాణాకు అంతరాయం ఏర్పడినా దానిప్రభావం నేరుగా భారతీయ వినియోగదారుడిపై పడుతుంది. ఇది తాత్కాలిక సమస్యగా చూడటం ప్రమాదకరం. దేశీయంగా నూనెగింజల ఉత్పత్తిని పెంచే దీర్ఘకాలిక వ్యూహం అవసరం. రైతులకు మెరుగైన విత్తనాలు, సాగు సాంకేతికత, మార్కెట్ హామీ, గిట్టుబాటు ధర కల్పించకుండా దిగుమతులపై ఆధారపడటంకొనసాగిస్తే ప్రతి అంతర్జాతీయ సంక్షోభం మన వంటింటిని ప్రభావితం చేస్తూనే ఉంటుంది. పంచదార ధరలు 8నుంచి 15 శాతం వరకు పెరగడం మరో ఆందోళనకర పరిణామం. హోల్‌సేల్ మార్కెట్‌లో క్వింటాల్‌కు గణనీయమైన పెరుగుదల నమోదవుతుండగా, దేశంలోని ప్రధాన నగరాల్లోరిటైల్ ధరలు కూడా పైకి కదులుతున్నాయి. సరఫరా తగినంతగా లేకపోతే ధరలు మరింత ఎగిసే అవకాశం ఉంటుంది. వాతావరణ మార్పులు వ్యవసాయ రంగానికి కొత్త సవాళ్ల విసురుతున్నాయి. ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితులు వర్షపాతంపై ప్రభావం చూపితే పంటల సాగు, ఉత్పత్తి రెండూ దెబ్బతింటాయి. ఇప్పటికే ఖరీఫ్ పంట విస్తీర్ణం గత ఏడాదితో పోలిస్తే తగ్గినట్టు మార్కెట్ వర్గాల అంచనాలు చెబుతున్నాయి. సాగు తగ్గితే ఉత్పత్తి తగ్గుతుంది. ఉత్పత్తి తగ్గితే సరఫరా తగ్గుతుంది. సరఫరా తగ్గితే ధర పెరుగుతుంది. ధర పెరిగితే చివరికి భారం వినియోగదారుడిపైనే పడుతుంది. ధరలు పెరిగిన తర్వాత స్పందించడం కంటే ధరలు పెరగడానికి దారితీసే పరిస్థితులను ముందుగానే గుర్తించడం ప్రభుత్వాల బాధ్యత. దేశ ఆర్థిక వ్యవస్థకు నిజమైన అద్దం స్టాక్ మార్కెట్ సూచీలు కాదు. సామాన్యుడి వంటగది. ఆ వంటగదిలో మంట అదుపులో ఉన్నప్పుడే దేశ ఆర్థిక ప్రగతి నిజమైన అర్థాన్ని సంతరించుకుంటుంది. ●

# తిరుమల సమాచారం



## గోవిందరాజస్వామి ఆలయంలో చక్రత్తాళ్వార్ సాత్తుమొర

**తిరుమల, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో బుధవారం చక్రత్తాళ్వార్ సాత్తుమొర, ప్రతివాది భయంకరన్ అన్నన్ సాత్తుమొర వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణస్వామి ఆలయం నుండి ఉభయ నాంచారులతో వరదరాజ స్వామి, ప్రతివాది భయంకరన్ అన్నన్ స్వామివార్లను ఆలయ నాలుగు మాడ వీధుల్లో మంగళవాయిద్యాల నడుమ ఊరేగించి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం తిరుమల శ్రీవారి ఆలయం నుండి తీసుకొచ్చిన అప్పవడి ప్రసాదాన్ని కోదండరామాలయం నుండి లక్ష్మీనారాయణస్వామి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చి సాత్తుమొర నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి, చక్రత్తాళ్వార్ స్వామివార్లను ఆలయ నాలుగు మాడ వీధుల్లో వైభవంగా ఊరేగించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆలయాల డిప్యూటీ ఇఒ వి.ఆర్. శాంతి, ఎఇఒ ఎబి నారాయణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవ 'శిక్షకుడికి శిక్షణ'



**తిరుమల, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడిలో శ్రీవారి సేవను మరింత బలోపేతం చేసి భక్తులకు ఇంకా నాణ్యమైన సేవలు అందించేందుకు శ్రీవారి సేవ శిక్షకుడికి శిక్షణ (ట్రైన్ ది ట్రైనర్స్) రెండో విడత శిక్షణ విజయవంతంగా ముగిసింది. ముఖ్యమంత్రి సూచనలతో ప్రభుత్వ ప్రణాళిక విభాగం సహకారంతో టిటిడి ప్రజా సంబంధాల శాఖ 43రోజులు నిర్వహించిన శ్రీవారి సేవ ట్రైన్ ది ట్రైనర్స్ బుధవారం ముగిసింది. జులై 1న ప్రారంభమైన ఈ రెండో విడత శిక్షణలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రతో పాటు ఉత్తర భారత రాష్ట్రాలకు చెందిన 1,888 మంది శ్రీవారి సేవ గ్రూప్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. మొదటి బ్యాచ్‌తో కలిపి ఇప్పటి వరకు దాదాపు 3 వేల మంది గ్రూప్ సూపర్‌వైజర్లు శిక్షణ పొందారు. శ్రీవారి సేవకుల్లో సేవా నైపుణ్యాలు, సేవాభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. శిక్షణ పొందిన ట్రైనర్లు తమ తమ మండలాలు, జిల్లాల్లో ఆన్‌లైన్ ద్వారా శ్రీవారి సేవకు నమోదు చేసుకున్న సేవకులకు తిరుమలకు వచ్చే ముందే శిక్షణ అందించే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. సేవకుల్లో సేవా నాణ్యత, అంకితభావం, బాధ్యతాయుత ప్రవర్తన మరింత పెరిగి, తిరుమలకు విచ్చేసే భక్తులకు సమర్థవంతమైన, క్రమశిక్షణతో కూడిన, భక్తి భావపూర్వక సేవలు అందించేందుకు దోహదపడుతుంది.


## 21న వరలక్ష్మీ వ్రతం.. నేడు టికెట్ల విడుదల



**తిరుమల, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుచానూరు పద్మావతి ఆలయంలో ఈనెల 21న శుక్రవారం వరలక్ష్మీ వ్రతం జరగనుంది. ఈ వ్రతాన్ని వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని టిటిడి జెఇఒ ఎ.శరత్ అధికారులను ఆదేశించారు. తిరుచానూరులోని ఆస్థానమండపంలో బుధవారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానితో కలిసి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శనం, క్యూలైన్లు, తాగునీరు, మజ్జిగ, అన్నప్రసాదం, పారిశుద్ధం, భద్రత తదితర ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జెఇఒ సూచించారు. వ్రతం సందర్భంగా అభిషేకం, అభిషేకానంతర దర్శనం, లక్ష్మీపూజ, కల్యాణోత్సవం, బ్రేక్ దర్శనం, ఊంజల్‌సేవలను రద్దు చేసినట్లు తెలిపారు.

**నేడు ఆన్‌లైన్‌లో టిక్కెట్లు:** వరలక్ష్మీ వ్రతం సందర్భంగా గురువారం (నేడు) ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో టికెట్లను విడుదల చేయనున్నారు. ఆఫ్ లైన్ టికెట్లను ఒక రోజు ముందు ఆలయ ముందు ఉన్న కౌంటర్‌లో విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ హరీంద్రనాథ్, ఎస్ఇ నరసింహామూర్తి, డిఇ రవిశంకర్‌రెడ్డి, అదనపు ఆరోగ్యఅధికారి డాక్టర్ సునీల్, ఎఇఒ దేవరాజులు, ఎవిఎస్ఒ శ్రీహరిరావు, కేటరింగ్ అధికారి విజయభాస్కర్, ఆలయ అర్చకులు, పాల్గొన్నారు.

## కోదండరామాలయంలో హనుమంత వాహనసేవ



**తిరుమల, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి కోదండరామస్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా బుధవారం సహస్ర కలశాభిషేకం, హనుమంత వాహనసేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైఖానస ఆగమం ప్రకారం వైష్ణవ ఆలయాల్లో పౌర్ణమి, అమావాస్య, శుక్ల ఏకాదశి, కృష్ణ ఏకాదశి, శ్రవణం, పునర్వసు నక్షత్రాలకు విశేష ప్రాధాన్యం ఉంది. ఉదయం సహస్ర కలశాభిషేకం సేవను ఆగమోక్తంగా నిర్వహించారు. 500 రూపాయలు చెల్లించి సేవలో పాల్గొన్న గృహస్తులకు (ఇద్దరికి) ఉత్తరీయం, రవికె, లడ్డూ, వడ ప్రసాదాలను అందజేశారు. బుధవారం రాత్రి 9గంటల వరకు హనుమంత వాహనసేవను వైభవంగా నిర్వహించారు. సర్వాలంకార భూషితులైన కోదండరామస్వామి తనకు అత్యంత ప్రీతిపాత్రమైన హనుమంత వాహనాన్ని అధిష్ఠించి ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఇఒబి. నాగరత్న, సూపరింటెండెంట్ కె.శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఆలయ అర్చకులు భక్తులు పాల్గొన్నారు.


## ఎస్వీ గోశాలలో ప్రపంచ ఏనుగుల దినోత్సవం

**తిరుమల, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచ ఏనుగుల దినోత్సవం సందర్భంగా తిరుపతి ఎస్వీ గోశాలలో టిటిడి ఆలయ ఊరేగింపుల్లో పాల్గొనే లక్ష్మి, ్మ, వైష్ణవి, పద్మావతి అనే మూడు ఆడ ఏనుగులకు ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం గోశాల డైరెక్టర్ ఎ.వి.ఎన్. శివకుమార్ సమక్షంలో జరిగింది. ఆలయ సంప్రదాయాల్లో భాగంగా సేవలందిస్తున్న గజరాజులను టిటిడి ప్రేమతో, ఆధ్యాత్మిక భావంతో సంరక్షి స్తూ, వాటి ఆరోగ్యం, సంక్షే మానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుం టోంది. ప్రపంచ ఏనుగుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు గజరాజుల పట్ల భక్తులకున్న గౌరవం, అనుబంధాన్ని చాటాయి.



# తిరుమలలో అధునాతన బయోగ్యాస్ ప్లాంట్

**● రూ.12.85 కోట్లతో ఏర్పాటు ● రోజుకు 40టన్నుల సామర్థ్యంతో ఉత్పత్తి**





**తిరుమల, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో రానున్న రోజుల్లో నిత్యావసరాలకు అవసరమైన బయో గ్యాస్‌ను వినియోగించుకునేందుకు టిటిడి పనులు చేపట్టింది. ఇప్పటికే ఈ ప్లాంట్ నిర్మాణం పనులు పూర్తికావడంతో పైప్‌లైన్ ఏర్పాటు పనులు సాగుతున్నాయి. తిరుమలలో కాకులమానుతిప్ప వద్ద రూ.12.85 కోట్ల అంచనాతో రోజుకు 40టన్నుల సామర్థ్యంతో బయోగ్యాస్ ఉత్పత్తి చేయనుంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ నిర్వహణలో ఈ బయో గ్యాస్ ప్లాంట్ రూపుదిద్దుకుంది. తిరుమలకొండపై భక్తుల అవసరాలకు తగ్గట్లు తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనంలో అన్నప్రసాదాలు, లడ్డూప్రసాదాల తయారీకి కూడా అవసరమైన బయోగ్యాస్‌ను టిటిడి స్వతహాగా ఉత్పత్తి చేసుకోనుంది. శేషాచలకొండల్లోని కాకులమానుతిప్ప వద్ద బయోగ్యాస్ ప్లాంట్ 2.22 ఎకరాల్లో నిర్మించారు. 0.17ఎకరాల్లో కంపోస్టు నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ప్లాంట్ నిర్మాణంలో ఐఒసిఎల్ రూ.7.05 కోట్లు, టిటిడి రూ.5.80 కోట్లు వెచ్చించింది. ఈ ప్లాంట్ ద్వారా తిరుమలలో చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. తడి/ ఆహార వ్యర్థాలను ప్రాసెస్ చేయడం ద్వారా వ్యర్థాల నుండి గ్యాస్ ఉత్పత్తి అవుతుంది. పర్యావరణ పరిరక్షణతో పాటు టిటిడికి యేటా రూ.1.52 కోట్లు ఆదా చేస్తుంది. ఆర్థికంగా కూడా వెసులుబాటు కలుగుతుంది. ఇప్పటికే తిరుమలలో రోజువారీగా గ్యాస్ వినియోగం పెరిగింది.

గతంలో 60వేల మంది యాత్రికులు అన్నప్రసాదాలు స్వీకరించే వారి సంఖ్య ప్రస్తుతం లక్ష మంది నుండి 1.30లక్షల మంది వరకు రోజువారీగా ఉంటున్నారు. దీంతో తయారీ కూడా పెరిగింది. ఈ ప్లాంట్ అందుబాటులోకి వస్తే ఇక్కడ ఉత్పత్తి అయ్యే బయోగ్యాస్‌ను లడ్డూ ప్రసాదాలు, అన్నప్రసాదాల తయారీకి వినియోగించేలా చూడనున్నారు. తిరుమలలో ప్రతి రోజు ప్రోగయ్యే 55 టన్నుల తడి వ్యర్థాల్లో 40 టన్నులు ఐఒసిఎల్ ప్లాంటుకు తరలిస్తారు. ఈ ప్లాంట్‌లో 45 మెట్రిక్ టన్నుల మోండెడ్ స్టోరేజ్ వెసల్స్, 1500 కిలోల వేపరైజర్, అగ్నిమాపక యంత్రాంగం, స్ప్రింక్లర్ వ్యవస్థ, రెండు వాటర్ ట్యాంకులు, డీజిల్ జనరేటర్ సెట్, రిమోట్ ఆపరేటింగ్ వాల్వులు, గ్యాస్లీకేజ్ అలారం, ట్యాంక్ లారీ డికాంటేషన్ వ్యవస్థ, సిసిటివి, ఇఎంఎస్, టిఎఫ్ఎంఎస్, ఐఎల్ఎస్‌డి వంటి అత్యాధునిక భద్రతా పరికరాలు ఏర్పాటు చేశారు. మిశ్రమపదార్థాల బయోగ్యాస్ అన్నప్రసాదాల తయారీకి వినియోగిస్తారు.

# మాషా అల్లా ఎంటర్‌ప్రైజెస్ బాధితులకు న్యాయం చేస్తాం

**ప్రజల వినతులపై బాధ్యతగా స్పందిస్తాం, పరిష్కరిస్తాం ● టిడిపి కేంద్ర కార్యాలయంలో హోంమంత్రి అనిత**



**మంగళగిరి, ఆగస్టు 12 ప్రభాతవార్త:** ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని బాధ్యతగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ప్రజలు ఒక నమ్మకంతో తమ సమస్యలను ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొస్తారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టేలా పనిచేస్తామని తెలిపారు. బుధవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో హోంమంత్రి పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 65 వినతులను స్వీకరించారు. ఒక్కొక్కరి సమస్యను అడిగి తెలుసుకుని, పరిష్కారం సాధ్యమైన అంశాలపై సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. మాషా అల్లా ఎంటర్‌ప్రైజెస్ వ్యవహారంలో డబ్బులు కోల్పోయామని పేర్కొంటూ పలువురు బాధితులు హోంమంత్రిని కలిసి తమ సమస్యను వివరించారు. ఈ వ్యవహారంలో దాదాపు 200 మంది బాధితులు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని హోంమంత్రి తెలిపారు. బాధితుల ఫిర్యాదులపై ప్రభుత్వం స్పందించిందని, వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపేందుకు డిసిపి తిరుమలేశ్వరరెడ్డి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బాధితుల ఫిర్యాదులను పరిశీలించి, దర్యాప్తులో వెల్లడయ్యే అంశాల ఆధారంగా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. కష్టపడి సంపాదించుకున్న సొమ్మును నమ్మకంతో పెట్టుబడి పెట్టి నష్టపోయిన వారి ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకుంటుందని హోంమంత్రి పేర్కొన్నారు.

**చిన్నారి చదువుకు భరోసా:** తండ్రికి ఉపాధిపై అధికారులతో మాట్లాడిన హోంమంత్రి ప్రజా వినతుల కార్యక్రమంలో నాయుడుపేట ప్రాంతం నుంచి తన ఏడేళ్ల కుమార్తెతో వచ్చిన ఓ తండ్రి కుటుంబ పరిస్థితిని హోంమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కుటుంబ పరిస్థితుల కారణంగా కుమార్తె చదువు కొనసాగించడం కష్టంగా ఉందని, తనకు కూడా స్థిరమైన ఉపాధి లేదని వివరించారు. వారి పరిస్థితిపై స్పందించిన హోంమంత్రి సంబంధిత జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. చిన్నారి చదువు ఆగకుండా అవసరమైన వసతి సదుపాయం ఉన్న హాస్టల్‌లో చేర్పించి విద్యను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తండ్రికి కూడా ఉపాధి అవకాశం కల్పించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను కోరారు.

# శాస్త్రీయ విద్యా విధానం కోసం విద్యార్థులు పోరాడాలి

**ఏఐఎస్ఎఫ్ 90 వసంతాల వేడుకల్లో వక్తలు వెల్లడి**




**అనంతపురం, ఆగస్టు 12 ప్రభాతవార్త బ్యూరో:** డామిట్ కథ అడ్డం తిరిగింది అన్న రీతిలో భారత విద్యా వ్యవస్థ తయారైందని, భారత చరిత్రగానే ఉంచాలని, చరిత్రనే మార్చాలని యత్నిస్తున్నారని ఎస్కే యూనివర్సిటీ విశ్రాంత అధ్యాపకులు రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. చరిత్రలో ముస్లిం రాజులకు పాత్ర ఎంతో ఉందని, వారి పాత్రను తీసివేసి హిందూ రాజుల పాత్రలోనే ప్రముఖంగా చూపాలని ప్రయత్నాలు జరుగుతున్నాయని, భారతదేశ చరిత్రని మార్చడం ఎంతవరకు సబబు అని ఆయన ప్రశ్నిస్తూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని చదువులో రాణించాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ 90 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా అనంతపురం ఆర్ట్స్ కాలేజీలో 90 వసంతాల వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నాయకులు శ్రీనివాసులు నాయుడు పతాక ఆవిష్కరణ చేశారు. అనంతరం 'భారత ప్రజాస్వామ్యం- విద్యార్థుల పాత్ర అనే అంశంపై జరిగిన సదస్సులో వక్తలు ప్రసంగించారు.

ఈ సందర్భంగా రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగాన్ని పూర్తిగా ప్రైవేట్ సంస్థలకు అప్పగించి ప్రభుత్వ విద్యా రంగాన్ని నాశనం చేస్తున్నారని, పేద వర్గాల విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తున్నారని విమర్శించారు. ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, వై.విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్.డి.ఏ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని విమర్శించారు. విద్యార్థులు విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం, అలాగే దేశ రాజ్యాంగ వ్యవస్థల పరిరక్షణ కోసం ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నాయకులు శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ కాక్రోచ్ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని హక్కుల కోసం పోరాడాలని, అవినీతి, అన్యాయాలను ప్రశ్నించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, సహాయ కార్యదర్శి రాజారెడ్డి, మల్లికార్జున, రచయిత దస్తగిరి, ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా నాయకులు వికె రంగారెడ్డి, తిరుపతయ్య, ఖమర్ బేగం, కె చెన్నకేశవులు, బండి నాగరాజు, ఒంటెద్దు గోపాల్ రెడ్డి, అంకన్న, బి.రమణయ్య, నిరంజన్ గౌడ్, రామాంజనేయులు, జి నరేష్, ఎం.మధు, చిరంజీవి, నిర్వహణ కమిటీ సభ్యులు నగేష్, అజయ్ కుమార్, రామాంజనేయులు, ఆంజనేయులు, నరసింహ యాదవ్, ఉమా మహేష్ మంజునాథ్, వంశీ, సమీర్, నవీన్, నాని, సాయి, బాబ్జాన్, సుస్రత్, ఆస్టాఫ్, లెనిన్, కల్లప్ప, రాజేష్ గౌడ్, ఆనంద్, గణేష్ వంశీ, దుర్గాప్రసాద్, ధనంజయ, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రనాయక్, రామదాస్, పుల్లయ్య, తిప్పేస్వామి, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది. వివిధ కళాశాలల విద్యార్థులు కూడా ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

# అమెరికాకు వెళ్లినా వ్యవసాయంపై తగ్గని మక్కువ

**● కాలిఫోర్నియాలో పంటల పరిశీలన... సాగు విధానాలు, మార్కెటింగ్ తెలుసుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీత**



**అనంతపురం, ఆగస్టు 12 ప్రభాతవార్త బ్యూరో:** నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ అభివృద్ధి, రాజకీయ కార్యక్రమాలతో బిజీ బిజీగా కనిపించే రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతకు వ్యవసాయంపై తనకున్న మక్కువ ఏమాత్రం తగ్గలేదు. తరచూ తన వ్యవసాయక్షేత్రాన్ని సందర్శిస్తూ అక్కడే సమయం గడపటం, అలాగే రైతుల పొలాలను పరిశీలించడం వంటివి చేస్తుంటారు. అయితే తన వ్యక్తిగత పర్యటనలో భాగంగా అమెరికా వెళ్లిన ఆమె అక్కడ కూడా వ్యవసాయం పై ఆసక్తి చూపించారు. అక్కడ పంటలు ఎలా సాగుచేస్తున్నారో తెలుసుకోవాలన్న ఆసక్తితో క్యాలిఫోర్నియాలో పంట పొలాలను పరిశీలించారు. అక్కడి వ్యవసాయ విధానాలను, అలాగే పంటల ఉత్పత్తులు, మార్కెటింగ్ వంటి అంశాలను స్థానికంగా ఉన్న రైతులను అడిగి తెలుసుకున్నారు. భారత దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించిన సమయంలో పంజాబ్ రాష్ట్రం నుంచి వలస వెళ్లిన సిక్కులు కాలిఫోర్నియాలో స్థిరపడగా.. ప్రస్తుతం ఓ సిక్కు రైతు 175 ఎకరాలలో ఆల్మండ్ (బాదం) పంట వేశారు. ఈ పంటను ఎమ్మెల్యే సునీత పరిశీలించారు. పంట ఎలా సాగు చేస్తున్నారన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఈ పంట సాగు చేసి 8 సంవత్సరాలైందని.. ఒక ఎకరానికి 150 మొక్కలు నాటుతారని.. ఒక ఎకరానికి 1.6 టన్నుల దిగుబడి వస్తుందని వివరించారు. 100 ఎకరాల నుంచి 3వేల ఎకరాల దాకా ఒక్కో రైతు అక్కడ పంటలు సాగు చేస్తున్నట్లు తెలిపారు.

పంటల నిర్వహణ విధానాన్ని తెలుసుకోవడంతో పాటు పంట కోత (హార్వెస్టింగ్) విధానాన్ని కూడా తెలుసుకున్నారు. మొత్తం యంత్రాల ద్వారానే హార్వెస్టింగ్ నిర్వహిస్తారని రైతులు వివరించారు. అమెరికాలో వ్యవసాయ విధానాలు చాలా సాంకేతికంగా ఉన్నాయని.. మార్కెటింగ్‌లో కూడా మనం తెలుసుకోవాల్సినవి చాలా ఉన్నాయని ఎమ్మెల్యే సునీత తన అభిప్రాయాలను పంచుకున్నారు.


## ఏనుగు దాడి.. కార్మికుడికి తీవ్ర గాయాలు



**పలమనేరు, ఆగస్టు 12 ప్రభాతవార్త:** ప్రపంచ ఏనుగుల దినోత్సవం రోజే ఒంటరి ఏనుగు దాడి చేసింది. చిత్తూరు జిల్లా పలమనేరు- బంగారుపాళ్యం మొగిలిఘాట్ సమీపంలో ఎక్స్‌ప్రెస్ హైవే వద్ద అటవీ ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం ఏనుగు దాడి చేయడంతో రహదారి కార్మికుడు మనీష్‌సింగ్ తీవ్రంగా గాయపడ్డాడు. తోటి కార్మికులు ఇతన్ని వెంటనే పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యుడు ప్రసాద్ ప్రథమ చికిత్స అనంతరం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాణాపాయ స్థితిలో కార్మికుడు చికిత్స పొందుతున్నాడు.

## వరుణయాగం ఎందుకు నిర్వహించరు?

**- టిటిడిపై భూమన కరుణాకర్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం**



**తిరుమల, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో తీవ్ర కరవు పరిస్థితులు నెలకొన్నాయని, తిరుమల కొండపై కూడా జలాశయాలు ఎండిపోతున్నాయని వైసిపి జిల్లా అధ్యక్షుడు, టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తిరుమలలో టిటిడి వరుణయాగం చేపట్టాలని డిమాండ్ చేశారు. కొండపై జలాశయాలు సైతం ఎండిపోతున్నా టిటిడి పాలకుల్లో చలనం లేకపోవడం శోచనీయమని మండిపడ్డారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ తక్షణమే వరుణయాగం నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికైనా అధికారులు సనాతన ధర్మ పరిరక్షణతో బాటు ప్రజాక్షేమం కోసం వెంటనే మేల్కొని వరుణయాగం చేపట్టాలని భూమన డిమాండ్ చేశారు.

# ద్రవిడ వర్సిటీలో రాష్ట్ర కమిటీ పర్యటన

**కుప్పం, ఆగస్టు 12 ప్రభాతవార్త:** రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధ్వర్యంలో అమలు చేస్తున్న రూసా 2.0పథకంలో భాగంగా ద్రవిడ వర్సిటీలో చేపట్టిన మౌలిక వసతుల అభివృద్ధి పనులను రాష్ట్రస్థాయి పరిశీలన కమిటీ బుధవారం పరిశీలించింది. ఎపి ఉన్నత విద్యా మండలి వైస్‌ఛైర్మన్ ప్రొఫెసర్ విజయభాస్కర్‌రావు, రూసా/పిఎం ఉషా నోడల్ అధికారి, ఎస్వీయు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు, పిఆర్ డిఇ గురవారెడ్డి, రూసా ప్రాజెక్ట్ అకౌంట్స్ అధికారి శంకరరావు, టిఎస్‌జి రూసా తిరుపతిరావు తదితరులు పనులు పరిశీలించారు. ఈసందర్భంగా వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఎం.సి. మల్లయ్య అధ్యక్షత సమీక్షా సమావేశం నిర్వహించారు.పనుల పురోగతి, నిధుల వినియోగం, ఆస్తుల సృష్టి అంశాలపై సమీక్షించారు. 20కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన జిప్లస్2 తరగతి గదుల సముదాయం, పురుషుల హాస్టల్, హరప్ప, భాషా భవన్‌ల ఆధునీకరణ పనులు పూర్తయి వినియోగిస్తున్నట్లు కమిటీ గుర్తించింది. రూసా నిధులతో కొనగోలు చేసిన డిజిటల్ బోర్డులు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, నెట్‌వర్క్ పరికరాలు, సిసి కెమెరాలు, సోలార్ లైట్లు, ఫర్నిచర్ తదితరాలు వినియోగంలో ఉన్నట్లు గుర్తించారు. పనుల నాణ్యతపై స ంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా రిజిస్ట్రార్ కిరణ్ కుమార్ ప్రాజెక్టు అమలుకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం, ప్రాజెక్ట్ డైరెక్టరేట్, ఉన్నత విద్యామండలి, వర్సిటీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీసిటీని సందర్శించిన జర్మనీ కాన్సుల్ జనరల్

**సత్యవేడు, ఆగస్టు 12 ప్రభాతవార్త:** చెన్నైలోని జర్మనీ ఫెడరల్ రిపబ్లిక్ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ బుధవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్ ఆయనకు సాదర స్వాగతం పలికారు. కాన్సుల్ జనరల్‌తో చర్చల సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ పారిశ్రామిక ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో శ్రీసిటీ అంతర్జాతీయ పెట్టుబడి దారులకు అనువైన వేదికగా ఎదిగిందన్నారు. బెల్ ఫ్లేవర్స్, ప్రొగ్రెస్సెస్, నాఫ్, కాంక్యో బెర్ట్ వంటి జర్మనీ కంపెనీలు ఇప్పటికే శ్రీసిటీలో విజయవంతంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. జర్మనీ నుంచి మరిన్ని పెట్టుబడులకు ఈ పర్యటన దోహదపడుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. శ్రీసిటీ సమగ్ర పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ ద్వారా ఒనగూరే వివిధ ప్రయోజనాలను కాన్సుల్ జనరల్‌కు వివరించారు. కేంద్ర ప్రభుత్వ పన్నురాయితీలు, సబ్సిడీలతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న పెట్టుబడి దారుల అనుకూల విధానాలపై అవగాహన కల్పించారు. పర్యటనలో భాగంగా కాన్సుల్ జనరల్ శ్రీసిటీలోని పలు కీలక సదుపాయాలను సందర్శించారు. జర్మనీకి చెందిన నాఫ్ పరిశ్రమను సందర్శించి అక్కడి సిబ్బందితో ముచ్చటించారు. ప్లాంట్‌లో ఉత్పత్తి కార్యకలాపాలు, ఇతర అంశాలను ఆయన పరిశీలించారు. ఈ పర్యటన భారత్, జర్మనీ మధ్య వ్యాపార, పారిశ్రామిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా మరో కీలక ముందడుగుగా నిలవడంతో పాటు అంతర్జాతీయ పెట్టుబడులకు ప్రముఖ గమ్యస్థానంగా శ్రీసిటీని మరింత బలోపేతం చేయనుంది.

## పైడిభీమవరం పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఉన్నతాధికారుల బృందం విచారణ

**రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), ఆగస్టు 12 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లాలోని రణస్థలం మండలం పారిశ్రామికవాడ పైడిభీమవరం గ్రామ పంచాయతీకి చెందిన రూ.7.50 కోట్లు సాధారణ నిధుల దుర్వినియోగం వ్యవహారంపై ఆరోపణలు వెల్లువెత్తడంతో సమగ్ర విచారణ జరిపేందుకు ప్రభుత్వం నియమించిన పంచాయతీరాజ్ చీఫ్ ఇంజనీర్ విజయకుమారి, విశాఖ జిల్లా పరిషత్ సీఈఓ నారాయణమూర్తి, పంచాయతీరాజ్ జాయింట్ డైరెక్టర్ రామనాథరెడ్డి, క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ ఎస్.రఘురామిరెడ్డి, క్వాలిటీ కంట్రోల్ డీఈ డి.సత్యనారాయణ, పలాస డీడీఓ ఎం.సతీష్, డీఎల్పీఓ ఎ.చక్రవర్తి, గ్రేడ్1 పీడీఓ తిరుపతిరావు, టెక్కలి జూనియర్ అసిస్టెంట్ పి.లోకేశ్వరరావు ఉన్నతాధికారులతో కూడిన ప్రత్యేక బృందం బుధవారం విచారణ చేపట్టి సంబంధించిన రికార్డులను పరిశీలించింది. అనంతరం గత ఏడాది ఏప్రిల్ 1 నుండి గ్రామ పంచాయతీలో సాధారణ నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు వాటి వ్యయం తదితర వివరాలపై క్షేత్ర స్థాయిలో సమగ్ర విచారణ జరిపింది. అయితే చేపట్టిన పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించకుండా పనులను చేపట్టినట్లు వారు గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ బృందంలో జిల్లా పంచాయతీ అధికారి ఆర్ స్వరూపరాణి ఉన్నారు.

## అన్న క్యాంటీన్‌లో భోజనం చేసిన కలెక్టర్



**విజయనగరంశ్రీపురుపల్లి, ఆగస్టు 12 ప్రభాతవార్త :** చీపురుపల్లిలోని అన్న క్యాంటీన్‌ను జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి బుధవారం సందర్శించారు. క్యాంటీన్‌లో భోజన నాణ్యత, పరిశుభ్రత, అందుతున్న సేవలను ఆయన పరిశీలించారు. కలెక్టర్ స్వయంగా డబ్బులు చెల్లించి టోకెన్ తీసుకుని క్యాంటీన్‌లో భోజనం చేశారు. భోజనాన్ని రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. అనంతరం అన్న క్యాంటీన్‌కు వచ్చిన లబ్ధిదారులతో మాట్లాడి భోజనం రుచి, నాణ్యత, అందుతున్న సేవలపై వారి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. అన్న క్యాంటీన్‌లో భోజనం నాణ్యంగా, రుచికరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. పేదలు, సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా అన్న క్యాంటీన్ సేవలను నిర్వహించాలని సూచించారు.

## రేపల్లె సబ్ జైలులో ఖైదీ ఆత్మహత్యాయత్నం

**రేపల్లె, ఆగస్టు 12, ప్రభాతవార్త:** బాపట్ల జిల్లా రేపల్లె సబ్ జైలులో బుధవారం రిమాండ్ ఖైదీ ఉయ్యూరు శ్రీనివాసరావు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వృద్ధురాలి హత్య కేసులో శ్రీనివాసరావు రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. సబ్ జైలు వంట గదిలో కూరగాయలు కోసే కత్తి తీసుకున్న శ్రీనివాసరావు కంఠం కింద కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.గమనించిన సబ్ జైలు సిబ్బంది పోలీసులకు సమాచారం అందించి రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు అత్యవసర చికిత్స చేశారు. పోలీసుల కారణంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడలేదని శ్రీనివాసరావు వెల్లడించాడు. రిమాండ్ ఖైదీ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. శ్రీనివాసరావు వ్యవహారంపై పూర్వాపరాలను పరిశీలించేందుకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నిద్రిస్తున్న వ్యక్తిపై గొడ్డలితో దాడి, హత్య

**దుర్గి, ఆగస్టు 12 ప్రభాతవార్త:** గుంటూరు జిల్లా దుర్గి మండలం ఓబులేసునిపల్లె గ్రామంలో అర్ధరాత్రి వేళ ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఇంటి బయట నిద్రిస్తున్న వ్యక్తిపై దుండగులు గొడ్డలితో విచక్షణారహితంగా దాడి చేసి ప్రాణాలు తీశారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓబులేసునిపల్లె గ్రామానికి చెందిన కొమ్ము ఇమ్మానుయేలు (35) అనే వ్యక్తి మంగళవారం అర్ధరాత్రి వేళ తన ఇంటి బయట నిద్రిస్తున్నాడు. అదనుగా చూసుకున్న గుర్తుతెలియని దుండగులు, ముందస్తు పథకం ప్రకారం గొడ్డలితో ఆయనపై దాడికి తెగబడ్డారు. తల, మెడ భాగాల్లో తీవ్ర గాయాలు కావడంతో ఇమ్మానుయేలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బుధవారం ఉదయం ఈ ఉదంతం వెలుగులోకి రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. గురజాల డిఎస్పీ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో సిఐ భాస్కర్, ఎస్సై గోపాల్ మరియు క్లూస్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి, క్షేత్రస్థాయిలో వేలిముద్రలు, ఇతర కీలక ఆధారాలను సేకరించారు. ఈ హత్యకు పాత కక్షలు లేదా వ్యక్తిగత వివాదాలే కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు వేగవంతం చేశారు.

# అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్ రెడీ

● నేడు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభం



**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపి రాజధాని అమరావతి ప్రాంతానికి ప్రధాన అనుసంధాన రోడ్డు సీడ్ యాక్సెస్ రహదారి ప్రారంభానికి సిద్ధమైంది. ఈ రోడ్డును ఈనెల 13న గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి సిఆర్‌డిఏ, ఎడిసిఎల్ ఏర్పాట్లను చేశాయి. నిర్మాణంలో రెండు దశలు విజయవంతంగా పూర్తయ్యాయి. రాజధాని ప్రాంతం నుంచి విజయవాడ- మంగళగిరి రహదారికి ఈ రోడ్డును అనుసంధానం చేయడంతో ఇకపై అమరావతికి రాకపోకలు సాగించడానికి మార్గం సులభమవుతుంది. విజయవాడ నుంచి రాజధాని ప్రాంతానికి వెళ్లేందుకు ప్రజలు కృష్ణా కరకట్ట మార్గాన్ని ఉపయోగించేవారు. అయితే ఈ రహదారి అత్యంత ఇరుకుగా ఉండటంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తేవి. ఇప్పుడు సీడ్‌యాక్సెస్ రహదారి అందుబాటులోకి రావడంతో ప్రకాశం బ్యారేజీ మీదుగా వచ్చే వాహనాలు నేరుగా అమరావతికి చేరుకునే వీలు లభిస్తుంది. ఇది రాజధానిలో నిర్మిస్తున్న రహదారుల్లో ఈ3 రోడ్డు అత్యంత కీలకమైనది. ఈ సీడ్‌యాక్సెస్ రోడ్డుకు ఉత్తరదక్షిణంగా ప్రయాణించే మరో 17రోడ్లు అనుసంధానం అవుతాయి. దీనివల్ల రాజధానిలో ఏ ప్రాంతం నుంచైనా, ఎక్కడికైనా వెళ్లడానికి సౌకర్యంగా ఉంటుంది. ఇంతటి కీలకమైన మార్గం అందుబాటులోకి రావడంతో రాజధాని ప్రాంతానికి రాకపోకలు మరింత మెరుగుపడనున్నాయి. ఇక సీడ్ యాక్సెస్ రహదారిని ప్రభుత్వం మూడు దశల్లో నిర్మించేలా ప్రణాళికలు రూపొందించింది. రాజధాని ప్రాంతంలో దొండపాడు నుంచి ప్రారంభమై రాయపూడి, వెంకటపాలెం, పెనుమాక, ఉండవల్లి, తాడేపల్లి మీదుగా మణిపాల్ ఆసుపత్రి వద్ద జాతీయ రహదారి 16 (ఎన్‌హెచ్16)తో అనుసంధానమవుతుంది. ఇందులో భాగంగా ఉండవల్లి వరకు రెండు దశల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఉండవల్లి నుంచి నేషనల్ హైవేకి అనుసంధానం చేసే మూడో దశ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. మూడు దశల్లో మొత్తం 21.77 కిలోమీటర్ల మేర ఈ రహదారిని విస్తరించనున్నారు. ఇది 60 మీటర్ల వెడల్పుతో బీఆర్‌టీఎస్ లేన్లతో పాటు ఎడమ, కుడివైపులా సర్వీసు రోడ్లు నిర్మిస్తారు. వీటితో పాటు స్ట్రామ్ వాటర్ డ్రెయిన్, తాగునీటి పైపులైన్లు, ఐసిటి, గ్యాస్ పైపులైన్లు, స్లెకింగ్, జాగింగ్ ట్రాక్, అండర్‌గ్రౌండ్ డక్ట్‌లను ఏర్పాటు చేస్తారు. రాజధానిలో నిర్మిస్తున్న రహదారుల్లో ఈ3 రోడ్డు అత్యంత కీలకమైనది. ఈ సీడ్ యాక్సెస్ రోడ్డుకు ఉత్తరదక్షిణంగా ప్రయాణించే మరో 17 రోడ్లు అనుసంధానం అవుతాయి. దీనివల్ల రాజధానిలో ఏ ప్రాంతం నుంచైనా, ఎక్కడికైనా వెళ్లడానికి సౌకర్యంగా ఉంటుంది. ఇంతటి కీలకమైన మార్గం అందుబాటులోకి రావడంతో రాజధాని ప్రాంతానికి రాకపోకలు మరింత మెరుగుపడనున్నాయి.

**స్టీల్ బ్రిడ్జి ప్రారంభోత్సవ ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి నారాయణ**

స్టీల్ బ్రిడ్జి ప్రారంభోత్సవ ఏర్పాట్లను మంత్రి పి.నారాయణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రెండు స్టీల్ బ్రిడ్జిలు, రెండోదశ సీడ్ యాక్సెస్ రోడ్డును సీఎం ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టవర్లను కూడా సీఎం పరిశీలిస్తారని చెప్పారు. బకింగ్‌హామ్ కెనాల్‌పై 110 మీటర్ల పొడవుతో స్టీల్ బ్రిడ్జి నిర్మాణం చేస్తామన్నారు. కొండవీటి వాగు, గుంటూరు ఛానల్‌పై 280 మీ. పొడవుతో మరో స్టీల్ బ్రిడ్జి నిర్మిస్తామన్నారు. రేపట్నుంచి విజయవాడ, మంగళగిరి నుంచి సీడ్ యాక్సెస్ రోడ్డుపై ప్రయాణం చేయవచ్చన్నారు. అమరావతికి స్వాగతం పలికేలా స్టీల్ బ్రిడ్జి వద్ద ఏ ఆకారంలో పైలాన్ నిర్మాణం ఉంటుందన్నారు.

# 17నుంచి అసెంబ్లీ... కీలక బిల్లులు సిద్ధం

**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో కీలక బిల్లుల ఆమోదానికి ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. రెండేళ్ల పాలనతో పాటు రాష్ట్రంలో శాంతి భద్రతలు, పెట్టుబడులు, ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్‌పై చర్చించనున్నారు. ఈ సమావేశాల్లోనే సి రిజర్వేషన్లతో పాటు మున్సిపల్ చట్ట సవరణ బిల్ ప్రవేశ పెట్టే అవకాశం ఉంది. మేయర్, మున్సిపల్ ఛైర్మన్లకు సంబంధించి ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. దీంతో మున్సిపల్ చట్ట సవరణ బిల్ ప్రవేశ పెట్టే అవకాశం ముంది. 17న అసెంబ్లీ ప్రారంభమై, వాయిదా పడిన తర్వాత బిఏసి సమావేశంలో అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలి అనే అంశంపై అధికారిక ప్రకటన చేయనున్నారు.

# గాలిలో ఉండగానే ఇంజన్ వైఫల్యం

చెన్నై ఎయిర్‌పోర్టులో ఇండిగో అత్యవసర ల్యాండింగ్



**చెన్నై, ఆగస్టు 12:** కోల్‌కతానుంచి చెన్నై వస్తున్న ఇండిగో విమానం అత్య వస రంగా ల్యాండ్ అయ్యింది. విమానం గాల్లో ఉండగా ఇంజిన్ ఫెయిల్ అయింది. దాంతో చెన్నై విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ప్రకటించాల్సి వచ్చింది. మంగళవారం అర్ధరాత్రి ఈ భయానక ఘటన చోటుచేసుకుంది. 224 మంది ప్రయాణికుల తో ఇండిగో విమానం కోల్‌కతా నుంచి చెన్నైకి బయల్దేరింది. రాత్రి 11.30కి అది గమ్యస్థానంలో దిగాల్సి ఉంది. విమానం ల్యాండింగ్‌కు సిద్ధమవుతున్న తరుణంలో ఎడమవైపు ఇంజిన్ విఫలమైనట్టు పైలట్ గుర్తించారు. వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌ను అప్రమత్తం చేశారు. దాంతో సురక్షిత ల్యాండింగ్ కోసం చెన్నై విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ప్రకటించారు. అధికారుల అప్ర మత్తతతో ఏడు నిమిషాల తర్వాత సురక్షితంగా విమానం దిగడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. మరో 10నిమిషాల తర్వాత ఎమర్జె న్సీని ఉపసం హరించుకోవడంతో కార్యాకలాపాలన్నీ సాధారణ స్థితికి చేరుకున్నాయి.

# బీచ్‌శాండ్ మినరల్స్‌కు విలువ జోడింపుపై దృష్టి

దేశ, రాష్ట్రాభివృద్ధికి ఉపకరించేలా రేర్ ఎర్త్ మినరల్స్ అభివృద్ధి ● అదానీ ప్రతినిధుల బృందం భేటీలో సీఎం చంద్రబాబు



**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో విస్తారంగా ఉన్న బీచ్‌శాండ్ మినరల్స్‌కు విలువ జోడించి, దేశ అవసరాలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రేర్ ఎర్త్ మినరల్స్ కోసం ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితి రాకుండా రాష్ట్రంలోనే విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఇందుకు అవసరమైన అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సీఎం చంద్రబాబు చెప్పారు. అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ లిమిటెడ్ ఎండీ కరణ్ అదానీ నేతృత్వంలోని బృందం ముఖ్యమంత్రి చంద్రబాబుతో బుధవారం రాష్ట్ర సచివాలయంలో భేటీ అయింది. శ్రీకాకుళం జిల్లాలో రూ.16 వేల కోట్ల పెట్టుబడితో అదానీ గ్రూప్ ఏర్పాటు చేసే టైటానియం ప్లాంట్ ఏర్పాటు...బీచ్ శాండ్ మైనింగ్, ఏయే ఉత్పత్తులు వస్తాయి.. వాటిని ఏయే రంగాల్లో వినియోగిస్తారు... వాటికున్న డిమాండ్ వంటి అంశాలను అదానీ ప్రతినిధుల బృందం సీఎంకు వివరించింది. బీచ్ శాండ్లో లభ్యమయ్యే ఇల్మెనైట్ మినరల్ కుకు విలువ జోడించి.. టైటానియం స్లాగ్, గ్రివీ, టైటానియం స్పాంజ్ వంటివి ఉత్పత్తి చేయవచ్చని అదానీ గ్రూప్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లింది. పెయింట్స్, కోటింగ్స్, కాస్మెటిక్స్, ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్, యూవీ రక్షణ ఉత్పత్తులు వంటి వాటిల్లో గ్రివీ ను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఖనిజాల విలువను పెంచేలా వాల్యూ యాడెడ్ ఉత్పత్తుల తయారీకి ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. బీచ్‌శాండ్ మినరల్స్‌ను కేవలం ముడి ఖనిజంగా వెలికి తీయడమనే అంశంగానే కాకుండా వాటి ద్వారా రాష్ట్రానికి, దేశానికి గరిష్ఠ ప్రయోజనం కలిగేలా మొత్తం విలువ ఆధారిత శ్రేణిని అభివృద్ధి చేయాలని సూచించారు. రేర్ ఎర్త్ మినరల్స్ విషయంలో దేశం ఇతర దేశాలపై ఆధారపడాల్సిన పరిస్థితి లేకుండా స్వయం సమృద్ధి సాధించే దిశగా ముందుకు సాగాలని సీఎం అన్నారు. రేర్ ఎర్త్ మినరల్స్ మైనింగ్ అనేది నేషన్ బిల్డింగ్ కు ఉపకరించేలా ఉండాలని, అలాగే రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేలా చూడాలని సూచించారు. రేర్ ఎర్త్ మినరల్స్ విషయంలో అందుబాటులో ఉన్న వనరులు, అవసరమైన సాంకేతికత, సరైన టెక్నాలజీ భాగస్వాములను గుర్తించడంపై దృష్టి పెట్టాలని సీఎం అన్నారు. ఈ ప్రక్రియ దేశానికి, రాష్ట్రానికి ఉపయోగపడేలా ఉండాలని స్పష్టం చేశారు. విశాఖలో తాము ఏర్పాటు చేయబోయే ఇందులో స్కిల్ డెవలప్‌మెంట్, అదానీ యూనివర్సిటీ, ఇంటర్నేషనల్ స్కూల్, అదానీ ఆరోగ్య మందిర్ పేరుతో 1,000 పడకల ఆసుపత్రి, 150 సీట్ల మెడికల్ కాలేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. అదానీ డేటా సెంటర్, ఐటీ పార్క్ నిర్మాణాల మాస్టర్ ప్లాన్ వివరాలను అదానీ గ్రూప్ ప్రతినిధులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర, గనుల శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# లిథియం, గాలియం నిక్షేపాల అన్వేషణపై ఎన్జీఆర్ఐతో ఒప్పందం



**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో కీలక ఖనిజాల అన్వేషణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కడప బేసిన్ పరిధిలోని వేంపల్లె పరిసరాల్లో లిథియం, గాలియం ఖనిజాల నిక్షేపాలపై విస్తృత స్థాయి అన్వేషణకు చర్యలు చేపడుతోంది. ఈ మేరకు సీఎస్ఐఆర్-నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ), రాష్ట్ర గనులు- భూగర్భ శాస్త్ర శాఖల మధ్య ఎంఓయూ కుదిరింది. బుధవారం సీఎం చంద్రబాబు సమక్షంలో ఎన్‌జీఆర్ఐరాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నాయి. తుమ్మలపల్లె, పరిసర ప్రాంతాల్లో ఎన్‌జీఆర్ఐ నిర్వహించిన ప్రాథమిక పరిశోధనల్లో లిథియం, గాలియం ఖనిజాల ఆనవాళ్లు గుర్తించారు. లిథియం గరిష్ఠంగా 1,000 పీపీఎం, గాలియం 250 పీపీఎం వరకు ఉన్నట్లు అంచనా వేశారు. దీనిపై మరింత అధ్యయనం చేసేందుకు ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్ట్ నుంచి 100 శాతం నిధులతో... రూ.140 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. మరోవైపు ఏపీలోని గనుల రంగంలో పరిశోధన, టెక్నాలజీ, స్కిల్ డెవలప్మెంట్ వంటి అంశాలకు సంబంధించి ఐఐటీ(ఐఎస్ఎం) ధన్‌బాద్- టెక్స్‌మిన్, గనుల శాఖ మధ్య సీఎం సమక్షంలో మరో ఎంఓయూ కుదిరింది. దీని ద్వారా రాష్ట్రంలో గనులకు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఐఐటీ(ఐఎస్ఎం) ధన్‌బాద్ ఏర్పాటు చేయనుంది. ఈ ఎంఓయూ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, గనుల శాఖకు చెందిన ఉన్నతాధికారులు, ఆయా సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు.

# మా కష్టం.. మా ప్రతిభలను అవమానించ వద్దు

డిఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల వేడుకోలు ● ఆత్మగౌరవ ర్యాలీకి సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్




**జగ్గయ్యపేట, ఆగస్టు 12, ప్రభాతవార్త:** ఎంతో శ్రమించి, కష్టనష్టాలను ఓర్చి ప్రతిభతో తాము ఉద్యోగాలు సాధించుకుంటే తమపట్ల చులకనభావంతో ఆత్మగౌరవాన్ని భంగపరుస్తూ పిచ్చిమాటలతో చులకనచేస్తూ ఆరోపణలు చేయటం ఏమాత్రం సమంజసం కాదని, ఇది తమను అవమానమేనంటూ డిఎస్సీ-2025లో ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు కన్నీటి పర్యంతమయ్యారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో బుధవారం ఉద్యోగాలు సాధించిన డిఎస్సీ-2025 అభ్యర్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహించారు. ఎన్‌టిఆర్ విగ్రహ సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడి తమ నిరసన వ్యక్తంచేశారు. పేద కుటుంబాల నుండి కష్టపడి వచ్చిన తాము రేయింబవళ్ళు శ్రమపడి నేడు ఉద్యోగాలు పొందితే కొందరు తమను అవహేళనచేస్తూ పనికట్టుకుని సభ్యసమాజం సిగ్గుపడేలా ప్రవర్తిస్తూ మాటలతో నిందించటం సరికాదని తమ కష్టాన్ని గౌరవించాలని కోరారు. అభ్యర్థుల ఆత్మ గౌరవ ర్యాలీకి విచ్చేసిన స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ కుటుంబ బాధ్యతల బరువులను మోస్తూ, మంచి భవిష్యత్తుకోసం పట్టుదలతో చదివిన అభ్యర్థులపట్ల వారు పొందిన ఉద్యోగాలపట్ల అవహేళనతో చులకనచేస్తూ మాట్లాడేవారు ఇకనైనా నిజాలు గ్రహించి వారిని ప్రోత్సహించాలన్నారు. ఆత్మగౌరవ ర్యాలీకి తన సంఘీభావం తెలియజేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో పలువురు డిఎస్‌సి అభ్యర్థులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు కూడా పాల్గొన్నారు.



## వైసిపి ప్రభుత్వ హయాంలో నిర్వహించిన

# గ్రూప్1 పరీక్షల్లో ఘోర తప్పిదాలు

● అసెంబ్లీలో చర్చిద్దాం.. మండలిలో ప్రతిపక్షాన్ని దీటుగా ఎదుర్కోవాలి: మంత్రులతో సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** వైసిపి ప్రభుత్వ హయాంలో నిర్వహించిన గ్రూప్1 పరీక్షల్లో ఘోర తప్పిదాలు జరిగాయని సీఎం అన్నారు. ఇటీవలి కాలంలో ఇంత అన్యాయంగా జవాబుపత్రాల ముల్యాంకనం ఎన్నడూ జరగలేదని.. మూడు సార్లు పేపర్లు దిద్దించడం ఏమిటని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గ్రూప్1 పరీక్ష మూల్యాంకనంలో అక్రమాలకు సంబంధించిన నివేదికను హైకోర్టుకు సిట్ సమర్పించిందని, దీనిపై వైసీపీని నిలదీయాల్సిందే అని మంత్రులకు సూచించారు. అందుబాటులో ఉన్న మంత్రులతో సీఎం చంద్రబాబు నాయుడు బుధవారం మధ్యాహ్నం లంచ్ మీటింగ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రులు అందరూ సిట్ రిపోర్ట్‌పై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. వైసీపీ నిర్వాకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. వాటిపై అసెంబ్లీలో కూడా చర్చిద్దామన్నారు. కూటమి ప్రభుత్వం డీఎస్సీలో ఎటువంటి తప్పులూ చేయలేదని, అంతా పారదర్శకంగా జరిగిందని తెలిపారు. డీఎస్సీపై వైసీపీ శాసనమండలిలో లేవనెత్తితే దీటుగా సమాధానం చెబుదామన్నారు. ఈ అంశంపై చర్చించేందుకు కూడా సిద్ధంగా ఉండాలని, ఆధారాలతో సహా నిరూపిద్దామని మంత్రులకు సూచించారు. తప్పు చేయనప్పుడు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు.

అగ్రెసివ్‌గా ముందుకు వెళదామని, వైసీపీ నేతలను అసెంబ్లీకి రమ్మని సవాల్ చేయాలన్నారు.

అసెంబ్లీకి రాకుండా బయట డ్రామాలాడితే ప్రజలు నమ్మరని చెప్పుకొచ్చారు. రాని, అర్హత లేని ప్రతిపక్ష హోదాను ఎవరిస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గతంలో వైసీపీ అధికారంలో ఉండగా.. 23 మంది ఉంటే నలుగురిని లాగేస్తే ప్రతిపక్షహోదా టీడీపీకి పోతుందని జగన్ చెప్పారని, ఇప్పుడు ఆ మాటలను మరిచిపోయారని మంత్రులు తెలిపారు. సోషల్ మీడియాలో ఆనాటి జగన్ మాటలు నేటికీ చక్కర్లు కొడుతున్నాయని గుర్తుచేశారు. వైసీపీ హయాంలో జరిగిన గ్రూప్ 1 అక్రమాలపై శాసనమండలిలో దుమ్ము దులుపుతామని మంత్రులు అన్నారు. ఈ సందర్భంగా సిట్ నివేదికను తెలుగులోకి అనువదించి మరీ మంత్రులకు సీఎంవో అధికారులు వివరించారు.



# భోగాపురంలో ప్రత్యేక విమానం ల్యాండింగ్

## న్యూఢిల్లీ నుంచి వచ్చిన గంటా, సిఎం రమేష్

**విశాఖపట్నం, ఆగస్టు 12 ప్రభాతవార్త:** భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన రాకపోకల సందడి మొదలైంది. వాస్తవానికి ఈనెల 17 వ తేదీ తర్వాత రెగ్యులర్ విమాన సర్వీస్ లు ప్రారంభమవుతాయని పౌర విమానయాన శాఖ ప్రకటించింది. అయితే ఆ సమయానికన్నా ముందే ప్రత్యేక విమానాల ల్యాండింగ్ మొదలైంది. ఢిల్లీ నుంచి భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ లు బుధవారం ప్రత్యేక విమానంలో భోగాపురం విమానాశ్రయంలో దిగగా మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు తదితరులు ప్రత్యేక విమానంలో వెళ్తూ కాకతాళీయంగా కలుసుకున్నారు. ఇక్కడ విమానాల టేక్ ఆఫ్‌కు అంతర్జాతీయ స్థాయిలో ప్రమాణాలను కల్పించారు. అలాగే విశాఖ నుంచి కనెక్టివిటీ కోసం మాస్టర్ ప్లాన్ రోడ్లు, ఎలివేటెడ్ బీచ్ కారిడార్ అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఆర్టీసీ 16 ఎలక్ట్రికల్ బస్సులను భోగాపురం విమానాశ్రయం వరకు ఇప్పటికే ట్రయిల్ రన్ నడిపారు. మెట్రో కూడా సాధ్యమైనంత త్వరగా పట్టాలెక్కేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రత్యేక విమానాల రాకపోకలు మొదలవడంతో ఉత్తరాంధ్ర గ్రోత్ ఇంజన్‌గా చెప్పుకునే భోగాపురం విమానాశ్రయం హడావిడి ప్రారంభమై సందడి షురూ అయ్యింది.

## సిఎం సెక్యూరిటీ చీఫ్, ఎస్పీ భద్రయ్యకు

# ప్రెసిడెంట్ పోలీసు మెడల్



**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు సెక్యూరిటీ చీఫ్, ఎస్పీ సిహెచ్.భద్రయ్య ప్రెసిడెంట్ పోలీసు పతకం (మెడల్) సాధించారు. స్వాతంత్ర్య వేడుకల్లో సిఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రెసిడెంట్ పోలీసు మెడల్‌ను భద్రయ్యకు ప్రదానం చేయనున్నారు. 35యేళ్లకు పైగా పోలీసు సేవలో వివిధ హోదాల్లో పనిచేస్తూ ప్రస్తుతం ఎపి స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ ఎస్పీ/కమాండెంట్‌గా భద్రయ్య కొనసాగుతున్నారు. వివిఐపిల భద్రతా విభాగంలో ఆయన పనిచేస్తున్నారు. గతంలో ఇండియన్ పోలీసు మెడల్‌ను భద్రయ్య సాధించారు. విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఇచ్చే ప్రెసిడెంట్ పోలీసు మెడల్ రావడంపై భద్రయ్యకు పలువురు అధికారులు అభినందనలు తెలిపారు.

## బిఎస్సీ నర్సింగ్ ప్రవేశాలకు నీట్‌యుజి తప్పనిసరి

**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** నాలుగేళ్ల బిఎస్సీ నర్సింగ్ కోర్సు ప్రవేశాల నిబంధనలకు సవరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2026-27 విద్యా సంవత్సరం నుంచి నర్సింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ స్థానంలో నీట్‌యుజిలో సాధించిన ర్యాంకు, స్కోర్ ప్రాతిపదికన మాత్రమే బిఎస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశాలు కల్పించనుంది. కనీసం పర్సంటైల్ నిబంధన ఉండదు. పరీక్షకు హాజరైన అభ్యర్థులందరూ దరఖాస్తు చేసుకోవటానికి అర్హులు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నీట్ నర్సింగ్ పరీక్ష నిర్వహించే వరకు నీట్‌యుజి స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటారు. కన్వీనర్, యాజమాన్య కోటా సీట్ల భర్తీకి నీట్‌యుజికి హాజరు తప్పనిసరి. కౌన్సెలింగ్ పూర్తయ్యాక ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఆ యేడాది ఎపి ఇఎపి సెట్‌కు హాజరైన అభ్యర్థులను పరిగణనలోకి తీసుకుంటారు. కన్వీనర్ కోటా సీట్లకు రెండు విడతల కౌన్సెలింగ్, మాప్‌అప్ రౌండ్ నిర్వహిస్తారు. కన్వీనర్ కోటాలో భర్తీ కాకుండా మిగిలిన సీట్లను యాజమాన్య కోటాకు బదలాయించి ఆన్‌లైన్ విధానంలో భర్తీ చేస్తారు.

# పారదర్శకంగా ఎఇఇల నియామక పరీక్ష

- రేపటి నుంచి అభ్యర్థులకు అందుబాటులోకి హాల్ టికెట్లు
- 23 నుంచి 27 వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు
- ఎపి ట్రాన్స్ కో జెఎండి సూర్యసాయి ప్రవీణ్ చంద్

**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి విద్యుత్ సంస్థల్లో ఎఇఇల నియామకం కోసం నిర్వహిస్తున్న నియామక పరీక్ష-2026ను ఈ నెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షను పూర్తి పారదర్శకతతో, నిష్పక్షపాతంగా, నిర్దేశిత నియమ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. అభ్యర్థుల ఎంపికలో ఎలాంటి వ్యక్తిగత సిఫార్సులు, పలుకుబడులు లేదా ఇతర ప్రభావాలకు తావు ఉండదని, పరీక్షలో అభ్యర్థి కనబరిచిన ప్రతిభతో పాటు అమలులో ఉన్న నియామక నిబంధనల ప్రకారం మాత్రమే ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఉద్యోగం ఇప్పిస్తామని, పరీక్షలో సహాయం చేస్తామని లేదా తమ పలుకుబడితో ఉద్యోగం ఇప్పించగలమని చెప్పే మధ్యవర్తులు, దళారులు లేదా ఇతర వ్యక్తుల మాటలను అభ్యర్థులు నమ్మవద్దని జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సూచించారు. అభ్యర్థుల హాల్ టికెట్లు ఈ నెల 14వ తేదీ నుంచి అభ్యర్థులకు అందుబాటులోకి వస్తాయని, అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని, అందులో పేర్కొన్న పరీక్షా కేంద్రం, పరీక్ష తేదీ, షిఫ్ట్‌తోపాటు వివరాలను ముందుగానే పరిశీలించుకోవాలని జెఎండి ప్రవీణ్‌చంద్ తెలిపారు. హాల్ టికెట్‌లో పొందుపరిచిన సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ, పరీక్ష రోజున నిర్ణీత సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఆయన అభ్యర్థులకు సూచించారు.

# ఎయిడ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ధ్యేయం

● వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపు



**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** హెచ్ఐవీ/ ఎయిడ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. 2026 డిసెంబరు 1 నాటికి నిర్దేశిత 95- 95- 99 లక్ష్యాలను వంద శాతం సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సాధనలో యువతతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ఏపీ శాక్స్) ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన 60 రోజుల ప్రత్యేక సమాచార, విద్య, ప్రచారం పేరుతో తయారు చేసిన కార్యాచరణ ప్రణాళిక అమలు కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. హెచ్ఐవీ నియంత్రణలో రాష్ట్రం గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. గతంతో పోలిస్తే కొత్త హెచ్ఐవీ ఇన్ఫెక్షన్లు 77 శాతం, మరణాలు 87 శాతం తగ్గడం ఇందుకు నిదర్శనమన్నారు. ఈ క్రమంలో అంచనా వేసిన హెచ్ఐవి బాధితుల్లో 95 శాతం మందికి హెచ్ ఐవి వచ్చినట్లు తెలిసి ఉండాలని, తెలిసిన వారిలో 95 శాతం మంది మందులు వాడుతూ ఉండాలని, మందులు వాడే వారిలో 99 శాతం మందికి వైరల్ లోడ్ బాగా తగ్గి ఉండాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించిందన్నారు. ఈ మూడు కేటగిరీల్లో రాష్ట్ర ప్రభుత్వం 888796.2 శాతం మేర పురోగతిని సాధించిందని చెప్పారు.

## ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం

# తమ గొంతు నొక్కేస్తోంది!

● వైసిపి శాసనసభా పక్ష సమావేశంలో అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్



**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా తమ గొంతు నొక్కేందుకే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆరోపించారు. శాసనసభను దాదాపు రెండేళ్లుగా బహిష్కరిస్తున్నప్పటికీ, శాసనమండలి వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఆయన పార్టీ ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. 17 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో బుధవారం ఆయన పార్టీ శాసనసభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన పార్టీ అయిన వైసిపికి ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేందుకు ప్రభుత్వం ఇష్టపడటం లేదని, అందుకే ప్రజా సమస్యలను మీడియా ద్వారానే ప్రజల దృష్టికి తీసుకెళ్లి నాణేనికి మరోవైపు చూపిస్తానని స్పష్టం చేశారు. శాసనమండలిలో వైసిపికి ఉన్న బలాన్ని ఉపయోగించుకుని ప్రజావాణిని బలంగా వినిపించాలని జగన్ సూచించారు. “గత 74 రోజులుగా డిఎస్సీ కుంభకోణంపై 10 రకాల నిరసనలు చేపట్టాం. పేపర్ లీకేజీ, ఔట్‌సోర్సింగ్ కుంభకోణాలు, స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు, ప్రభుత్వ ఉత్తర్వుల మార్పు వంటి అంశాలను ఆధారాలతో సహా బయటపెట్టాం. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రమేయంపై సిబిఐ విచారణ జరపాలని డిమాండ్ చేశాం” అని జగన్ వివరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన ఇవ్వాలి, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు ఇస్తామన్నారు ఆ మాట నిలబెట్టుకోవాలి. నిరుద్యోగ భృతి ఇవ్వాలిరాష్ట్రంలో ఏ ఒక్క పంటకూ గిట్టుబాటు ధర రావడం లేదు. ఉచిత పంటల బీమా లేదు. ఇన్‌పుట్ సబ్సిడీ లేదు. తీవ్ర సంక్షోభంలో వ్యవసాయ రంగం కూరుకు పోయిందని వైయస్ జగన్ ధ్వజమెత్తారు.

కొత్త పిపిపి పాలసీ రాష్ట్రానికి అంతులేని నష్టం అది ‘ఆంధ్రప్రదేశ్ ఫర్ సేల్ల్’ అన్నట్లుగా ఉందని విమర్శించారు. వీటిన్నింటిపై మండలిలో ఈ అంశాల్ని లేవనెత్తి చర్చకు పట్టుబట్టాలని ఎమ్మెల్సీలకు సూచించారు.

దిశ చట్టం రద్దు, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించిన బీసీ నేతలు చింతడ రవి, ముస్తఫాలపై అక్రమ కేసులు బనాయించడం వంటి అంశాలను సభలో ప్రస్తావించాలని ఆయన ఆదేశించారు. జూనియర్ డాక్టర్ల సమ్మె, ఉద్యోగులు, మహిళలు, యువతలో ఉన్న అసంతృప్తిని కూడా మండలిలో ఎత్తిచూపాలని, పూర్తి ఆధారాలతో సభకు వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని జగన్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

**మండలి డిప్యూటీ ఛైర్మన్ పదవికి తూమాటి మాధవరావు:** శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ పదవికి పార్టీ నుంచి ఎమ్మెల్సీ టి.మాధవరావును ప్రతిపాదిస్తున్నట్లు మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సిపి అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు.

అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆయన పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో దిశా నిర్దేశం చేశారు.

ఈ సందర్భంగానే మండలి డిప్యూటీ ఛైర్మన్ అభ్యర్థిగా టి.మాధవరావును ప్రకటించారు. పార్టీ ఎమ్మెల్సీలందరూ మాధవ్‌కు మద్దతుగా నిలవాలని, ఎన్నిక సాఫీగా జరిగేలా సమన్వయంతో పని చేయాలని నిర్దేశించారు. మండలి డిప్యూటీ ఛైర్మన్ పదవి రాజ్యాంగపరంగా కీలకమైనదని ఆయన తెలిపారు.

## సాయికృష్ణ లాకప్ డెత్ కేసు...
# సిట్ అదుపులో హోంగార్డు

**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** రౌడీ షీటరు గాదె సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో కృష్ణలంక పోలీసుస్టేషన్‌లో పనిచేసే హోంగార్డును సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. హోంగార్డు వెంకటరాజును అధికారులు ప్రశ్నిస్తున్నారు. స్టేషన్‌లోని సిసి కెమెరాల డేటా తొలగించాడని హోంగార్డుపై ఆరోపణలు ఉన్నాయి. సిఐ నాగరాజు ఆదేశాలతోనే డివిఆర్ తొలగించినట్లు సిట్ గుర్తించింది. అలాగే లాకప్‌డెత్ కేసులో కీలక ఆధారమైన సిసి ఫుటేజ్ ధ్వంసం చేశారని గుర్తించారు. ఈ కేసుకు సంబంధించి సిట్‌కు హోంగార్డు అనుమానమైన సమాచారం అందించినట్లు తెలుస్తోంది.

## జిజిహెచ్‌లో జూనియర్ వైద్యుల సమ్మె ఉధృతం

**అత్యవసర సేవలు మినహా మిగిలిన సేవలకు విరామం..**
**ఉపకార వేతనం పెంచాలని డిమాండ్**

**గుంటూరు మెడికల్ , ఆగస్టు 12:(ప్రభాత వార్త)** గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల సంఘం చేపట్టిన సమ్మె బుధవారం ఉధృతమైంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో జూనియర్ వైద్యులు అత్యవసరం కాని వైద్య సేవలను నిలిపివేసి నిరసన కొనసాగిస్తున్నారు. అత్యవసర చికిత్సలు, అత్యవసర శస్త్రచికిత్సలు, అత్యవసర విభాగాల్లో సేవలను మాత్రం కొనసాగిస్తున్నారు. దీంతో సాధారణ వైద్యం కోసం ఆసుపత్రులకు వచ్చిన రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌కుమార్ మాట్లాడుతూ ఉపకార వేతనాన్ని పెంచాలని, పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు మించకుండా చూడాలని కోరారు. జాతీయ వైద్య మండలి నిబంధనల ప్రకారం ఎంఎస్, పీహెచ్‌డీ నియామకాలు 15 శాతానికి లోపే ఉండాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలమయ్యాయని, తమ సమస్యలపై ప్రభుత్వం పునరాలోచించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లో జూనియర్ వైద్యులకు ఆంధ్రప్రదేశ్ కంటే సుమారు 30 శాతం అధికంగా ఉపకార వేతనం అందుతున్నట్లు తెలిపారు.సమ్మె కొనసాగుతున్నప్పటికీ అత్యవసర వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా సేవలు అందిస్తున్నామని ఈశ్వర్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రభుత్వం త్వరగా సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ప్రతిపాదన ఏమిటంటే..జూనియర్ వైద్యుల డిమాండ్లకు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం వార్షిక ప్రాతిపదికన ఉపకార వేతనం పెంపే ప్రతిపాదనను వర్గాల్లో ఉంచినట్లు సమాచారం. ఇందులో పీజీ వైద్యులకు సంవత్సరానికి 3 శాతం, ఇంటర్న్‌లకు 5 శాతం చొప్పున పెంపు ప్రతిపాదించినట్లు వెల్లడైంది. అయితే రెండేళ్లకు 15 శాతం, ప్రస్తుతం 30 శాతం పెంపు కోరుతున్న జూనియర్ వైద్యుల సంఘం ఈ ప్రతిపాదనపై సంతృప్తి చెందలేదు. దీంతో చర్చలు ఫలించలేదు. ప్రభుత్వం-వైద్యుల మధ్య కుదరని ఏకాభిప్రాయం...సమ్మె నేపథ్యంలో జూనియర్ వైద్యుల ప్రతినిధులు వైద్య విద్యాశాఖ ఉన్నతాధికారులతో వరుసగా చర్చలు జరిపారు. సమస్యల పరిష్కారం లభిస్తుందని ఆశించినప్పటికీ రెండు రోజుల చర్చల్లోనూ స్పష్టమైన నిర్ణయం రాకపోవడంతో ఆందోళనను కొనసాగించాలని సంఘం నిర్ణయించింది. రోగులపై ప్రభావం...జీజీహెచ్‌కు ప్రతిరోజూ గుంటూరు జిల్లాతో పాటు పల్నాడు, బాపట్ల, ప్రకాశం తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు వస్తుంటారు. జూనియర్ వైద్యుల సమ్మెతో సాధారణ వైద్య సేవలు మందగించడంతో వైద్యుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కొంతమంది రోగులు చికిత్స వాయిదా వేసుకోవాల్సి వస్తుండగా, మరికొందరు ప్రత్యామ్నాయ వైద్య సేవలను ఆశ్రయించాల్సి వస్తోంది.జూనియర్ వైద్యుల డిమాండ్లు-ప్రభుత్వ ప్రతిపాదనల మధ్య వ్యత్యాసం తొలగి, త్వరగా పరిష్కారం లభించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని సంఘం హెచ్చరిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితిని ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తుండగా, రోగులకు ఇబ్బందులు కలగకుండా అత్యవసర వైద్య సేవలు కొనసాగించడంపై అధికారులు దృష్టి సారిస్తున్నారు.

## సామర్లకోట రైల్వే స్టేషన్‌లో పోలీసుల తనిఖీ

**గంజాయి స్వాధీనం... ఐదుగురు మహిళలు అరెస్టు**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,** ఆగస్టు 12 (ప్రభాతవార్త): కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్లో బుధవారం జి.ఆర్.పి పోలీసులు జరిపిన తనిఖీలలో గంజాయి రవాణా సాగిస్తున్న ఐదుగురు మహిళలు పట్టుబడినట్లు జి ఆర్ పి రాజమండ్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు ఎస్ఐ వాసు తెలిపారు.సామర్లకోట రైల్వే స్టేషన్ లో గంజాయి రవాణా కొనసాగుతున్న సమాచారం మేరకు రైల్వే స్టేషన్లో తనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు. స్థానిక రైల్వే స్టేషన్లోని ప్లాట్ఫారం నెంబర్ రెండు, మూడులో కొందరు మహిళలు అనుమానాస్పదంగా కనిపించటంతో పూర్తి స్థాయి తనిఖీలు నిర్వహించామన్నారు.ఆ మహిళల వద్ద ప్లాస్టిక్ బ్యాగ్ లలో 60 కేజీల గంజాయి పట్టుబడిందన్నారు. దీని విలువ సుమారు 4 లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు. రైల్వే ద్వారా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ శ్రీనివాస్ ఎస్ ఐ వాసు తెలిపారు.గంజాయి రవాణా చేస్తున్న మహిళలు నెల్లూరు జిల్లా బిట్రగుంట ప్రాంతానికి చెందిన వారని,వారిని అరెస్ట్ చేసి విజయవాడ రైల్వే కోర్టులో ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. పట్టుబడిన గంజాయి సుమారు 30 లక్షలు పైగా విలువ ఉంటుందని పోలీసులు గుర్తించారు.

## వరికి బీమా గడువు ఇక నాలుగు రోజులే!..

**విజయవాడ.,ఆగస్టు 12, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన గడువు ఈ నెల 15తో ముగియనుంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో వరి సాగు రైతులు పంటల బీమాలో నమోదు చేసుకోవటానికి ఇదే చివరి అవకాశం. గడువు లోగా బీమా ప్రీమియం చెల్లిస్తే.. ఈపంట నమోదు వివరాలను తర్వాతైనా వేయించుకోవచ్చని వ్యవసాయ శాఖ తెలిపింది. ముందస్తు పంటల బీమాకు ఈపంట నమోదు అవసరం లేదని స్పష్టం చేసింది. కేవలం పంట సాగుపై స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పించి, గడువులోగా బీమా ప్రీమియం చెల్లించాలని పేర్కొంది. ఎన్.సి.ఐ పరిస్థితులతో ఆర్థిక భరోసా కోసం ప్రతి రైతు పంటల బీమాలో నమోదు కావాలని సూచించింది. కాగా, పప్పు ధాన్యాల కొనుగోలుకు ఫార్మర్ ఐడీ తప్పనిసరి అని స్పష్టం చేసింది. ఫార్మర్ ఐడీ క్యూఆర్ కోడ్ను వ్యాల్యూస్ చేసుకుని, రిజిస్టర్ చేయించుకోవాలని సూచించింది.

## విద్యుత్ ఉచ్చుకు అటవీశాఖ ఆఫీసర్ బలి



**బూర్గంపహాడ్, ఆగస్టు 12 ప్రభాతవార్త:** అడవి జంతువులను అక్రమంగా వేటాడేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ ఉచ్చు అటవీశాఖ ఉద్యోగి ప్రాణాలను బలిగొంది. వన్యప్రాణుల వేటకు విద్యుత్ తీగలు ఏర్పాటు చేసినట్లు అందిన సమాచారంతో సంఘటనా ప్రాంతానికి వెళ్లిన బీట్ ఫారెస్ట్ ఆఫీసర్ (ఎఫ్‌బీఓ) బానోతు నవీన్ విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందిన విషాద ఘటన బూర్గం పహాడ్ మండలం నకిరేపేట గ్రామ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసు కుంది. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై మేడా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం నకిరేపేట గ్రామపరిధిలో కొంతమంది వ్యక్తులు అడవి జంతువులను వేటాడేందుకు అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేసినట్లు అటవీశాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో డీఆర్‌ఓ కురుసం అనార్కలి, ఎఫ్‌బీఓ బానోతు నవీన్‌తో పాటు అటవీశాఖ సిబ్బంది అక్కడికి చేరుకొని విద్యుత్ తీగలను గుర్తించడంతో పాటు సంబం ధిత వ్యక్తుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో అడవి జంతువుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు ఎఫ్‌బీఓ బానోతు నవీన్ తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు తెలిపారు. అక్రమ వేటను అడ్డుకునే విధి నిర్వహణలో భాగంగా వెళ్లిన ఉద్యోగి ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోవడంతో అటవీశాఖలో విషాదం నెలకొంది.నవీన్ మృతికి కారణమైనట్లు అనుమానిస్తున్న ఎర్రంపాడు లక్ష్మీ పురం గ్రామానికి చెందిన ఉప్పల నాగిరెడ్డి, దాసరి నరేష్, తాటి వీరబాబులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీఆర్‌ఓ కురుసం అనా ర్కలి బుధవారం బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# ఆర్టీసి ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు ఆధునిక వైద్య పరీక్షల సదుపాయం

**నూతన ల్యాబ్ పరికరాలను ప్రారంభించిన ఆర్టీసి ఎండి**



**విజయవాడ, ఆగస్టు 12 (ప్రభాతవార్త):** ఆర్టీసి ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఆధునిక వైద్య పరీక్షలు నిర్వహించేందుకు రూ.22 లక్షలతో విజయవాడ, విద్యాధరపురంలోని ఆర్టీసి ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన వైద్య పరికరాలను ఆర్టీసి వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.బాలసుబ్రహ్మణ్యం బుధవారం ప్రారంభించారు. ఈ పరికరం సహాయంతో ఆర్టీసి ఉద్యోగులకు ఆధునిక వైద్య పరీక్షలు అందుబాటులోకి రానున్నాయి. థైరాయిడ్ (ప్రొఫైల్స్), మెదడులో ఏర్పడే కణితులు, అర్బుదములు, గుండె రక్త నాళాలలో ఏర్పడే అడ్డంకులను పరీక్షించడం, విటమిన్ పరీక్షలు, వైరల్ మార్కర్లు,మధుమేహం (షుగర్) పరీక్షలు ఫాస్టింగ్, ఇన్సులిన్, మధుమేహ రకాల గుర్తింపుకు సహకారం, వివిధ ఇన్ఫెక్షన్ వ్యాధుల మార్కర్ల పరీక్షలు, రక్తంలోని ఔషధ స్థాయిల పరీక్షలు, రక్త నమూనాలోని అతి స్వల్ప పదార్థాలను గుర్తించే పరీక్షలు. ఈ వైద్య పరికరాల ద్వారా నిర్వహిస్తారు. ఆర్టీసి ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సెంట్రల్ హాస్పిటల్‌లో అధునాతన వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడంలో భాగంగానే ఈ నూతన పరికరాన్ని ఏర్పాటు చేసినట్లు మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.బాలసుబ్రహ్మణ్యం ఈ సందర్భంగా తెలిపారు. ఈ పరికరం అందుబాటులోకి రావడంతో పలు ముఖ్యమైన వైద్య పరీక్షలను ఆర్టీసి ఆసుపత్రిలోనే నిర్వహించుకునే అవకాశం కలుగుతుందని, తద్వారా ప్రైవేటు ప్రయోగశాలలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గడంతో పాటు సమయం, వైద్య పరీక్షలపై అయ్యే ఖర్చు ఆదా అవుతుందని పేర్కొన్నారు. ఈ పరికరం ద్వారా 99 శాతానికి పైగా ఖచ్చితత్వంతో పరీక్షా ఫలితాలు పొందవచ్చని తెలిపారు. ఒకేసారి 60 నమూనాలను 30 నిమిషాల్లో, ఒక గంటలో 100 నమూనాల వరకు పరీక్షించే సామర్థ్యం ఈ పరికరానికి ఉంది. దీంతో వ్యాధులను ముందుగానే గుర్తించడం, సరైన చికిత్సను నిర్ణయించడం, వేగవంతమైన వైద్య నిర్ధారణ అందించడం ద్వారా ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. కార్యక్రమంలో ఆర్టీసిఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కె.ఎస్.బి. రెడ్డి (అడ్మిన్), జి.వి.రవివర్మ (ఇంజినీరింగ్), ఎస్.టి.పి. రాఘవ కుమార్ (ఆపరేషన్స్), ఛీఫ్ మెడికల్ ఆఫీసర్డా. ఆర్. శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ వైద్యులుడా కె. అమృతవల్లి, డా. ఎస్.ఎస్. స్వామిఇతర పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ దిశగా మరో ముందడుగు

- జిజిహెచ్ లో మాతా, శిశు సంరక్షణకు 18 కొత్త వాహనాలు ప్రారంభం..
- బాలింతలు, నవజాత శిశువుల సంరక్షణే కూటమి ప్రభుత్వ ధ్యేయం..
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కందుల దుర్గేష్..



తల్లీబిడ్డ వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఇంచార్జి మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే నశీర్ ఆహ్మద్...

**గుంటూరు మెడికల్ , ఆగస్టు 12:(ప్రభాత వార్త )** ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులను ప్రోత్సహించి మాతా, శిశు మరణాలను గణనీయంగా తగ్గించడమే లక్ష్యంగా తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను ప్రవేశపెట్టినట్లు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర పర్యాటక శాఖ మాత్యులు కందుల దుర్గేష్ తెలిపారు. బుధవారం గుంటూరు నగరంలోని జిజిహెచ్ ప్రాంగణంలో గల కానూరి జింఖానా స్త్రీ శిశు ఆరోగ్య కేంద్రం వద్ద స్థానిక ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తో కలిసి మంత్రి 18 తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ గర్భిణులను ఆస్పత్రికి తీసుకురావడం, ప్రసవానంతరం బాలింతలను, బిడ్డలను సురక్షితంగా ఇంటికి చేర్చడానికి ఈ వాహనాలు ఉపయోగపడతాయన్నారు. ఎయిర్ కండిషన్ తో కూడిన, ఎయిర్ బ్యాగ్‌లు కలిగిన పూర్తి సురక్షితమైన వాహనాలన్నారు. గర్భిణులు మరియు బాలింతలు 102 కాల్ సెంటర్ కు ఫోన్ చేసి ఉచితంగా ఈ సేవలను పొందవచ్చునన్నారు. వారికి తోడుగా ఆసుపత్రి సిబ్బంది కూడా వాహనంలో ఉంటారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా నిన్న ప్రారంభమైన ఈ కార్యక్రమంను గుంటూరు జిల్లాలో ఈరోజు ప్రారంభించామని, జిల్లాకు 18 వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యసాధనలో భాగంగా ఈ వాహనాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డా. దుర్గాప్రసాద్, డిఎంహెచ్ఓ డా. విజయలక్ష్మి, డిసిహెచ్ఎస్ డా. రంగారావు, ఆర్ డి ఓ శ్రీనివాసరావు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ సహకార సవరణ బిల్లుకు టిడిపి మద్దతు

**సహకార రంగంలో సిఎం చంద్రబాబు కృషి అద్భుతం:**
**రాజ్యసభలో ఎంపి చింతకాయల విజయ్**

**విశాఖపట్నం, ప్రభాతవార్తఔ:** జాతీయ సహకార అభివృద్ధి కార్పొరేషన్ (సవరణ) బిల్లు2026కు తెలుగుదేశం పార్టీ తరఫున రాజ్యసభలో ఎంపీ చింతకాయల విజయ్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ బిల్లుపై సభలో ఆయన మాట్లాడుతూ.. సహకార సంస్థలను స్వయం సమృద్ధిగా, పటిష్టంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఖిసహకార్ సే సమృద్ధిఖి విజన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి అందించారని కొనియాడారు. 2021లో ప్రత్యేకంగా సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిన ప్రధానికి, అలాగే ఈ ఉద్యమానికి సంస్థాగత వేగాన్ని అందించిన కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా కృషికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని మామిడి రైతుల సహకార సంఘం పనితీరును ఆయన సభలో ఉదహరించారు. ఒక రైతు ఒంటరిగా మార్కెట్‌కు వెళితే బేరసారాలు ఆడే శక్తి పరిమితంగా ఉంటుందని, అదే రైతులు సహకార సంఘాల ద్వారా ఏకమైతే వారి బలం అనేక రెట్లు పెరుగుతుందని పేర్కొన్నారు. దీని ద్వారా రైతులు కేవలం ఉత్పత్తిదారులుగానే మిగిలిపోకుండా సమీకరణ, ప్రాసెసింగ్, మార్కెట్ యాక్సెస్ వంటి వాటిలోనూ భాగస్వాములు అవుతారని విజయ్ వివరించారు. ప్రస్తుతం దేశంలో 8.5 లక్షలకు పైగా రిజిస్టర్డ్ సహకార సంఘాలు ఉండగా, వాటిలో 6.6 లక్షల సంఘాలు క్రియాశీలంగా పనిచేస్తున్నాయని ఎంపీ విజయ్ సభ దృష్టికి తెచ్చారు. దాదాపు 32 కోట్ల మంది సభ్యులతో గ్రామీణ భారతదేశంలో 98 శాతం మందికి ఇవి చేరువయ్యాయని, 30కి పైగా రంగాలు, స్వయం సహాయక సంఘాల ద్వారా సుమారు 10 కోట్ల మంది మహిళలు ఇందులో భాగస్వాములయ్యారని తెలిపారు. 20142019 మధ్యకాలంలో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వ హయాంలో సహకార రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు, కౌలు రైతులను కూడా సహకార రంగంలోకి తీసుకురావడంలో చంద్రబాబు పోషించిన అద్భుతమైన పాత్రను విజయ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. 1962 నాటి సహకార చట్టాన్ని 2026 నాటి ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా మార్చాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కొత్త బిల్లు ద్వారా ఎన్‌సిడిసిని కేవలం వ్యవసాయం, రుణాలకే పరిమితం చేయకుండా ఫుడ్ ప్రాసెసింగ్, స్టోరేజ్, హెల్త్‌కేర్, ఎగుమతులు, విత్తనాలు, సేంద్రీయ ఉత్పత్తులు, డిజిటల్ సేవలతో పాటు మొబిలిటీ వంటి కొత్త రంగాలకు విస్తరిస్తుండటాన్ని ప్రశంసించారు. దీనికి ఉదాహరణగా, డ్రైవర్లను ఓనర్లుగా మార్చేలా జీరో కమిషన్‌తో పనిచేసే భారత్ టాక్సీ అనే వినూత్న సహకార నమూనాను ఆయన ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్‌లోని మామిడి రైతుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన ప్రధాని మోదీ, అమిత్ షాలకు ఎంపీ విజయ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల్లోని సుమారు 91 వేల హెక్టార్లలో తోతాపురి మామిడి సాగు చేస్తున్న రైతులు ఇటీవల తీవ్రమైన ధరల పతనంతో ఇబ్బందులు పడ్డారని, ఈ సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపిన సిఎం చంద్రబాబు ఆయన అభినందించారు. రాష్ట్రంలోని గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి ఎంపీ విజయ్ ఒక కీలక సూచన చేశారు. ఎన్‌సిడిసి ద్వారా గిరిజన ప్రాంతాలకు ప్రత్యేకంగా డెయిరీ కోఆపరేటివ్ ఫైనాన్సింగ్ విండోను ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. తద్వారా పాల శీతలీకరణ కేంద్రాలు, టెస్టింగ్, కలెక్షన్ సెంటర్లతో పాటు పశుగ్రాసం, పశువైద్య సేవలు, సరైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడానికి వీలవుతుందని, ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి అమిత్ షాకు ఎంపీ విజయ్ విజ్ఞప్తి చేశారు.

# కదిరిలో రౌడీ షీటర్ శివ కుటుంబం ఆత్మహత్యయత్నం

- అరెస్టు వారెంట్ జారీ చేసిన ఎస్సీ, ఎస్టీ కోర్టు
- అరెస్టు చేయడానికి వెళ్లిన పోలీసులపై

**తిరగబడిన శివ కుటుంబం**



ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రౌడీ షీటర్ శివ ■ సిఐతో వాగ్వివాదం దిగిన రౌడీ షీటర్ శివ తండ్రి చంద్రశేఖర్

**కదిరి, ఆగస్టు 12 ప్రభాతవార్త:** శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో రౌడీ షీటర్ శివ కుటుంబం ఆత్మహత్య యత్నానికి పాల్పడటం కలకలం రేపింది. వివిధ కేసుల్లో నింధితుడిగా ఉన్న శివ న్యాయ స్థానంలో వాయిదాలకు హాజరు కాకపోవడంతో ఉమ్మడి అనంతపురం జిల్లా ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానం శివ అరెస్టుకై అరెస్టు వారెంట్ జారీ చేసింది. దీంతో కదిరి పట్టణ పోలీసులు రౌడీ షీటర్ శివను అరెస్టు చేయడానికి బుధవారం పట్టణ సిఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి వారి నివాసం వద్దకు వెళ్లగా దాదాపు 2 గంటలపాటు వారి ఇంటి వద్ద హై డ్రామా నెలకొంది. రౌడీ షీటర్ శివకుటుంబం ఇంటిలోనే వుండి లోపల గడియ తీయకపోవడంతో పోలీసులు అక్కడ రెండు గంటలపాటు ఉండి పోవాల్సిన పరిస్థితి నెలకొంది. పోలీసులు ఎంత సేపటికీ వెళ్లకపోవడంతో శివ, శివ భార్య యాసికా, తల్లి నరసు మరుగుదొడ్లు శుభ్రంచేసే ద్రావకం తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. విషయాన్ని గమనించిన పోలీసులు హుటాహుటిన స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం అనంతపురంకు తరలించారు. రౌడీ షీటర్ శివ తండ్రి చంద్రశేఖర్ పోలీసులతో వాగ్వివాదానికి దిగడంతోపాటు నానాదుర్భాషలాడాడు. పోలీసు విధులకు ఆటంకం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పలు కేసుల్లో నింధితుడిగా ఉన్న శివ వాయిదాలకు హాజరు కాకపోవడం, అరెస్టు వారెంట్‌తో అరెస్టు చేయడానికి వెళ్లిన పోలీసులపై ఇలా బ్లాక్ మెయిల్ చేయడం తగదన్నారు. పోలీసులకు బ్లాక్‌మెయిల్ చేసినా ఎంతటి వారినైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిఐ స్పష్టం చేశారు.

# రైతుల ప్రయోజనాలే ముఖ్యం.. ప్రతి ఎకరా పంటను కాపాడుకుంటాం

**నెల్లూరు, ఆగస్టు 12, ప్రభాతవార్త:** కలెక్టరేట్ రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి ముఖ్యమని, జిల్లాలో రెండో పంట సాగులో ఉన్న వరి పంటను కాపాడడమే ధ్యేయమని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ప్రతి ఎకరా పంటను కాపాడుకుంటామని, చివరి వరకు నీరు అందించేందుకు బాధ్యతతో పనిచేస్తామని స్పష్టం చేశారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో బుధవారం ఉదయం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన జిల్లాలో రెండో పంటకు నీటి విడుదల, సోమశిల, కండలేరు జలాశయాల్లో నీటి నిల్వలు, నీటి సరఫరాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటి వృథాను అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై సుదీర్ఘంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉదయగిరి, కావలి, సర్వేపల్లి, కోవూరు ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, సోమిరెడ్డి, ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. తొలుత ఇరిగేషన్ అధికారులు జిల్లాలోని నీటి పారుదల సమస్యలు, కండలేరు జలాశయంలో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు, రెండో పంటకు అవసరమయ్యే నీటి పరిమాణం, నీటిని వృథా కాకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఇప్పటికే చేపడుతున్న చర్యలపై సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని డెల్టా, నాన్‌డెల్టా ప్రాంతాల్లో నీటి సరఫరా పరిస్థితి, కాలువల వారీగా ఉన్న సమస్యలను అధికారులు వివరించారు.

## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో
# ఎంపి శబరి భేటీ

**విజయవాడ.ఆగస్టు12, ప్రభాతవార్తప్రతినిధి:** న్యూ ఢిల్లీలోని కేంద్ర రహదారులు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని వారి కార్యాలయంలో బుధవారం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, డాక్టర్ బైరెడ్డి శబరి మర్యాదపూర్వకంగా కలిసి నంద్యాల పరిధిలోని పలు సమస్యలను వినతి పత్రం ద్వారా వివరించారు. నంద్యాల జిల్లా ప్రజల భద్రత, సౌకర్యం, మెరుగైన రవాణా కనెక్టివిటీకి సంబంధించిన పలు ముఖ్యమైన అభ్యర్థనలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశామని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు. బొల్లవరం, కరివేన, ఆత్మకూరు-సిద్ధపల్లె జంక్షన్ వద్ద అండర్‌పాస్‌లు, పారుమంచాల వద్ద మీడియన్ ఓపెనింగ్, డిపాల్ స్కూల్ సమీపంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, భానుముక్కల - ఇస్కాల గ్రామాల్లో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ని కోరానన్నారు. అలాగే ఎన్‌హెచ్340సీ (ఆత్మకూరు-దోర్నాల), విబీ544డీ(బుగ్గ-కైప-గిద్దలూరు) రహదారులకు సంబంధించిన డి పి ఆర్ ల ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశానని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు.

## హెడ్‌కానిస్టేబుల్ పై దాడి.. ఇద్దరు అరెస్టు



హెడ్‌కానిస్టేబుల్‌పై దాడి చేస్తున్న యువకుడు

**శ్రీకాళహస్తి,ఆగస్టు 12 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్న రమణయ్యపై మంగళవారం రాత్రి పట్టణానికి చెందిన యువకుడు ఆతని స్నేహితులు దాడి చేసి హల్ చల్ సృష్టించారు. దాడి చేసిన ఇద్దరు యువకులను అదుపులో తీసుకున్నట్లు తిరుపతి జిల్లాఎస్‌పి రవిమనోహారాచారి బుధవారం మీడియా సమావేశంలో వివరించరు. శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్‌లో ఓ ప్రయాణీకుడు తన లాబ్‌ట్యాప్ దొంగతనం జరిగిందని 112కు ఫిర్యాదు చేయటంతో విచారణకు వెళ్ళిన హెడ్‌కానిస్టేబుల్ రమణయ్యకు పానగల్ లో రెండు మోటార్‌సైకిళ్ళు ఢీకొనటంతో బుజ్జమ్మ అనే మహిళ గాయపడింది. ఆమెను మానవతా ధృకృథంతో భర్తతో పాటు ఆసుపత్రికి తరలించారు.ప్రమాదానికి గురైన వాహనం తాళాలు తీసుకోవటంతో ఆ వాహనం నడిపిన యువకుని వెనుక కూర్చొన్న శ్రీనివాసులు హెడ్‌కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడ్డాడని ఎస్‌పి కేసు వివరాలు తెలిపారు. ఆ యువకుడు తన వద్ద ఉంచుకున్న చూర కత్తితో హెడ్‌కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడం జరిగిందన్నారు. హెడ్‌కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి నిందితులు శ్రీనివాసులు, ఆతని స్నేహితుడు జితేంద్రను అరెస్టు చేసినట్లు వివరించారు. నిందితుని బుధవారం సాయంత్రం శ్రీకాళహస్తి పట్టణంలో ఊరేగింపుగా రిమాండ్‌కు పంపారు.శ్రీకాళహస్తిలో శాంతి భద్రతల పరిస్థితి ప్రమాదంలో పడిందని పలువురు పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. పుణ్యక్షేత్రంలో యువత మత్తుకు బానిసలై హాల్‌చల్‌చేస్తున్నారని చర్చించుకుంటున్నారు.

## ఎపిలో పెట్టుబడులకు పారిశ్రామికవేత్తల ఆసక్తి

**విజయవాడ, ఆగస్టు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు చెన్నై, కోయంబత్తూర్‌లలో నిర్వహించిన ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ రోడ్‌షోలు విజయవంతం అయినట్లు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాలశాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రప్రభుత్వం తరుపున మంత్రి ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో ఈరెండు పట్టణాల్లోనూ సదస్సులు నిర్వహించి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు గల అవకాశాలను, రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని పారిశ్రామికవేత్తలకు వివరించారు. సిఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ -2016 కి ముందుగా చేపడుతున్న పెట్టుబడుల ప్రోత్సాహక కార్యక్రమాలో భాగంగా ఈరోడ్‌షో నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ విజనరీ లీడర్ నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో సంవృద్దిగా ఉన్న సహజ వనరులు, మౌలిక వసతులు, వేగవంతమైన అనుమతులు, పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన వాతావరణం పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వివరించారు. ఇసుజు మోటార్స్, హీరో మోటోకార్స్, కోరమండల్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు తమకున్న సానుకూల అనుభవాలను పంచుకోవటం సంతోషకరమన్నారు. మంగళవారం చెన్నైలో జరిగిన సదస్సులో జర్మనీ కాన్సులేట్ జనరల్ మైఖేల్ హాస్పర్, ఇండో-జపాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు ఎస్.పద్మనాభన్, టిఈసిసి చెన్నై డైరెక్టర్ జనలర్ స్టీఫెన్‌హ్యు, పోస్కో చెన్నై ప్లాంట్ హెడ్ జంగ్ ఉంగ్ కాంగ్‌తో చర్చలు జరపినట్లు మంత్రి తెలిపారు.

## రైతు భూమికి రక్షణ- రైతు హక్కుకు భరోసా

**కోవూరు, ఆగస్టు 12, ప్రభాతవార్త:** రైతు భూమికి రక్షణ కల్పించడం.. రైతుల హక్కులకు భరోసా ఇవ్వడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరు పంచాయతీ పరిధిలోని 939 మంది రైతులకు పాస్ పుస్తకాలు, 50 మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భూ సమస్యలు పరిష్కరిస్తామని, రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తామని, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, దానిని వెంటనే అమలు చేసి మాట నిలబెట్టుకోవడం జరిగిందన్నారు. కేవలం గత ప్రభుత్వం యొక్క తప్పిదాల వలన అనేక ప్రాంతాల్లో రైతుల సొంత భూములు కూడా నిషేదిత జాబితాలోకి వెళ్లాయన్నారు. కోవూరు నియోజకవర్గంలోని కొత్త వంగల్లు లో కూడా ఇటువంటి సమస్యలు ఉన్నాయన్నారు. 90 ఏళ్లుగా రైతులు సాగు చేస్తున్న 400 ఎకరాల భూములు నిషేదిత జాబితాలోకి వెళ్లాయన్నారు. వెంటనే ఈ విషయాన్ని కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కోవూరు గ్రామంలో 5554 ఎకరాలకు రీ సర్వే పూర్తి చేయడం జరిగిందని, ఇందులో 3917 ఎకరాలకు సంబంధించి 939 మంది రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను అందించడం జరిగిందన్నారు. ఇప్పటికే మండలంలోని 9 గ్రామాల్లో ఇటువంటి పాసు పుస్తకాలనరు పంపిణీ చేయడం జరిగిందన్నారు. సాదా బైనామా భూములకు కూడా పాసు పుస్తకాలు అందించే చర్యలు జరుగుతున్నాయన్నారు. ఇటుక బట్టీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్న 50 మంది నిరుపేదలకు ఈ సందర్భంగా పట్టాలు కూడా పంపిణీ చేయడం జరిగిందని, ఇందుకు సహకరించిన నాయకులు బాల చెన్నయ్యకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

## డాక్టర్ ప్రియాంక మృతిపై విచారణ జరిపించాలి: సిపిఎం డిమాండ్

**విజయవాడ.,ఆగస్టు 12,ప్రభాతవార్తప్రతినిధి:** రాజమహేంద్రవరంలో ఆగష్టు 3వ తేదీ రాత్రి మద్యం సేవించి కొందరు దుండగులు పలుమార్లు కారుతో ఢీ కొట్టించి దారుణంగా హత్య చేసిన ఘటనలో డా.ప్రియాంక తీవ్రంగా గాయపడి మృతిచెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది ఈ మేరకు సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటన చేసారు..సీసీటీవీ దృశ్యాల ప్రకారం మద్యం మత్తులో ఉన్న నిందితులు అత్యంత నిర్లక్ష్యంగా కారును నడుపుతూ ప్రియాంకను పలుమార్లు ఢీకొట్టారు. ప్రమాదానికి ముందు కూడా ప్రసాద్ ఆదిత్య మాల్ వద్ద భద్రతా సిబ్బందితో వారు ఘర్షణకు దిగినట్లు సిసి కెమెరా ల్లో స్పష్టంగా కనిపిస్తోంది. అలాంటి నేపథ్యంలో ఈ ఘటనను కేవలం రోడ్డు ప్రమాదంగా పరిగణించడం సరైంది కాదు. నిందితుల వెనుక పలుకుబడి కలిగిన రాజకీయ నాయకులున్నారని, వారు కేసు నీరు కార్చడానికి ప్రయత్నిస్తున్నారని ఇప్పటికే వార్తలు వచ్చాయి.కేవలం రాజమండ్రిలో ప్రజాసంఘాలు, పౌర సమాజం స్పందించి అందోళన చేశాకే నిందితులపై హత్యకు సంబంధించిన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు రాష్ట్ర ప్రభుత్వం వారి కుటుంబానికి ప్రకటించిన సహాయం సక్రమంగా లేదు డా. ప్రియాంక మృతి ఘటనపై పూర్తి స్థాయిలో, పారదర్శకంగా విచారణ జరిపించాలని వాపోయారు.

ఆట



# సింక్యూఫీల్డ్ కప్‌లో.. సిందరోవ్‌పై ప్రజ్ఞా విజయం

**న్యూఢిల్లీ:** సింక్యూఫీల్డ్ కప్‌లో జవోఖిర్ సిందరోవ్‌పై ప్రజ్ఞానంద గెలుపు సాధించాడు. గ్రాండ్ చెస్ టూర్‌లోని చివరి ఈవెంట్ అయిన సింక్వీల్డ్ కప్ రెండవ రౌండ్ మ్యాచ్‌లో బుధవారం భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద జవోఖిర్ సిందరోవ్ రక్షణను ఛేదించి తన మొదటి విజయాన్ని నమోదు చేసుకున్నాడు. క్వీన్ పాన్ ఓపెనింగ్ నుండి మొదలైన ఎండ్‌గేమ్‌లో, ప్రజ్ఞా అంగుళం అంగుళం చొప్పున తన పాయింట్‌ను కైవసం చేసుకుని, ఆట మొత్తానికి హీరోగా నిలిచాడు. సంపూర్ణ డ్రాగా ముగిసిపోవాల్సిన ఒక సమానమైన ఎండ్‌గేమ్‌ను సిందరోవ్ ఎంచుకున్నాడు.

కానీ ప్రజ్ఞానంద పట్టుదల. కంప్యూటర్ డ్రాగా భావిస్తున్న ఆట క్షణాల్లోనే విజయ దశకు చేరుకున్నాడు. ఈ ఆట ఏకంగా 95 ఎత్తుల పాటు సాగింది. ప్రజ్ఞానంద తన రెండు ఆటలలో 1.5 పాయింట్లు సాధించగా, రాత్రికి అగ్రస్థానంలో ఉన్న అమెరికాకు చెందిన ఫాబియానో కరువానా మాత్రమే హాలండ్‌కు చెందిన అనీష్ గిరితో డ్రాతో ప్రశాంతంగా ముగించాడు. ఆ డచ్ ఆటగాడు ఆరంభంలో చేసే లోతైన సన్నాహాలకు ప్రసిద్ధి చెందాడు మరియు అతను తన అభిమానులను నిరాశపరచలేదు, కానీ కరువానా తన నల్ల పావుతో బాగా సన్నద్ధమయ్యాడు. మొదటి రౌండ్‌లో కేవలం ఒకే నిర్ణయాత్మక ఫలితం వెలువడగా, రెండవ రౌండ్‌లో నాలుగు నిర్ణయాత్మక ఫలితాలతో సమీకరణం మారింది. ఈ రౌండ్లలో అమెరికాకు చెందిన లెవాన్ అరోనియన్ తన ప్రతిభను ప్రదర్శించి జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్‌ను ఓడించగా, అమెరికాకు చెందిన వెస్లీ సో హాలండ్‌కు చెందిన జోర్డెన్ వాన్ ఫోరెస్ట్‌పై తన ఆధిపత్యాన్ని నిరూపించుకున్నాడు.



## శ్రీలంక సిరీస్‌కు.. టీమిండియా కఠిన శిక్షణ

**న్యూఢిల్లీ:** శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్ కోసం భారత్ గతంలో ఎన్నడూ లేని విధంగా సన్నద్ధం అవుతోంది. ఈనెల 4న కొలంబోలో అడుగుపెట్టడం మొదలు అక్కడి నాన్‌డెస్క్రిప్ట్స్ క్రికెట్ క్లబ్ (ఎన్‌సీసీ) మైదానంలో వరుసగా ఎలాంటి విరామం లేకుండా చెమటలు చిందిస్తోంది. ఇందులో మూడు రోజుల పాటు సాగిన పూర్తి స్థాయి వామప్ మ్యాచ్‌తో పాటు, మిగిలిన రోజుల్లో రోజుకు ఐదు నుంచి ఆరు గంటల పాటు సాగిన కఠిన నెట్ సెషన్లు ఉన్నాయి. ప్రధానంగా ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ రేసులో నిలవాలంటే శ్రీలంకతో జరిగే ఈ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాల్సిన అవసరం తప్పనిసరి అయింది. అంతేకాకుండా శ్రీలంకపై 18 ఏండ్ల నుంచి ఒక్క టెస్టు సిరీస్ కోల్పోని రికార్డు భారత్‌కు ఉంది. ఈ నేపథ్యంలో లంక సిరీస్‌ను టీమిండియా యాజమాన్యం ప్రతిష్టాత్మకంగా తీసుకోవాల్సి వచ్చింది. ఈనెల 15న మొదలయ్యే సిరీస్ కోసం టీమ్ మేనేజ్‌మెంట్ ఏ చిన్న పొరపాటుకు కూడా తావివ్వకుండా పక్కా ప్రణాళికతో ఆటగాళ్లను సిద్ధం చేస్తోంది. ప్రస్తుత జట్టులో కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్‌కు మాత్రమే లంకలో టెస్టు మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉంది. మిగిలిన ఆటగాళ్లందరికీ ఇక్కడి పరిస్థితులు కొత్త. అందుకే లంకలో అడుగుపెట్టిన 24 గంటల్లోనే మైదానంలోకి దిగిన జట్టు ఇక్కడి విపరీతమైన వేడి, తీవ్రమైన తేమతో కూడిన వాతావరణానికి ఆటగాళ్లు అలవాటుపడేలా హెడ్ కోచ్ గంభీర్ ప్రాక్టీస్ సెషన్స్‌ను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, తిరిగి 2 నుంచి సాయంత్రం 5.30 వరకు రెండు విడతలుగా విభజించాడు. లంక ఎలెవన్‌తో జరిగిన వామప్ మ్యాచ్ సమయంలోనూ ఫీల్డింగ్ చేస్తున్న ఆటగాళ్లను మారుస్తూ, ఒకవైపు మ్యాచ్ ఆడుతూనే మరోవైపు సమాంతరంగా నెట్స్ ప్రాక్టీస్ చేయిస్తున్నాడు.

### కామన్వెల్త్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో

## భారతకు 3 స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం

**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్‌లో భారత ఫెన్సింగ్ జట్టు వివిధ సీనియర్ వ్యక్తిగత ఈవెంట్లలో ఒక్క రోజునే 3 స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం సాధించింది. నైజీరియాలోని లాగోస్‌లో జరుగుతున్న ఈ ఈవెంట్లలో సీనియర్ మహిళల ఫోయిల్, సీనియర్ పురుషుల ఈపీ, మరియు సీనియర్ పురుషుల సాబ్రే విభాగాలలో టీమ్ ఇండియా ఆధిపత్యం చెలాయించింది. సీనియర్ మహిళల ఫాయిల్ విభాగంలో భారత్ ఆధిపత్యాన్ని నెలకొల్పి, స్వర్ణ, రజత పతకాలను కైవసం చేసుకుంది. కచ్చితమైన, నియంత్రిత ప్రదర్శనతో కనగలక్ష్మి స్వర్ణ పతకాన్ని కైవసం



చేసుకోగా, ఆమె సహచరి జాయిస్ అషిత రజత పతకాన్ని గెలుచుకుంది. తద్వారా కాంస్య పతకం గెలుచుకున్న ఇంగ్లాండ్‌కు చెందిన జార్జియా గ్రీన్, ఎమిలీ గుడ్‌చైల్డ్‌ల కంటే ముందుగా వీరు పోడియంపై మొదటి రెండు స్థానాలను దక్కించుకున్నారు. సీనియర్ పురుషుల ఈపీ విభాగంలో కూడా విజయం కొనసాగింది, ఇక్కడ రాజేంద్రన్ శాంతిమోల్ షేర్జిన్ అద్భుతమైన ప్రదర్శన కనబరిచి భారతదేశానికి ఆ రోజు రెండవ స్వర్ణ పతకాన్ని సాధించిపెట్టాడు. సీనియర్ పురుషుల సాబ్రే ఈవెంట్‌లో, రజత పతకం సాధించిన ఆస్ట్రేలియాకు చెందిన షిమ్ యోంగీతో జరిగిన ఫైనల్ పోరులో అద్భుతమైన ప్రదర్శనతో సింగ్ కరణ్ సింగ్ భారతదేశానికి మూడవ స్వర్ణ పతకాన్ని అందించాడు. జట్టు సభ్యురాలు కుమారేసన్ పద్మ గిషో నిధి, నైజీరియాకు చెందిన అకిన్యోసోయే ఒలువాఫోలాయెమితో కలిసి కాంస్యం గెలిచి పతకాల సంఖ్యను పెంచింది.



# బంగ్లాదేశ్‌కు బిగ్ షాక్

### అఫ్ఘాన్‌తో భారత్ టి20 సిరీస్ ఖరారు

### సెప్టెంబరు 13న తొలి మ్యాచ్

**న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(బీసీబీ)కి భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) బిగ్ షాకిచ్చింది. సెప్టెంబర్‌లో తమతో సిరీస్ ఆడేందుకు బంగ్లాదేశ్ పర్యటనకు టీమిండియా వస్తుందని ఆశించిన బీసీబీకి నిరాశే ఎదురైంది. అఫ్గానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్‌ను ఖరారు చేసి బంగ్లా పర్యటనకు వెళ్లడం లేదని భారత్ క్రికెట్ బోర్డు పరోక్షంగా వెల్లడించింది. సెప్టెంబర్‌లో అఫ్గానిస్థాన్‌తో జరగనున్న మూడు టీ20ల సిరీస్ షెడ్యూల్‌ను బుధవారం బీసీసీఐ అధికారికంగా ప్రకటించింది. అఫ్గాన్ క్రికెట్ బోర్డు వెల్లడించినట్లుగానే ఢిల్లీ వేదికగా మూడు టీ20ల సిరీస్ జరగనుంది. భారత్‌లోనే అఫ్గాన్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. ఢిల్లీ మైదానాన్ని అఫ్గాన్ హోమ్ గ్రౌండ్‌గా ఎంచుకుంది. గత జూన్‌లో భారత్, అఫ్గానిస్థాన్ జట్ల మధ్య ఏకైక టెస్ట్, మూడు వన్డేల సిరీస్ జరిగిన సంగతి తెలిసిందే. భారత్, అఫ్గానిస్థాన్ మధ్య సెప్టెంబర్ 13న తొలి టీ20, 15 రెండో టీ20, 19న మూడో టీ20 జరగనుంది. ఈ సిరీస్ భారత్, ఆఫ్ఘనిస్తాన్‌ల మధ్య జరగనున్న రెండవ ద్వైపాక్షి క టీ20ఐ మాత్రమే. ఈ రెండు జట్లు చివరిసారిగా జనవరి 2024లో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో తలపడ్డాయి. అప్పుడు భారత్, మొహాలీ, ఇండోర్, బెంగళూరులలో ఆఫ్ఘనిస్తాన్‌కు ఆతిథ్యం ఇచ్చింది. ఆ సిరీస్‌ను భారత్ గెలుచుకుంది. ఇక కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో కష్టకాలం ఎదుర్కొంటున్న భారత టీ20 జట్టుకు, రాబోయే ఈ పోటీ ఒక కీలక దశలో వస్తోంది. ఇటీవలి పరంపరను ఐర్లాండ్‌తో 2–0 సిరీస్ ఓటమితో ప్రారంభించిన భారత్, ఆ తర్వాతి సిరీస్‌లో ఇంగ్లండ్ చేతిలో 4–0 తేడాతో ఓటమి చవిచూసింది. కాగా భారత క్రికెట్ బోర్డు ఎప్పుడూ అఫ్గానిస్థాన్‌కు అండగా ఉంటుందని బీసీసీఐ ప్రెసిడెంట్ మిథున్ మన్హాస్ తెలిపారు. అఫ్గాన్ క్రికెట్ అభివృద్ధి కోసం మద్దతు ఇస్తామని, అత్యున్నత స్థాయిలో పోటీ పడేలా వారికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని చెప్పాడు. ఈ క్రమంలోనే ఆ జట్టుతో ద్వైపాక్షిక సిరీస్‌ను ఏర్పాటు చేశామని, టాప్ టీమ్స్‌తో ఆడటం వల్ల వెలకట్టలేని అనుభవం వస్తుందని అభిప్రాయపడ్డాడు. భారత్ వేదికగా అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు ఆతిథ్యం ఇస్తున్న సిరీస్‌కు బీసీసీఐ అండగా ఉంటుందని సెక్రటరీ దేవజిత్ సైకియా అన్నారు. మైదానంలో ఇరు జట్ల మధ్య పోరు చాలా ఆసక్తికరమని, నాణ్యమైన క్రికెటర్లు ఉన్నారని పేర్కొన్నారు. భారత్‌లోనూ అఫ్గాన్ ఆటగాళ్లకు అభిమానులు ఉన్నారంటే వారి ఆటతీరే కారణమని, ఇటీవల ఒక టెస్ట్, వన్డే సిరీస్ జరిగిందని, మూడు ఫార్మాట్లలోనూ ఇరు జట్లు తలపడేందుకు ఉన్న అవకాశాలను ఏ మాత్రం వదులుకోమని స్పష్టం చేశారు.




Print and Published by Gireesh Sangh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at 11-37, Moramputi, Rajamahendravaram-533 103. Phone: 24 2460408. RNI No.64863/96, Editor: Damerla Sai Baba, Responsible for selection of News-under the PRB Act. Regd: No.H/SD/337/09-11 . Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం | గురువారం 13 ఆగస్టు 2026 | I


## అక్రమాలను ప్రశ్నిస్తే కేసులు పెడతారా...

**డీఎస్సీ అక్రమాలపై పోరాటం ఆపేది లేదు....**
**కేసులకు,అరెస్టులకు వైయస్ఆర్సీపీ భయపడదు..**
**మాజీ ఎంపీ,చింతా అనురాధ,**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,ఆగస్టు12,ప్రభాతవార్త.** డీఎస్సీ నియామకాల్లో జరిగిన అవకతవకలు, అక్రమాలను ప్రశ్నిస్తూ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అమలాపురంలో చేపట్టిన నిరసన ర్యాలీ సందర్భంగా వైయస్ఆర్సీపీ నాయకులపై పోలీసులు కేసులు నమోదు చేయడాన్ని అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యులు చింతా అనురాధ తీవ్రంగా ఖండించారు.అక్రమాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడతారా ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, ప్రజల తరపున నిరసన చేపట్టడం ప్రతిపక్షానికి ఉన్న హక్కని ఆమె అన్నారు. సెక్షన్ 30 అమలులో ఉందంటూ నిరసన కార్యక్రమాలను అడ్డుకోవడం, నాయకులపై కేసులు నమోదు చేయడం కూటమి ప్రభుత్వ అణచివేత ధోరణికి నిదర్శనమని ధ్వజమెత్తారు.అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కూటమి ప్రభుత్వం తమను ప్రశ్నించే వైయస్ఆర్సీపీ నాయకులపై కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం, ఇబ్బందులకు గురి చేయడం ఒక పనిగా పెట్టుకుందని అనురాధ మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం.. ప్రతిపక్షాన్ని వేధించడంపైనే ఎక్కువ దృష్టి పెడుతోందని విమర్శించారు. డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపే వరకు, ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ మంత్రి లోకేష్ రాజీనామా చేసే వరకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని అనురాధ స్పష్టం చేశారు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని అరెస్టులు చేసినా వైయస్ఆర్సీపీ వెనక్కి తగ్గదని తేల్చిచెప్పారు.



## వాడపల్లి 'వెంకన్న 'నిత్యాన్న పథకానికి రూ,100116/-


**స్వామివారి నిత్యకళ్యాణం, అష్టోత్ర పూజలలో పాల్గొన్న భక్తులు**
**మూడవరోజు శ్రీ గోదాదేవి ఆండాళ్ అమ్మవారి తిరునక్షత్ర ఉత్సవాలు...**





**ఆత్రేయపురం, ఆగస్టు 12,,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వెంకన్నగా శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో వేంచేసియున్న శ్రీ గోదాదేవి ఆండాళ్ అమ్మవారి తిరునక్షత్ర ఉత్సవాలు మూడో రోజు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి మేలుకొలుపు, శ్రీలక్ష్మి వెంకటేశ్వర ఐశ్వర్య హోమం, గోపూజ, అష్టోత్తర శతనామావళి, నిత్య కళ్యాణం, బాల భోగం, నివేదన, ప్రాకారోత్సవం, నీరాజనం, మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు అర్చకులు ఘనంగా నిర్వహించారు.ఏడువారాల నోము పూర్తి అయిన భక్తులు అష్టోత్తర పూజ నిత్యకళ్యాణం లలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.దీంతో ఆలయ పరిసరాలన్నీ మార్మోగాయి. అలాగే రాజమండ్రికి చెందిన మామిల్లపల్లి సీత వసంత శ్రీ రమ్య, వారి కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన పథకానికి రూ. 100116/- విరాళంగా అందించారు. స్వామివారి దర్శనం అనంతరం వారికి ఆలయ అర్చకులు , వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, సీనియర్ అసిస్టెంట్, కుమార్, జూనియర్ అసిస్టెంట్, వై శ్రీనివాస్ లు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు తగు ఏర్పాట్లు చేశారు.

## దక్షిణంలో సత్య మూర్తులు...
## ఉత్తరంలో రామ్ మూర్తులు..

**ఎదురే మాకులేరు...మమల్ని ఎవరు ఆపలేరు....అంటూ సవాలు విసురుతున్న అక్రమార్కులు..**
**చిక్కడు... దొరకడు... వీ (రే) జా**
**అక్రమ ఇసుక రవాణా ధ్యేయం..**
**అధికారుల కళ్ళు గప్పి మరి జోరుగా సాగుతున్న అక్రమ ఇసుక దందా**





**ఏటపాక: జూలై 12 ( ప్రభాత వార్త):** సహజ వనరులు దోచుకుంటూ అక్రమార్జన ధ్యేయంగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు.కాపాడవలసిన అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. గొమ్ముకొత్త గూడెం కేంద్రం గా పదుల సంఖ్యలో ట్రాక్టర్ లతో ఇసుక అక్రమ రవాణా చేస్తూ కాసులు దండుకుంటూ జేబులు నింపుకుంటున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ ఇసుకను నియంత్రించాలి అని మండల వాసులు కోరుతున్నారు.

## తొలక(వ)రి కష్టాలు...



**తాళ్లరేవు ఆగస్టు 12 (ప్రభాతవార్త):** సకాలంలో సాగునీరు అందక తొలకరిలోనే రైతాంగానికి కష్టాలు తప్పడం లేదు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు కురవక, పంట పొలాలు బీటలు వారుతున్నాయి. ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామన్న అధికారుల మాటలు నీటి మూటలు అయ్యాయి. తాళ్లరేవు మండలం తాళ్లరేవు కేశవస్వామి కాలనీ సమీపంలోని భూములకు సాగునీరందక వరి పొలాలు ఎండి పోతున్నాయి. వారం రోజుల నుంచి సాగునీరు ఇవ్వాలని అధికారులను వేడుకుంటున్న పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మోటార్ల ద్వారా సాగునీరు తోడి వరి పొలాలకు నీరందించాలంటే శివారు ఆయకట్టు రైతులు కోరుతున్నారు. తొలకరి పంట పరిస్థితి ఇలా ఉంటే, ఇక వ్యవసాయ సాగు కష్టమే అని, కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా నీటి సంఘాల నాయకులు, ఇరిగేషన్ అధికారులు దృష్టి సారించి తొలకరి గట్టెక్కించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## మొక్కలకు డ్రిప్ విధానం మేలు

**కమిషనర్ రాహుల్ మీనా**



**రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 12 (ప్రభాతవార్త)** నగర సుందరీకరణ పనుల్లో భాగంగా డివైడర్ మధ్యలో ఏర్పాటు చేసిన మొక్కలను పరిరక్షించాలని నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. నగరపాలక సంస్థ అధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఏకేసి కాలేజీ నుంచి ఏవి ఏ రోడ్డును కలుపుతూ రహదారి డివైడర్ లోని మొక్కలను పరిశీలించారు. బిందు సేద్యం ద్వారా మొక్కలకు నీరు అందేలా చూడాలని ఈ సందర్భంగా సంబంధిత అధికారులను ఆదేశించారు. డ్రిప్ పద్ధతిలో తక్కువ నీటితో మొక్కలకు సరిపడా తడి అందుతుందని నీరు ఆవిరి కాకుండా నేరుగా ప్రతి మొక్క వేరు భాగం వరకు చేరుతుందన్నారు. కాలుష్యాన్ని తగ్గించడం రాత్రివేళ ఎదురుగా వచ్చే వాహనాల కాంతిని నిరోధించడంలో ఈ మొక్కలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఈయన వెంట ఎస్ ఈ రీటా, ఏ డి హెచ్ అనిత, ఏ ఈ సత్యనారాయణ ఉన్నారు.

## ఆదిత్య యూనివర్సిటీలో గ్రంథపాలకుల దినోత్సవ వేడుకలు



**గండేపల్లి. ఆగస్టు 12. ప్రభాతవార్త** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ గ్రంథాలయం విభాగం ఆధ్వర్యంలో ఆగస్టు 12 వ తేదీన గ్రంథపాలకుల దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా. మేడపాటి శ్రీనివాస రెడ్డి తొలుత గ్రంథాలయ పితామహుడు, ఆధునిక గ్రంథాలయ రూపకర్త శ్రీ.ఎస్.ఆర్. రంగనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం రంగనాథ్ సేవలను కొనియాడారు. గ్రంథాలయాల యొక్క ఆవశ్యకత గురించి వివరించారు. డీన్.డా.డి.కిషోర్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థులకు మంచి నేస్తాలు వాటిని ఎంత ఉపయోగించుకుంటే అంత జ్ఞానం అందిస్తాయని కేవలం తరగతి పుస్తకాలని కాకుండా మన జాతీయ నాయకుల శాస్త్రవేత్తల జీవిత చరిత్రలు చదువుకోవాలని సూచించారు. ప్రధాన గ్రంథాలయాధికారి కె. అశోక్ కుమార్ మాట్లాడుతూ యూనివర్సిటీ లైబ్రరీ అర్ధరాత్రి 12 గంటల వరకు తెరిచి ఉంటుంది కావున హాస్టల్ విద్యార్థులు ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బుక్ ట్రైటిల్ మెమరీ కాంపిటీషన్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు . గ్రంథాలయాన్ని బాగా ఉపయోగించుకున్న విద్యార్థులను , అధ్యాపకులను "బెస్ట్ లైబ్రరీ యూజర్" అవార్డుతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల డీన్ లు, గ్రంథాలయ విభాగాధిపతి కె. అశోక్ కుమార్ మరియు గ్రంథాలయ సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే క్యాంపస్ నందు గల వివిధ గ్రంథాలయాలలో అధికారులు ఆయా విభాగాల అధిపతులు పాల్గొని ఎస్.ఆర్. రంగనాథ్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి కార్యక్రమాలు నిర్వహించారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రకళా పోటీలు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు12,ప్రభాతవార్త.** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ సమగ్రత, పర్యావరణ పరిరక్షణ అంశాలపై రోటరీ క్లబ్ అమలాపురం ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రకళా పోటీలు నిర్వహించారు.స్థానిక వాగ్దేవి పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీలలో 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న 300 మందికి పైగా బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. జాతీయ సమగ్రత, దేశభక్తి, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను తమ చిత్రాల ద్వారా విద్యార్థులు చక్కగా ప్రతిబింబించారు.ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అమలాపురం అధ్యక్షులు ఆర్డీఎస్ ప్రసాద్, కార్యదర్శి పవన్ ఆకొండి, ప్రముఖ జాతీయస్థాయి చిత్రకారులు అంజి ఆకొండి, శ్రీరామ్ వాడ్రేవుతో పాటు పలువురు రోటరీ సభ్యులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ సమైక్యత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడంతో పాటు, వారి సృజనాత్మక ప్రతిభను వెలికితీయడమే ఈ చిత్రకళా పోటీల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

## వ్యక్తిగత వివాదాల్లో ఎమ్మెల్యే నానాజీ పై
# ఆరోపణలు చేస్తే సహించేది లేదు

**--వాకలపూడి జనసైనికులు**

**- రూ.70 కోట్ల అభివృద్ధి కళ్ళముందే ఉన్నా కళ్ళు లేనట్లు మాట్లాడటం విడ్డూరం**



**కాకినాడ రూరల్, ఆగస్టు 12,(ప్రభాతవార్త)** కాకినాడ రూరల్ మండలం వాకలపూడి గ్రామంలో వ్యక్తిగత భూ వివాదాల్లో స్థానిక ఎమ్మెల్యే నానాజీ, బంధువులపై ఆరోపణలు చేస్తే సహించేది లేదని వాకలపూడి జనసేన పార్టీకి చెందిన జనసైనికులు తీవ్రంగా హెచ్చరించారు. బుధవారం వాకలపూడి లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో జనసేన గ్రామ కమిటీ అధ్యక్షుడు గంట ప్రసాద్ మాట్లాడుతూ తమ స్వార్థ ప్రయోజనాలు, వ్యక్తిగత వివాదాల కోసం ప్రజాప్రతినిధులపై బురదజల్లే ప్రయత్నం చేయడం అత్యంత హేయమైన చర్య అని ఇటీవల చోటుచేసుకున్న ఒక స్థానిక భూవివాదాన్ని పట్టుకుని, దానిని ఏకంగా నియోజకవర్గ ఎమ్మెల్యే పంతం నానాజీకి, ఆయన మేనల్లుడు బన్నుకు ముడిపెడుతూ గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త చింతకాయల శ్రీను చేసిన వ్యాఖ్యల పై ఆధారాలు ఉంటే రుజువు చేయాలని సవాల్ విసిరారు. తమ స్వార్థ ప్రయోజనాలు, వ్యక్తిగత వివాదాల కోసం ప్రజాప్రతినిధులపై బురదజల్లే ప్రయత్నం చేయడం అత్యంత హేయమైన చర్య అని స్థానిక నాయకులు, శ్రేణులు తీవ్రంగా ఖండించారు. సమావేశం నిర్వహించారు. అనంతరం గేదెల చిన్నారావు, హేమ పద్మజ తదితరులు మాట్లాడుతూ వ్యక్తిగత భూవివాదంలోకి ప్రజాప్రతినిధిని లాగడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.వాకలపూడి గ్రామంలో ఇప్పటివరకు సుమారు రూ.70 కోట్ల పైచిలుకు నిధులతో అనేక సంక్షేమ, మౌలిక వసతుల కల్పనా కార్యక్రమాలు, అభివృద్ధి పనులు జరిగాయని గుర్తుచేశారు. వివాదాస్పద భూములు కొనుగోలు చేసే ముందు వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలే తప్ప, దానికి రాజకీయ రంగు పూసి ఎమ్మెల్యే తప్పు అని ప్రచారం చేయడం వెనుక దురుద్దేశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని స్పష్టం చేశారు."గ్రామానికి ఎమ్మెల్యే ఏమీ చేయలేదు" అంటూ చేస్తున్న ఆరోపణలను గణాంకాలతో సహా నాయకులు తిప్పికొట్టారు, సొంత లాభాల కోసం నాయకులపై బురదజల్లుతూ రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. నిజానిజాలు తెలుసుకోకుండా, సొంత విచక్షణ కోల్పోయి చేసే ఆరోపణలను గ్రా ప్రజలు ఎప్పటికీ విశ్వసించరని పేర్కొన్నారు.ఈ విలేకరుల సమావేశంలో మత్స్యకార నాయకులు గంటా ప్రసాద్, పాలేపు శివ కిషోర్, మండల నాయకులు గేదెలు చిన్నారావు, జనసేన లీగల్ సెల్ నాయకురాలు హేమ పద్మజా, గ్రామ నాయకులు మానేపల్లి నాగేశ్వరావు, మంజు, కుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పాడ తీర ప్రాంత రక్షణకు
# మద్రాస్ ఐఐటీ తో ఎం. ఒ. యు

**ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో ఒప్పందం**
**రక్షణ గోడ డిజైన్, డి పి ఆర్, పర్యవేక్షణ బాధ్యతలు చూడనున్న ఐఐటి మద్రాస్**
**రూ. 323 కోట్లతో తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణం**



**పిఠాపురం, ఆగస్టు 12 ( ప్రభాతవార్త )** సముద్ర కోతతో తీవ్రంగా దెబ్బతింటున్న ఉప్పాడ తీర ప్రాంత పరిరక్షణకు కీలక ముందడుగు పడింది.కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని ఈ తీర ప్రాంత రక్షణ గోడనిర్మాణానికి అవసరమైన డిజైన్, సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు ( డి పి ఆర్ ) సాంకేతిక పర్యవేక్షణ బాధ్యతలను ఐఐటి మద్రాస్ కు అప్పగిస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో బుధవారం మంగళగిరి క్యాంపు కార్యాలయంలో అవగాహన ఒప్పందం కుదిరింది. రూ. 323 కోట్లతో ఈ తీర ప్రాంత రక్షణ కూడా నిర్మాణం కానుంది. కేంద్ర ప్రభుత్వ విపత్తు నిర్వహణ నిధి ( ఎస్. డి. ఎం. ఏ) నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో అమలు చేసే ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా ఏపీ మారిటైంబోర్డు బాధ్యతలు నిర్వహించనుంది. ఐఐటి మద్రాస్ నిపుణుల సాంకేతిక సూచనలు, శాస్త్రీయ అధ్యయనాల ఆధారంగా ఉప్పాడ తీర ప్రాంతానికి అనువైన రక్షణ చర్యలను రూపొందించనున్నారు. కోత తీవ్రత, సముద్ర ప్రవాహాలు, అలల ప్రభావం తదితరాంశాలను సమగ్రంగా అధ్యయనం చేసి వాటికి అనుగుణంగా తీరా రక్షణ నిర్మాణాల డిజైన్ను సిద్ధం చేయనున్నారు.

**నవంబర్ నుంచి పనులు ప్రారంభం:** ఐఐటీ మద్రాస్ తో అధికారి క ఒప్పందానికి సంబంధించిన ప్రక్రియ పూర్తికావడంతో రానున్న నవంబర్ నుంచి ప్రాజెక్టు పనులను ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తుంది. ఉప్పాడ తీర ప్రాంత ప్రజలు, మత్స్య తార గ్రామాల రక్షణకు ఈ ప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యత కలిగినదిగా అధికారులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ కలెక్టర్ ఎం. ఎన్. హరేశీ ధిర ప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మెంబర్ సెక్రటరీ శరవణన్, పాడ ప్రాజెక్టు డైరెక్టర్ శివరామ ప్రసాద్, ఐఐటి మద్రాస్ ఓషన్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ సన్నాసి రాజ్, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కతీబ్ కౌసర్, ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు చీఫ్ ఇంజనీర్ జి. వి. రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్స వారోత్సవాల్లోఎంఎల్ఏ ఆనందరావు బైక్ ర్యాలీ.



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,ఆగస్టు12,ప్రభాతవార్త.** దేశ స్వాతంత్ర్య దినోత్సవ వారోత్సవాలు, స్త్రీ శక్తి' పథకం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా అమలాపురం నియోజకవర్గంలో వేడుకలు ఘనంగా ప్రారంభ మయ్యాయి. ఇందులో భాగంగా అమలాపురం రూరల్ మండలం పేరూరులో డిసిఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు హాజరైన భారీ బైక్ ర్యాలీ (తిరంగా యాత్ర) నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని, దేశభక్తిని ప్రతి ఒక్కరిలో పెంపొందించడమే లక్ష్యంగా ఈ తిరంగా యాత్ర చేపట్టామని తెలిపారు.ఆగస్టు 12 నుండి 15 వరకు నియోజకవర్గంలోని ప్రతి ఇంటిపైనా,వ్యాపార సంస్థలపైనా జాతీయ జెండాను రెపరెపలాడించాలని, ప్రతి ఒక్కరూ 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో పాల్గొన్న నాయకులకు, కార్యకర్తలకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అదికారి జయ వెంకట లక్ష్మీ, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు వనమాడి సుస్మిత,స్థానిక ప్రజాప్రతినిధులు, క్లస్టర్, యూనిట్, బూత్ మరియు మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజవొమ్మంగిలో ఘనంగా కంబాల కానుకలో మూడు వేల చీరలు పంపిణీ

**లక్కీడ్రాలో గెలిపొందిన 80 మహిళలకు బంగారు రూపులు, పంపిణీ**




**రాజవొమ్మంగి, ఆగస్టు 12, ప్రభాతవార్త** రాజవొమ్మంగిలో బుధవారం జరిగిన కంబాల కానుక.. వనితల వేడుక కార్యక్రమానికి మండలంలో అన్ని ప్రాంతాలు నుండి 3 వేలమంది మహిళలు తరలి వచ్చారు. కార్యక్రమంలో ముందుగా కంబాల శ్రీనివాసరావు ను గిరిజన సాంప్రదాయం కోలాటతో పూలు జల్లుతూ శ్రీశ్రీ హరి శివకామాక్షి ఫంక్షన్ హల్ లో వద్దకు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు, దంపతులను తీసుకొని వచ్చారు. అనంతరం కంబాల శ్రీనివాసరావు, శ్రీమతి పద్మావతి దేవి గంగారత్నం దంపతులకు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి, వేదమంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనాలు అందించారు. అనంతరం వరలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి, జాతీయ గీతాలాపనతో కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. రాజవొమ్మంగి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సూరిబాబు, టి. వీర్రాజు కమిటీ సభ్యులు శ్రీనివాసరావుకు పూలమాలలు వేసి శాలువాని కప్పి సత్కారం చేసారు.మండల బిజెపి అధ్యక్షులు లొసుల రాజబాబు, మండల టిడిపి అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు, అరకు పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు దంతులూరి శివరామచంద్రరాజు కూడా శ్రీనివాసరావు ను సన్మానం చేశారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 65 వేలు పట్టుచీరలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. బంగారు వరలక్ష్మి కానుక సీజన్-4 లక్కీ డ్రా కార్యక్రమంలో భాగంగా రాజానగరం, రంపచోడవరం, జగ్గంపేట మూడు నియోజక వర్గంలో 4 వేలు బంగారు రూపులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మన దేశం విశ్వగురువని, మన సంస్కృతి సాంప్రదాయాలను, ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. మూడు నియోజకవర్గంలో విద్య, వైద్య ఆర్థికపరంగా సొంత నిధులతో 18 రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 13న అడ్డతీగల, 14న వై రామవరం, 16న రంపచోడవరం, 17, 18, 19 తేదీల్లో రాజానగరం నియోజకవర్గాల్లో కార్యక్రమాలను చేస్తామన్నారు. రాజవొమ్మంగి లక్కీడ్రాలో గెలిపోందిన 80 మంది మహిళలకు బంగారు రూపులు, పట్టుచీరలు, పసుపు, కుంకుమను కంబాల శ్రీనివాసరావు దంపతులు ఉచితంగా పంపిణీ చేసారు. అలాగే 3,000 మంది మహిళలకు పట్టు చీరలు, పసుపు, కుంకుమ పంపిణీ చేసారు. మూడు వేల మందికి భోజనాలు, టీని కూడా ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు లొసుల రాజబాబు, తాము సూరిబాబు, మండల టిడిపి అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు, అరకు పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు దంతులూరి శివరామచంద్రరాజు, తాము సూరిబాబు, దాన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ డి. వి. డి. ప్రసాద్, నాని (కాకరపాడు ), ఈరే కొండబాబు, కడబాల సుధ, బచ్చలి మల్లేష్, నాగుల చిన్నబ్బాయి, బారీగా భక్తులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయం

**- పోలవరం ప్రాజెక్ట్ ప్రతి నిర్వసితుడికి ప్రభుత్వం న్యాయం చేస్తుంది**
**- వి ఆర్ పురం మండలంలో ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి**





**కూనవరం( వి ఆర్ పురం ), ఆగస్టు 12, ప్రభాతవార్త:** ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలన కొనసాగుతుందని రంపచోడవరం శాసనసభ్యురాలు, రాష్ట్ర ఎస్ టి సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషా దేవి అన్నారు. బుధవారం వి ఆర్ పురం మండలంలో రెండేళ్ల నమ్మకం, సంక్షేమం, అభివృద్ధిపై ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పర్యటనలో మండలంలో అన్ని గ్రామాలలో ప్రజలు ఆమెకు పార్టీ శ్రేణులు, గ్రామస్తులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటనలో ఆమె ములకలపల్లి, కందులూరు, చిన్న మట్టపల్లి, రేఖపల్లి, రాజుపేట, వడ్డిగూడెం, పంచాయతీలలోని పలు గ్రామాలను ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. శ్రీరామగిరి గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మరణించిన నాళ్లరపు నవీన్ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆమె మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు వలన నిర్వాసితులవుతున్న ప్రతి ఒక్క అర్హులైన నిర్వాసితుడికి కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందని అన్నారు. ఎవరు అధైర్య పడవద్దని అన్నారు. దేశం గర్వించేలా అమరావతిని ఎకనామిక్ రీజియన్ గా మార్చిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దేనని కొనియాడారు. అలాగే ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. అలాగే ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను ప్రభుత్వం అమలు చేస్తుందని ఆమె వివరించారు. ఇచ్చిన మాట ప్రకారం ఎన్టిఆర్ సామాజిక భరోసా పింఛన్లు, పెంచి ప్రభుత్వం అమలు చేస్తుందని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్, వాళ్ళ రంగారెడ్డి, జనసేన నాయకులు ములకాల సాయి కృష్ణ, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## ఆస్తి వివాదంలో కోర్టు తీర్పుకు కట్టుబడి ఉంటాం



**రాజమహేంద్రవరం అర్బన్: అక్టోబర్ 12, (ప్రభాతవార్త)** తనపై, తన భర్త, బంధువులపై ఏడిద ప్రియదర్శిని, ఆమె కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలు అవాస్తవమని సీతానగరం మండలం రఘుదేవపురం మాజీ సర్పంచ్ ఇందుగమెల్లి చంద్రలీల ఖండించారు. బుధవారం రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో భర్త రామకృష్ణతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తమ తండ్రి ఏడిద అబ్బులు విశాఖపట్నం విమానాశ్రయంలో ఉద్యోగం చేసి 2018లో పదవీ విరమణ చేశారని తెలిపారు. తల్లిదండ్రులు, అన్నయ్య దొరబాబు మృతి అనంతరం కుటుంబ ఆస్తుల విషయంలో వివాదం ఏర్పడిందన్నారు. తండ్రికి చెందిన ఇల్లు, కొంత భూమిని తాను, తన చెల్లెలు స్వాతి 2021లో కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నామని చెప్పారు. ఈ ఆస్తిపై ఏడిద ప్రియదర్శిని రాజమహేంద్రవరం మొదటి సివిల్ జడ్జి కోర్టులో ఓఎస్ నం.114/2024 దాఖలు చేయగా, ప్రస్తుతం విచారణలో ఉందన్నారు. కోర్టులో కేసు నడుస్తున్నందున తీర్పుకు తాము పూర్తిగా కట్టుబడి ఉంటామని చంద్రలీల స్పష్టం చేశారు. అయితే ప్రియదర్శిని, ఆమె అనుచరులు తమ ఇంట్లోకి వచ్చి దౌర్జన్యంగా ఉంటూ సామాన్లు బయటకు విసిరివేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సీతానగరం పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమపై తప్పుడు కేసులు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తనకు, తన పిల్లలకు, కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని, పోలీసులు రక్షణ కల్పించాలని కోరారు. సమావేశంలో గంగారత్నం, వెంకటలక్ష్మి, రవికుమార్, బంగారమ్మ, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

## పులస చిక్కిందోచ్ గోదావరిలో 1.1 కేజీల పులస.. యానాం రేవులో రూ.14 వేలకు విక్రయం



**యానాం, ఆగస్టు 12: (ప్రభాతవార్త)** గోదావరిలో పులస చేపల సందడి మొదలైంది. ఎట్టకేలకు మత్స్యకారుల వలకు పులస చేప చిక్కింది. బుధవారం గోదావరిలో గుత్తింగి జీవి సమీపంలో మత్స్యకారుల వలలో సుమారు 1.1 కేజీల పులస పడింది. చేపను యానాం రేవుకు తీసుకువచ్చి వేలం నిర్వహించగా.. రూ.40 వేల నుంచి వేలం పాట ప్రారంభమైంది. చివరకు రూ.14 వేల వద్ద కొనుగోలు చేసినట్లు సమాచారం. యానాంలో ఈ ఏడాదికి ఇది రెండో పులస కావడం విశేషం.ప్రతి ఏటా జూలై, ఆగస్టు నెలల్లో గోదావరిలో ఎర్రనీరు వచ్చే సమయంలో పులసలు సముద్రం నుంచి నదిలోకి ఎదురీదుతూ వస్తాయి. అయితే ఈసారి ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు, వరదలు ఆలస్యం కావడంతో పులసల రాక కూడా ఆలస్యమైంది. పులసకు గోదావరి జిల్లాల్లో ఉన్న ప్రత్యేకమైన డిమాండ్‌తో.. సీజన్‌లో ఒక్క చేప దొరికినా మత్స్యకారులకు వేలల్లో ఆదాయం వస్తుంది."పుస్తెలమ్మైనా పులస తినాల్సిందే" అనే నానుడికి తగ్గట్టుగానే.. గోదావరి పులసకు ఈ ఏడాది కూడా భారీ డిమాండ్ కనిపిస్తోంది.


**CHANGE OF NAME**

I RAPAKA SEKHAR (NEW NAME), S/o RAPAKA BAPUJI previously called RAPAKA SHEKAR (Old Name), Resident of Door No.4-170, Gudimellanka, Malikipuram Mandalam, Dr. B.R. Ambedkar Konaseema Dist., Now Changed My Name from RAPAKA SHEKAR (Old Name) To RAPAKA SEKHAR (New Name). Hence forth I will be called as RAPAKA SEKHAR (New Name) for all purpose

**CHANGE OF NAME**

I CHOPPALA SANTHI (NEW NAME), W/o CHOPPALA KUMARA RATNAM previously called CHOPPALA SHANTI (Old Name), Resident of Door No.3-103, Antarvedipalem, Near Paramjyothi Church, Sakhinetipalli Mandalam, Dr.B.R.Ambedkar Konaseema Dist., Now Changed My Name from CHOPPALA SHANTI (Old Name) To CHOPPALA SANTHI (New Name). Hence forth I will be called as CHOPPALA SANTHI (New Name) for all purpose

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము - దేవదాయధర్మదాయశాఖ

**"ఇ" ప్రొక్యూర్ మెంట్ టెండరు ప్రకటన**

డా. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, అల్లవరం మండలం, గుండేపూడి గ్రామంలో యున్న శ్రీ జనార్ధన స్వామి దేవాలయం వారు దేవాలయ పునర్నిర్మాణం కొరకు టెండర్ పిలువబడుచున్నది.

| | | | |
|---|---|---|---|
| 1. | దేవాలయ పునర్నిర్మాణం కొరకు | టెండర్ నోటీస్ నెం. P/COE/1064/2026 | రూ.65.00 లక్షలు |

బిడ్ డాక్యుమెంట్ తేది. 13.08.2026 ఉదయం గం.10:00 నుండి డౌన్ లోడ్ చేసుకోనవచ్చును. టెండరు దాఖలు చేయుటకు ఆఖరి తేది. 27.08.2026 సాయంత్రం గం. 04:30ని॥ల వరకు, మిగిలిన వివరముల కొరకు https://tender.apeprocurement.gov.in లో చూడవచ్చును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు, ఫోన్ నెం: 7997875916

## గ్రామ దేవత రావులమ్మ అమ్మవారికి ఆషాడం సారె..



**అంబాజీపేట, ఆగస్టు 12, (ప్రభాతవార్త):** మండలంలోని గంగలకుర్రు గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ రావులమ్మ అమ్మవారికి గ్రామస్తులు ఆషాడం సారెను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్ది ,అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకాంబరి దేవిగా అలంకరించారు. గ్రామంలో వివిధ సామాజిక వర్గాలకు చెందిన ఆడపడుచులు, మహిళలు, యువతులు, బాలికలు,భక్తులు వారి వారి ముఖ్య కూడళ్ళ నుండి భాజా-భజంత్రీలు, మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సారెను సమర్పించి,మొక్కులు తీర్చుకున్నారు. వివిధ రకాల పిండి వంటలు,మిఠాయిలతో పాటు పసుపు-కుంకుమ గాజులు-చీరలు,చలిమిడి- పానకాలు చెల్లించారు. అమ్మవారి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదములు పంపిణీ చేశారు.

## చిన్నారుల సమగ్రాభివృద్ధి కోసం 'జ్ఞానజ్యోతి'..

**జ్ఞానజ్యోతి రిసోర్స్ పర్సన్ వెంకట్రావు..**



**అంబాజీపేట, ఆగస్టు 12,(ప్రభాతవార్త):** విద్యా బోధనలపై చిన్నారులకు ఆసక్తి పెంచేందుకు జ్ఞానజ్యోతి కార్యక్రమం దోహదం చేస్తుందని జ్ఞాన జ్యోతి రిసోర్స్ పర్సన్ జిల్లా వెంకట్రావు పేర్కొన్నారు. పుల్లేటికుర్రు జడ్పీ హైస్కూల్లో అంగన్వాడి సూపర్వైజర్ ఎస్.వి.ఎస్ మహాలక్ష్మి అధ్యక్షతన అంగన్వాడి కార్య కర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు బుధవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమం రెండు విడతల్లో ఆరు రోజులపాటు జరుగుతుందని తెలియజేశారు. 3-5 ఏళ్ల వయస్సు గల పిల్లలకు అంగన్వాడీ కేంద్రంలో అందించే పూర్వ ప్రాథమిక విద్యపై మరింత సామర్థ్యం పెంచుకునేలా, చిన్నారుల సమగ్ర అభివృద్ధి కలిగేలా విద్యను ఎలా అందించాలనే అంశంపై కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఐదేళ్ల చిన్నారులు అంగన్వాడీ కేంద్రంలో విద్యను పూర్తి చేసి ప్రాథమిక స్కూల్లో 1వ తరగతికి వెళ్లేందుకు పూర్తిగా సంసిద్ధం తయారు చేయడమే జ్ఞానజ్యోతి శిక్షణ ముఖ్య ఉద్దేశమన్నారు. ఎన్ఈపీ-2020 ఉద్దేశం ప్రకారం ఐదు సంవత్సరాల్లోపు చిన్నారులందరికీ సమగ్ర అభివృద్ధి జరిగేలా ప్రతి అంగన్వాడీ కార్యకర్త శిక్షణ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీలు, అంగన్వాడి సూపర్వైజర్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ కు గురై మృతి చెందిన ముత్తయ్య కి ఘన నివాళులు



**మోతుగూడెం ఆగస్టు:12 (ప్రభాతవార్త)** పోలవరం జిల్లా చింతూరు మండలం మోతుగూడెం లో మంగళవారం రోజు విధి నిర్వహణలో ఉండగా విద్యుత్ షాక్ కు గురై మరణించిన కాంట్రాక్ట్ కార్మికుడు మడవి ముత్తయ్య మృతదేహాన్ని పోస్ట్ మార్టం అనంతరం తన సొంత ఊరైనా చింతూరు మండలం గూడూరు గ్రామానికి చేర్చడం జరిగింది .సిఐటియు సిపిఎం నాయకులు పల్లపు వెంకట్ సీసం సురేష్ చింతా రాంబాబు సిఐటియు సభ్యులు మరియు ఏపి జెన్ కొ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు గ్రామస్తులు ఘన నివాళులు అర్పించారు.

## 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు చిన్నారులు 80 జెండాల పంపిణీ కి శ్రీకారం:

**హర్ ఘర్ తిరంగా ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరేద్దాం :**



**ఆత్రేయపురం , ఆగస్టు,12(ప్రభాతవార్త).** 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి బాల ఇంద్రజాలకుడు రుషిత్ తన చెల్లి జాన్విశ్రీతో కలిసి దాచుకున్న పోకెట్ మని తో 80 జాతీయ జెండాలను పంపిణీకి స్థానిక మ్యాజిక్ హౌస్ లో శ్రీకారం చుట్టారు. గత నాలుగు సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా రుషిత్ జండాలను పంచుతున్నాడు. మారు రోజులపాటు ఈ జెండాలను వివిధ ప్రాంతాల్లో పంపిణీ చేయనున్నారు ముందుగా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు వృద్ధులకు వందేమాతరం నినాదంతో పంపిణీ చేసాడు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు శ్రీకాంత్ తేజశ్రీ అమ్మమ్మ అన్నపూర్ణ పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం..



**ఎటపాక: ఆగస్టు 12 (ప్రభాత వార్త):** ఐ.జి.పి. రవి కృష్ణ ఐపిఎస్ ఐ.జి.పి. ఈగల్ కే.యం.. మహేశ్వర రాజు ఐపీఎస్ జి.స్వరూపరాణి ఎస్పీ వారి ఆదేశాల మేరకు ఏట పాక మండల పరిధిలోని కన్నాపురం బాలికల కళాశాల పాల్ టెక్నిక్ కళాశాల లో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నివారణ పై పట్టణాల లో ఈగల్ అవగాహన కార్యక్రమం లో భాగంగా బుధవారం ఈగల్ ఆధ్వర్యం లో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది అని పత్రిక ప్రకటన లో తెలిపారు. విద్యార్థులకు ఎన్. డి.పి.ఎస్ చట్టం, మాదక ద్రవ్యాల దుష్పరిణామాలు ఈగల్ టోల్ ఫ్రీ నంబర్--1972 గురించి అవగాహన కల్పించారు. అలాగే ఆపరేషన్ చైతన్యం, ఆపరేషన్ గరుడ, ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమాలను వివరించి డ్రగ్స్ కు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్,అధ్యాపకులు,స్థానిక పోలీస్ సిబ్బంది,ఈగల్ సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి మండల కమిటీ సమావేశం..



**ఎటపాక : ఆగస్టు 12 (ప్రభాత వార్త):** మండల పరిధిలోని గుండాల గ్రామంలో టిడిపి జాతీయ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జాతీయ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రంపచోడవరం నియోజకవర్గ శాసనసభ్యురాలు మిరియాల శిరీష దేవి సూచనల మేరకు మండల అధ్యక్షులు బొల్లి పుల్లయ్య క్లస్టర్ ఇంచార్జ్ వల్లభనేని. చందు ఆధ్వర్యంలో మండల కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు బూత్ ఇన్చార్జిలు యూనిట్ ఇన్చార్జులు పాల్గొని వాళ్ళ వాళ్ళ పరిధిలో ఉన్న సమస్యలను మండల అధ్యక్షులు బొల్లి పుల్లయ్య దృష్టికి తీసుకువచ్చారు.వాటిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జి లు బాదినేని మల్లేశ్వర రావు ,పాలడుగు నవీన్. రావి.మాధవ రావు , నజిలా శ్రీకాంత్ పాటి .సంపత్ బాదినేని .శ్రీకాంత్ ,చేకూరి రమేష్, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు బేకమల రూప , గోదేటి రవికుమార్ స్టేట్ డైరెక్టర్ రసాల. నరసింహ రావు, ముత్యం సుధీర్ గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షులు గార్లపాటి శ్రీనివాస్, పేరాల వెంకన్న, ఉండేటి రమేష్, బూత్ ఇన్చార్జి లు లక్ష్మల వెంకటేశ్వర్లు పుట్టి వెంకట వాసుదేవరావులు, పుట్టి వెంకట అప్పారావు, ముత్యం నరేష్ గౌడ్, బానోత్ అశోక్, గుమ్మడి నరసింహారావు, రాయిపాటి అప్పారావు , తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరావులమ్మ, శ్రీ గొల్లాలమ్మ అమ్మవార్లకు ఘనంగా సారే



**కె గంగవరం, ఆగస్ట్ 12, (ప్రభాతవార్త):** కే గంగవరం మండలం బట్లపాలిక గ్రామ దేవత అయినటువంటి శ్రీ రావులమ్మ తల్లి అమ్మవారి సారే కార్యక్రమం అంగరంగ వైభవంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు సొసైటీ అధ్యక్షుడు గెడ్డం పల్లపరావు (బన్ని) తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు భక్తులు పాల్గొని అమ్మవారికి పసుపు కుంకుమ చీర పానకం చలివిడి వడపప్పు రకరకాల పిండి వంటలతో నైవేద్యం సమర్పించారు. అలాగే అముజూరు గ్రామ దేవత అయినటువంటి శ్రీ గొల్లాలమ్మ అమ్మవారు శాఖాంబిక దేవిగా దర్శనం ఇవ్వగా అముజూరు గ్రామ మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి సారే కార్యక్రమం నిర్వహించినట్లు బిజెపి మండల అధ్యక్షుడు చంద్రరావు తెలిపారు. అమ్మవారిని రకరకాల పళ్ళు కూరగాయలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దినారు. ప్రత్యేక పూజలు అనంతరం ఆయా గ్రామాల అమ్మవార్లను భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## రాజమహేంద్రవరంలో నేరాలు ఘోరాల తో ప్రజలు బంబేలు

**శాంతి భద్రతలను కాపాడడంలో విఫలం**

**మాజీ ఎంపీ మార్గాన్ని భరత్ రామ్**



**రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 12 (ప్రభాతవార్త)** రాజమహేంద్రవరంలో వరుసగా జరుగుతున్న నేరాలు ఘోరాల తో నగర ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని మాజీ ఎంపీ వైసీపీ జాతీయ అధికార ప్రతినిధి సిటీ నియోజకవర్గ ఇన్చార్జ్ మార్గాన్ని భరత్ రామ్ ఆందోళన వ్యక్తం చేశారు. గత 15 రోజుల వ్యవధిలో మూడు మర్డర్లు జరిగాయని ఒక మెడికో విద్యార్థినిని కారుతో గుద్ది దారుణంగా చంపేశారని బ్లేడ్ బ్యాచ్ రెండు చోట్ల వీరంగం సృష్టించి ఇష్టమొచ్చినట్లుగా బ్లేడుతో చెక్ చేస్తున్న చర్యలు తీసుకోవడానికి పోలీసులు ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన బుధవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. రాజమహేంద్రవరంలో శాంతిభద్రతల పరిస్థితి మరింత దారుణంగా తయారు కావడానికి ప్రజాప్రతినిధుల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణమైతే విచ్చలవిడిగా రెచ్చిపోవడానికి పోలీస్ వ్యవస్థ మరొక కారణంగా కనిపిస్తుందని విమర్శించారు. ఇన్నిస్పేట పోలమాంబ అమ్మవారి జాతరలో ఎర్ర గణేష్ ,గో రక్షణ పేటలో చెవ్వేటి బుజ్జిని దారుణముగా హత్య చేశారని క్వారీ మార్కెట్ సెంటర్ లో మూర్తి నూకరాజు అనే యువకుడు పై విచక్షణ రహితంగా బ్లేడుతో దాడి చేసి తీవ్రమైన గాయాలు చేశారని తాజాగా కోటిలింగాల పేటకు చెందిన యువతిని అభిలాష్ అనే వ్యక్తి కాతేరు గ్రామం వంతెన వద్దకు తీసుకువెళ్లి సర్జికల్ బ్లేడుతో గొంతు కోసి కిరాతంగా హత్య చేశాడని ఆమె కుటుంబ సభ్యులు 3 టౌన్ పోలీస్ స్టేషన్ లో కూడా ఫిర్యాదు చేశారన్నారు. మద్యం విచ్చలవిడి అమ్మకాలు గంజాయి విచ్చలవిడిగా దొరకడం వల్లనే ఇటువంటి పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి అన్నారు. ప్రస్తుతం నగరంలో జరుగుతున్న సంఘటనలు ప్రజల ప్రశాంతతకు భంగం కలిగిస్తున్నాయని పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరించకపోతే భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు తప్పవని భరత్ రామ్ హెచ్చరించారు.

## జగ్గన్నపేటలో శ్రీ చౌడేశ్వరిదేవి జన్మదిన వేడుకలు



**మామిడికుదురు.ఆగస్టు 12(ప్రభాతవార్త)** మొగలికుదురు గ్రామంలోని జగ్గన్నపేట శ్రీఉమా రామలింగ చౌడేశ్వరి దేవస్థానంలో శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి అమ్మవారి జన్మదిన వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి.వేడుకల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు,పంచామృతాభిషేకాలు, సహస్ర కుంకుమార్చన పూజలు ఘనంగా నిర్వహించారు.జగ్గన్నపేట దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

## ఇమామ్ హసన్ మొహమ్మద్ ప్రవక్తలకు ఘన నివాళి



**మామిడికుదురు.ఆగస్టు 12(ప్రభాతవార్త)** ముస్లిం మతస్తుల ఆరాధ్యదైవం హజ్రత్ ఇమామ్ హసన్ మరియు మొహమ్మద్ ప్రవక్తల షహాదత్ ను బుధవారం ముస్లింలు నిండు శోకంతో జరుపుకున్నారు.దీనిలో భాగంగా నగరం బడేబీబీ పంజాలో మంగళవారం రాత్రి మరియు బుధవారం మధ్యాహ్నం మజ్లిస్ లు జరిగాయి.ఈ మజ్లిస్ లలో మౌలానా సయ్యద్ మొహమ్మద్ అలీ జాఫరీ సౌదీ అరేబియాలోని మదీనా పట్టణంలో ఇమామ్ హసన్, మొహమ్మద్ ప్రవక్తలు వీరమరణం పొందిన సంఘటనలను భక్తులకు వివరించారు.మజ్లిస్ అనంతరం గుమ్మటాలను తీసి మాతం చేస్తూ గ్రామంలో ఊరేగించారు.ఈ సందర్భంగా సర్కిల్ ఫర్హత్ అలీబేగ్,మీర్జా అమీర్ హుస్సేన్ లు మర్సియాలను ఆలపించారు.బడేబీబీ పంజా నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులకు భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు.చుట్టుప్రక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

## క్రీడలు యువతలో పోరాట స్ఫూర్తిని పెంపొందిస్తాయి

**బాధ్యతా సేవా సంస్థ అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు**



**కడియం, ఆగస్టు 12 ( ప్రభాతవార్త)** క్రీడలు యువతలో పోరాట స్ఫూర్తిని పెంపొందించి, వారిని జీవిత సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే పోరాట యోధులుగా తీర్చిదిద్దుతాయని బాధ్యతా సేవా సంస్థ అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు అన్నారు. కడియం అరుంధతిపేటలోని బాబు జగ్జీవన్‌రావు యువతకు మంగళవారం సాయంత్రం తన కార్యాలయంలో వాలీబాల్ నెట్స్, బంతులు, ఇతర క్రీడా సామగ్రిని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా గిరజాల బాబు మాట్లాడుతూ.. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవడం ద్వారా చెడు వ్యసనాలకు దూరంగా ఉండటంతో పాటు ఆరోగ్యంగా, ఉత్సాహంగా, చురుగ్గా ఉండేందుకు దోహదపడుతుందని తెలిపారు. క్రీడలు కేవలం శారీరక దారుఢ్యాన్నే కాకుండా మానసిక స్థైర్యాన్ని కూడా పెంపొందిస్తాయని అన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించే మనస్తత్వాన్ని క్రీడలు అలవర్చుతాయని, ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని విజయాన్ని సాధించే పట్టుదలను పెంచుతాయని పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనే స్ఫూర్తిని క్రీడలు అందిస్తాయని తెలిపారు. యువత క్రీడల్లో రాణించి గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పున్నమి రాజు వీర్రాజు, బత్తిన శ్రీధర్, కుడేళ్ల పవన్, పలివెల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య లో యువతా మీరే ఈ దేశ భవిత అనే అంశం పై వ్యక్తిత్వ వికాస కార్యక్రమం



**గండేపల్లి. ఆగస్టు 12. ప్రభాతవార్త** గండేపల్లి మండలం సూరంపాలెం: ఆదిత్య యూనివర్సిటీ లో స్వామి వివేకానంద స్ఫూర్తి తో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు సైకాలిజిస్ట్ డి.నాగిరెడ్డి, పెద్దాపురం క్రై బ్రాంచ్ సి ఐ., ఆర్. అంకబాబు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు.శ్రీ వివేకానంద సమితి అమలాపురం, ప్రత్తిపాడు వారిసౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆద్యంతం ఎంతో స్ఫూర్తిదాయకంగా గంభీరంగా సాగింది. విద్యార్థులూ .. చెడువ్యసనాలకు బానిసలై బంగారు భవిష్యత్ ను పాడుచేసుకోవద్దు అని అంకబాబు విద్యార్థులకు హితవు పలుకుతూ హెల్మెట్ లేకుండా అత్యంత వేగంతో వాహనాలు నడుపుతూ ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దు తల్లితండ్రులకు కడుపుకోత మిగల్చకండి అని నిర్దిష్టమైన లక్ష్యం ఏర్పరుచుకుని దానిని సాధించేవరకు నిద్రపోకండి అని అన్నారు. నాగిరెడ్డి మాట్లాడుతూ ఒక వైద్యుడు చేసే పని వైద్యం చేయడం,రైతు చేసే పని పంటలు పండించడం,ఒక పోలీస్ చేసే పని ప్రజలకు రక్షణ కల్పించడం, అదేవిధంగా విద్యార్థిగా మీ పని చదువుకోవడం మీ ద్రుష్టి కేవలం నేర్చుకోవడం,చదువుకోవడం పైన మాత్రమే ఉండాలి తప్ప అనౌసరమైన విషయాలపట్ల, సోషల్ మీడియా లోను సమయం వృథా చేయకూడదు అని తెలిపారు. తల్లితండ్రులు ఎన్నో ఆశలతో ఆశయాలతో వ్యయ ప్రయాసలకు ఓర్చి మీ బంగారు భవిష్యత్ కోసం మిమ్మల్ని చదివిస్తున్నారు అని కాబట్టి మీ భవితకు దిశా నిర్దేశం చేసుకోవలసినది మీరే అని కుల మత వర్ణ వర్గ బేధం లేకుండా ఉన్న స్థానం నుండి ఉన్నత స్థాయికి తీసుకు వెళ్ళేది చదువు ఒక్కటే అనే మాటను మరవకండి అని అన్నారు.మహాత్మా గాంధీ, అబ్దుల్ కలాం వంటి వారి జీవిత చరితలు చదవనక్కరలేదు ఆదిత్య విద్యాసంస్థల అధినేత యూనివర్సిటీ ఛాన్సలర్ డా.నల్లమిల్లి శేషారెడ్డి గారి జీవితాన్ని తెలుసుకుంటే చాలు అని ఆయన జీవితమే గొప్ప ఉదాహరణగా నిరంతర కృషి పట్టుదల ఉంటె సాధించవచ్చు అనేది సుస్పష్టమవుతుంది అని విద్యార్దులకు దిశానిర్దేశం చేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ లు డా.కుమార్,డా.సుబ్బారావు, వివేకానంద సమితి సభ్యులు సలాది శ్రీరామ చంద్రమూర్తి, జి.నాగరాజు,ప్రో.కట్టా పావని, శ్రీ శారదా రామకృష్ణ సేవాసమితి అధ్యక్షులు టి.గంగాధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రియాంక మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి



**రాజమహేంద్రవరం అర్బన్: ఆగస్టు 12 (ప్రభాతవార్త)** మెడికో ప్రియాంక మృతిపై సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కాంగ్రెస్ రాజమహేంద్రవరం పార్లమెంట్ కో-ఆర్డినేటర్ టీకే విశ్వేశ్వరరెడ్డి, అర్బన్ జిల్లా అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కాలనీలోని కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఈ కేసు విషయంలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం సరిపోదని, రూ.2 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో పోలీసుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని, 3వ తేదీన ఘటన జరిగితే 6వ తేదీ వరకు ఎందుకు విషయం బయటకు రాలేదో అధికారులు సమాధానం చెప్పాలని కోరారు. ప్రమాదం జరిగిన మాల్, పోలీస్‌స్టేషన్ సీసీటీవీ ఫుటేజీలు ఉన్నప్పటికీ దర్యాప్తులో జాప్యం ఎందుకని ప్రశ్నించారు. ఇద్దరు నిందితులపై హత్య కేసు నమోదు చేశారో లేదో ఎస్పీ స్పష్టం చేసి ఎఫ్ఐఆర్‌ను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. బ్రాందీ షాపులను బార్లుగా మార్చడం వల్లే నేరాలు పెరుగుతున్నాయని విశ్వేశ్వరరెడ్డి ఆరోపించారు. అనధికార బార్లను తొలగించకపోతే ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు. నగరంలో మద్యం, గంజాయి, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. హోంమంత్రి స్పందించి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి బాధిత కుటుంబానికి త్వరితగతిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## 3000 మీటర్ల పరుగు పందెంలో మోక్షితకు ప్రథమ స్థానం




**కడియం, ఆగస్టు 12 ( ప్రభాతవార్త)** కడియం మండలం కడియపులంక గ్రామానికి చెందిన రాయుడు శ్రీనివాస్ కుమార్తె రాయుడు మోక్షిత ప్రాంతీయ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చాటింది. మూడు వేల మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించి సత్తా చాటింది. సీ.ఐ.ఎస్.సి.ఇ ఆధ్వర్యంలో నిర్వహించిన సీ.ఐ.ఎస్.సి.ఇ రీజినల్ గేమ్ అండర్ స్పోర్ట్స్ 2026 పోటీలో మోక్షిత ఈ ప్రతిభ కనబరిచింది హబ్సిగూడలోని సెయింట్ జోసెఫ్స్ పాఠశాల వేదికగా ఆగస్టు 11,12 తేదీల్లో నిర్వహించిన ప్రాంతీయ స్థాయి క్రీడా పోటీల్లో పదిహేడు సంవత్సరాల లోపు బాలికల విభాగంలో మోక్షిత మూడు వేల మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మోక్షితకు పతకం, ప్రతిభా ధ్రువపత్రం అందజేసి అభినందించారు. ప్రాంతీయ స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన మోక్షితను పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు, క్రీడాభిమానులు అభినందించారు. మోక్షిత భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి కడియపులంక గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

## అంతర్వేది శ్రీ నృసింహుని హుండీ లెక్కింపు....



**సఖినేటిపల్లి ఆగస్టు 12, ప్రభాత వార్త:** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానము నందు హుండీ లెక్కించగా 21 లక్షలు వచ్చినట్లు అసిస్టెంట్ కమిషనర్ మోకా నాగవర ప్రసాదు తెలియజేశారు. అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానములో దేవదాయశాఖ అమలాపురం తనిఖీదారు రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో హుండీలు తెరచి లెక్కించగా ప్రధాన ఆలయ హుండిలు రూ. 20,34,992, గుర్రలక్క అమ్మవారి హుండీరూ.12,698.లు, అన్నదానం హుండి రూ. 38,026.లు, మొత్తం రూ. 20,85,716.లు ఆదాయం వచ్చియున్నది. ఈ కార్యక్రమము ఎంపీటీసీ బైరా నాగరాజు, దేవాదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టి నాగవిష్ణు, ఆలయ సిబ్బంది సమక్షంలో హుండీలు సేవకులు లెక్కించినట్లు తెలిపారు.

## నీలపల్లి లో ఇంటింటికి తెలుగుదేశం.



**తాళ్ళరేవు, ఆగస్టు 12 (ప్రభాత వార్త):** తాళ్ళరేవు మండలం నీలపల్లి లో మాజీ సర్పంచ్ చిట్టూరి నాగమణి ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ధూళిపూడి వెంకటరమణ కూటమి ప్రభుత్వం ఈ రెండు సంవత్సరాలలో చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరించారు. ప్రతీ కుటుంబంకి ప్రభుత్వం ద్వారా సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, అభివృద్ధి లో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు .త్వరలో జరగబోయే స్థానిక సంస్థ ల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ను ప్రజలు ఆధరించాలన్నారు. ఈ కార్యక్రమం లో యంపిటిసి దంగేటి సూరిబాబు, బూత్ ఇంచార్జి వీరబాబు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



**సీతానగరం, ఆగస్టు 12, (ప్రభాతవార్త) :** మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సిఫార్సుతో సీఎం సహాయనిధి నుండి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే సతీమణి బత్తుల వెంకటలక్ష్మి బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. ఉండేశ్వరపురంలో వేమగిరి వెంకన్నకు రూ.51,186, ఆర్.గంగా భవానికి రూ.36,843, మిర్తిపాడులో మామిడి యశ్వంత్‌కు రూ.25,524, కాటవరంలో కాత్రగడ్డ సూర్యచంద్రరావుకు రూ.1,39,258, కొత్తపల్లి వెంకట దుర్గంకు రూ.25,000, మునికూడలిలో బుంగా భూషణంకు రూ.42,193, రఘుదేవపురంలో మార్ని శశిధర్ శ్రీవాస్‌కు రూ.4,28,437, రాపాకలో భవిశెట్టి వెంకటేశ్వరరావుకు రూ.3,91,852, సీతానగరంలో ఖలీల్ బాగ్‌కు రూ.31,192, ముల్లా పోసేశ్వరికి రూ.23,400, కూనవరంలో ఆయిల వెంకట రామారావుకు రూ.25,000, విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందించారు. చెక్కులను అందుకున్న బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతుల సమక్షంలోనే రీసర్వే నిర్వహించాలి

**రాష్ట్ర సర్వే సెటిల్మెంట్ అండ్ లాండ్ రికార్డ్స్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్.జెసి అపూర్వ భరత్**



**తుని, ఆగష్టు 12, ( ప్రభాతవార్త )** భూముల్లో నిర్వహిస్తున్న రీసర్వేల్లో రైతులను భాగస్వాములను చేసేలా ముందుగానే సమాచారం అందించి వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని, ఈ కేవైసీ తప్పనిసరిగా నమోదు చేయాలని రాష్ట్ర సర్వే, సెటిల్మెంటు అండ్ లాండు రికార్డ్స్ డైరెక్టరు రోణంకి కూర్మనాథ్, కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అన్నారు.బుధవారం కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట, హంసవరం గ్రామాలలో నిర్వహిస్తున్న రీసర్వే కార్యక్రమాన్ని ఆయన కాకినాడ జిల్లా జాయింటు కలెక్టరు అపూర్వ భరత్ , రెవిన్యూ, సర్వే అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ రీసర్వేలో తప్పులు పునరావృతం కాకుండా పారదర్శకత ఉండేందుకు రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.సర్వే మొదలు పెట్టేరోజున తప్పనిసరిగా సంబంధిత రైతు లేదా కుటుంబసభ్యులు క్షేత్ర స్థాయిలో ఉండాలని, సర్వే పూర్తయిన తరువాత డాక్యుమెంట్లు వెరిఫికేషను ద్వారా సరిహద్దులు నిర్ణయం రైతుసమక్షంలోనే నిర్వహించాలన్నారు. రైతు చేతికి సరైన కొలతలతో కూడిన రాజముద్రతో పొందుపరిచిన పట్టాదారు పాసుపుస్తకం అందజేసే వరకూ సమాచారం తప్పనిసరిగా అందించేలా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా డైరెక్టరు కుర్మనాథ్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నా రీసర్వే లో తప్పులు పునరావృతం కాకూడదనే ఉద్దేశంతో భూసమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు రైతులు సమక్షంలోనే రీసర్వే నిర్వహించే విధంగా రీసర్వే 2.0 నిర్వహిస్తున్నామన్నారు. రీసర్వే నిర్వహించిన తరువాత నోటీసు రూపంలో రైతు చూపించిన భూహద్దులు ప్రకారం భూవివరాలను తెలియజేయడం, డాక్యుమెంట్లతో సరిపోల్చుకుని నిర్ధారణ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కేవైసీ చేయించడం ద్వారా రైతు సమక్షంలో సర్వే నిర్వహించడంతో పాటు రైతులకు అన్ని విధాలా సమాచారం అందిస్తూ ఎక్కడా రైతులు ఇబ్బంది పడకుండా చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వ హిస్తున్న రీసర్వేల్లో ఫేజ్-1 లో 628, ఫేజ్-2 లో 748, ఫేజ్-3 లో 729, ఫేజ్-4 లో 1645 గ్రామాల్లో నిర్వహిస్తున్నామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,800 బృందాలతో అత్యాధునిక రోవర్స్ తో సర్వేనిర్వహించడం జరుగుతున్నదన్నారు. క్షేత్ర స్థాయిలో భూవివరాలు, డాక్యుమెంటు పరంగా గల వివరాలను రైతులు సమక్షంలోనే సరిపోల్చుతూ ఇకముందు ఎటువంటి భూ వివాదాలకు తావులేకుండా రైతులు సంతృప్తి చెందే విధంగా రీసర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఫేజ్-5 లో రాష్ట్ర వ్యాప్తంగా 1, 343 గ్రామాలలో రైతులతో కలిసిమెలిసి క్షేత్రస్థాయిలో రీసర్వే నిర్వహిస్తున్నామన్నామని, రైతులు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. క్షేత్ర స్థాయిలో సమస్యలెదురైతే తక్షణ పరిష్కారం చేసే విధంగా కార్యాచరణ రూపొందించినట్లు ఆయన వివరించారు. ప్రభుత్వ విధానాలు పరంగా 2027 మార్చి నాటికి భూవివాదాలు లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దేందుకు తమ సిబ్బంది కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి కె.శ్రీనివాసు, పెద్దాపురం డివిజన్ సర్వే ఇన్స్పెక్టర్ రుద్రంరాజు క్రిష్ణంరాజు, తుని మండల తహశీల్దారు జి.వి.ఎస్.ప్రసాద్ , మండల సర్వేయరు పి.సోమురు, రెవెన్యూ, సర్వే సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్‌లో నక్షత్ర మెరుపులు.. గోపాలపురానికి గర్వకారణం





**గోపాలపురం, ఆగష్టు 12 (ప్రభాతవార్త):** రాష్ట్రస్థాయి అండర్--17 టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. టి. నక్షత్ర, ఎస్. బాలశశి, జి. సూర్యప్రకాశ్ పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. ముఖ్యంగా బాలికల విభాగంలో తూర్పుగోదావరి జిల్లా ఎనిమిదేళ్ల విరామం తర్వాత రాష్ట్రస్థాయిలో నక్షత్ర స్వర్ణ పతకం సాధించడం విశేషంగా నిలిచింది. విద్యార్థుల విజయంపై ప్రధానోపాధ్యాయులు పి. వెంకట కనక పద్మ హర్షం వ్యక్తం చేశారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారని, క్రీడల్లోనూ తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారని అన్నారు. మిథాలీ రాజ్, శ్రీచరణిలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు క్రీడల్లో రాణించాలని సూచించారు. నక్షత్ర చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తోందని, క్రీడా ధ్రువపత్రాలు భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలకు ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు డి. అశోక్, టి. సురేష్, ఇ. రత్నరాజు, ఉపాధ్యాయులు, సీఆర్పీ కొయ్య నాగరాజును అభినందించారు.

## పంచ్ సమ్మేళన శిక్షణ



**రౌతులపూడి, ఆగస్టు 12,(ప్రభాత వార్త)** మండల కేంద్రం రౌతులపూడి ఉపాధి హామీ పథకం కార్యాలయం లో బుధవారం పంచ్ సమ్మేళన శిక్షణ కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ఉపాధి హామీ మండల అధికారిని కాంచన మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీశాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు ఫీల్డ్ అసిస్టెంట్ లకు శిక్షణ కార్య క్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి పథకం పేరు వి బి జీ ఆర్ ఏ ఎం జి గా మార్పు చేసిన క్రమంలో సంబంధిత విది విధానాలను తెలియ జేయడం జరిగిందని ఆమెతెలిపారు. ఈ కార్య క్రమంలో ప్రతీ ఆర్థిక సంవత్సరం లో కుటుంబానికి 125రోజులు పనికల్పించడం, ఆలస్యపు వేతనం, ప్రకృతి వనరుల సంరక్షణ, శాశ్వత ఆస్తుల కల్పన, గ్రామ పంచాయతీ ల పాత్ర తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్య క్రమంలో మండల అభివృద్ధి అధికారి శివరామ కృష్ణ,గ్రామ పంచాయతీ ల ప్రత్యేక అధికారులు, మండల అధ్యక్షురాలు గంటిమల్ల రాజ్యలక్ష్మి, ఎం పి టి సి లు , పాల్గొన్నారు.

## రాజకీయ స్వలాభం కోసం నిర్వాసితులను గందరగోళం చేస్తున్నారు



**వి.ఆర్.పురం,ఆగష్టు12,ప్రభాతవార్త** తమ రాజకీయ స్వలాభం కోసం కొందరు పునరావాస ప్రాంతం విషయంలో నిర్వాసితులను గందరగోళ పరుస్తున్నారని, రాష్ట్ర ఎస్.టి సంక్షేమ కమిటి చైర్ పర్సన్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల.శిరీషదేవి అన్నారు. బుధవారం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా, శిరీషదేవి మండలంలోని పోలవరం ప్రాజెక్ట్ ముంపు గ్రామీణ వడ్డిగూడెం గ్రామంలో పర్యటించారు. గ్రామంలో గోదావరినది ఒడ్డున గల శివాలయం ఆలయం వద్ద ఆమె గ్రామస్తులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తాము కోరుకున్నచోటే,పునరావాస కాలనీలు కట్టివ్వాలని కోరారు. కొత్తపల్లి గ్రామం వద్ద తమకు పునరావాసం వద్దన్నారు. తమకు తిరువూరు, తాడ్వాయి, కొయ్యలగూడెం ప్రాంతాల్లో ఎక్కడైనా పునరావాసం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఆమె మాట్లాడారు. నిర్వాసితులు కోరుకున్నచోటే పునరావాసం కల్పిస్తామన్నారు. పునరావాసం విషయంలో ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యే వెంట స్థానిక జడ్.పి.టి.సి సభ్యులు వాళ్ళ.రంగారెడ్డి, కో.ఆపరేటివ్ సొసైటి అధ్యక్షులు గొంది.చంద్రయ్య, టిడిపి మండల అధ్యక్ష, కార్యాదర్శులు బొర్రా.నరేష్ కుమార్, పాయం.రామారావు, ఆ పార్టీ నాయకులు బొర్రా.నరసింహారావు, ముత్యాల.రామారావు, పెందుర్తి.సుదర్శన్ (సుధ), ఆచంట.శ్రీను, ఆకోజు.భాగ్యలక్ష్మి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు 6లో

## వాడీ వేడిగా మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం....



సఖినేటిపల్లి ఆగస్టు 12, ప్రభాత వార్త: కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మల్లిబాబు అధ్యక్షతలో వాడి వేడిగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పాల్గొన్నారు. గ్రామాలలో ఎంపీటీసీ లు గ్రామ సమస్యలు వివరించగా రామేశ్వరం, అంతర్వేది, కేశవదాసుపాలెం, గొంది, గ్రామాలకు పట్టాలు ఇచ్చారు గానీ, లబ్ధిదారులకు చూపలేదని, అవి లోతట్టు ప్రాంతాలలో ఉన్నట్లు గుర్తించి ఈ సమస్యపై ఎంపీటీసీలు వాడీ వేడి గా చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, ముంపు సమస్య, మంచినీటి సరఫరా, విద్యుత్, రహదారులు తదితర సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలో డంపింగ్ యార్డు ఏర్పాటుకు అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని అధికారులను కోరారు. ప్రస్తుత ప్రజా పరిషత్ ప్రతినిధులకు ఇదే ఆఖరి సాధారణ సమావేశం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎన్నికై వచ్చే ప్రజా ప్రతినిధులు పదవులను కేవలం అలంకారప్రాయంగా కాకుండా బాధ్యతగా స్వీకరించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామాల అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలని కోరారు. అందరూ ఎమ్మెల్యే దేవ ను పూలదండ, శాలువా మెమెంటో తో సత్కరించారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ దుశ్శాలువా కప్పి, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు.

## మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం



అయినవిల్లి ఆగస్టు 12 ప్రభాతవార్త గ్రామాల్లో మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యతనిచ్చి పనిచేస్తున్న మని పి. గన్నవరం శాసన సభ్యులు గిడ్డి సత్యనారాయణ అన్నారు సోమవారం, సిరిపల్లి గ్రామాల్లో రూ.69.80 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంకులను బుధవారం ఆయన ప్రారంభించారు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, అయినవిల్లి మండలం సోమవారం, సిరిపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంకు ప్రారంభించారు. సోమవారం గ్రామపంచాయతీ పరిధిలోని సానబోయినవారిపాలెంలో రూ.23.50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన 20 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ ట్యాంకు ద్వారా పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా అందనుంది. అదేవిధంగా సోమవారం గ్రామపంచాయతీ పరిధిలోని చిక్కాలవారి వీధిలో రూ.23.50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన మరో 20 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకును కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. రెండు వాటర్ ట్యాంకుల ఏర్పాటుతో ఆయా ప్రాంతాల్లో తాగునీటి అవసరాలు మరింత మెరుగ్గా తీరనున్నాయని తెలిపారు. సిరిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సిరిపల్లి హైస్కూల్ వద్ద రూ.22.80 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన 20 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకును ఎమ్మెల్యే ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులతో పాటు స్థానిక ప్రజలకు కూడా ఈ వసతి ఉపయోగపడనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీటిని అందించడం కూటమి ప్రభుత్వ ప్రాధాన్యత అని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. మొత్తం రూ.69.80 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన ఈ మూడు వాటర్ ట్యాంకులు అందుబాటులోకి రావడంతో సోమవారం, సిరిపల్లి గ్రామాల పరిధిలోని ప్రజలకు తాగునీటి సరఫరా మరింత మెరుగుపడనుంది. ముఖ్యంగా వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులను అధిగమించేందుకు ఈ వసతులు ఎంతగానో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు అవసరమైన తాగునీరు, రహదారులు, విద్యుత్, డ్రైనేజీ తదితర సౌకర్యాలు దశలవారీగా మెరుగుపరుస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, జనసైనికులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నృసింహుని ఆలయంలో ఆండాళ్ తిరు నక్షత్ర పూజలు....



సఖినేటిపల్లి ఆగస్టు 12, ప్రభాత వార్త: డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానంలో ఆండాళ్ తిరు నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చక స్వాములు ప్రత్యేక పూజలు, శ్రీ వైష్ణవులు చే ఆండాళ్ తిరు నక్షత్ర పూజలు, మంత్రాలతో చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మోకా సాగర్ బాబు, ప్రసాదం, స్వనాచార్యులు రామ రంగాచార్యులు, రాజేష్, శ్రీ వైష్ణవులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## టి. ఎల్. యం. వినియోగంపై జ్ఞానజ్యోతి శిక్షణ



రాజవొమ్మంగి, ఆగస్టు 12, ప్రభాతవార్త రాజవొమ్మంగి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రెండో రోజు అంగన్వాడీ వర్కర్స్ కు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ వినియోగంపై శిక్షణ నిర్వహించారు. డి. ఆర్పీలు మరం చంద్రశేఖర్ బాబు, పప్పుల సరస్వతి, కోటం సత్యనారాయణ లు రెండో రోజు శిక్షణ ఇచ్చారు. టి. ఎల్. యం ఉపయోగించు పద్ధతులు, ఆర్. ఎల్. యం వినియోగం, అభ్యాసం, అంగన్వాడీ గదిని తయారు చేయడం, అవగాహన, బాధ్యతలపై శిక్షణ కొనసాగింది. ఈకార్యక్రమంలో డి. ఆర్. పిలు మరం చంద్ర శేఖర్ బాబు, కోటం సత్యనారాయణ, పప్పుల సరస్వతి, సూపర్ వైజర్ వెంకట్యమ్మ, అమ్మిరాజు, 101 మంది అంగన్వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



సీతానగరం, ఆగస్టు 12, (ప్రభాతవార్త): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎల్.శ్రీను నాయక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జిల్లా సైబర్ ల్యాబ్ సిబ్బందితో కలిసి విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై, సైబర్ ల్యాబ్ సిబ్బంది మాట్లాడుతూ.. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పాస్వర్డ్ లు వంటి అత్యంత కీలకమైన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోకూడదని సూచించారు. అలాగే ఆన్లైన్ పార్ట్ టైమ్ ఉద్యోగాలు, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు, లాటరీలు, బహుమతులు, కస్టమర్ కేర్ పేరుతో వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్ లను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. వాట్సాప్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో అపరిచితులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని స్పష్టం చేశారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్కు ఫోన్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైబర్ ల్యాబ్ సిబ్బంది పి.దుర్గాప్రసాద్, అబ్దుల్ షౌకత్ , కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పొగాకు ఉత్పత్తులతో ఆందోళనకరంగా ఊపిరితిత్తుల క్యాన్సర్

### ప్రాథమిక గుర్తింపుతోనే పూర్తిస్థాయి రక్షణ, పల్మనాలజిస్ట్ గోపీకృష్ణ




కాకినాడ రూరల్, ఆగస్ట్ 12 (ప్రభాతవార్త): ప్రపంచవ్యాప్తంగా పొగాకు ఉత్పత్తులతో ఊపిరితిత్తులకు వచ్చే క్యాన్సర్ వ్యాధి ప్రాణాంతకంగా మారిందని సుప్రసిద్ధ పల్మనాలజిస్ట్ డాక్టర్ గోపీకృష్ణ యెడ్లపాటి పేర్కొన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ప్రముఖ వైద్యులు గోపికృష్ణ మాట్లాడుతూ ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రపంచవ్యాప్తంగా తీవ్ర స్థాయిలో విజృంభిస్తుందని, అసాధారణ కణాల పెరుగుదలతో మొదలయ్యే ఈ ప్రాణాంతక వ్యాధి, ఎలాంటి స్పష్టమైన ప్రాథమిక లక్షణాలు చూపించకుండానే చాపకింద నీరులా దేహాన్ని ఆక్రమిస్తోందన్నారు.ప్రాథమిక దశలో గుర్తింపుతోనే పూర్తిస్థాయి రక్షణ పొందవచ్చని గోపీకృష్ణ తెలిపారు. వ్యాధి ముదిరి ప్రాణాపాయ స్థితికి చేరుకున్న తర్వాతే ఎక్కువ శాతం కేసులు వెలుగులోకి వస్తుండటం వైద్యరంగాన్ని కలవరపెడుతోందన్నారు. ఏటా దేశంలో అరవై వేలకు పైగా ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ముందస్తు హెచ్చరికలు లేకుండా దాడి చేసే ఈ మహమ్మారి బారిన పడకుండా ఉండాలంటే ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు. ఆధునిక జీవనశైలి, పెరుగుతున్న కాలుష్యం వెరసి క్యాన్సర్ ముప్పును మరింత తీవ్రతరం చేస్తున్నాయని. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, జీవితంలో ఎన్నడూ సిగరెట్ ముట్టని వారు సైతం ఈ వ్యాధి బారిన పడుతుండటం. నమోదవుతున్న కేసుల్లో పాతిక శాతం మంది పొగతాగని వారే కావడం పరిస్థితుల తీవ్రతకు అద్దం పడుతోందన్నారు. పరోక్ష ధూమపానం, వాహన కాలుష్యం, ఆస్బెస్టాస్ , రసాయన కర్మాగారాల్లో పనిచేయడం, జన్యుపరమైన లోపాలు ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా పదిహేను నుంచి పాతిక సంవత్సరాల లోపు యువతలో పొగాకు, వేప్ వినియోగం ప్రమాదకర స్థాయికి చేరుకుంటోంది. మారుతున్న ఈ ప్రతికూల వాతావరణంలో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య స్థితిగతులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. వైద్యరంగంలో అత్యుత్తమ ప్రమాణాలతో, ప్రాణదాతగా పేరొందిన యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ ఊపిరితిత్తుల క్యాన్సర్ చికిత్సలో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తోందనీ,అత్యాధునిక ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ, అడ్వాన్స్డ్ నావిగేషన్ బ్రాంకోస్కోపీ, ఎండోబ్రాంకియల్ అల్ట్రాసౌండ్ (ఈబస్) వంటి సంక్లిష్టమైన రోబోటిక్ సర్జరీలు, ఇమ్యునోథెరపీ, టార్గెటెడ్ కీమోథెరపీ వంటి అత్యాధునిక విధానాలను ఏకతాటిపై అందిస్తూ యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ రోగులకు కొండంత భరోసానిస్తోంది. ఈ కీలక సమావేశంలో యశోద హాస్పిటల్స్ మార్కెటింగ్ విభాగానికి చెందిన ఎస్ రామకృష్ణ, వి సాయికిరణ్ పాల్గొన్నారు

## వృద్ధ దంపతుల కుటుంబానికి ఎమ్మెల్యే బండారు అండ

### సోషల్ మీడియాలో వీడియోకి స్పందించిన ఎమ్మెల్యే



కొత్తపేట, ఆగస్టు 12, (ప్రభాతవార్త) డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం అవిడి గ్రామంలో ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని సోషల్ మీడియాలో వచ్చిన గోటేటి రామమూర్తి వృద్ధ దంపతుల కుటుంబానికి స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అండగా నిలిచారు ఎమ్మెల్యే సత్యానందరావు స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో అధికారులతో ఫోన్ లో మాట్లాడి హుటాహుటిన ఆ వృద్ధ కుటుంబానికి అవసరాలను తక్షణమే అందించాలని అధికారులకు ఆదేశించారు అలాగే ఎమ్మెల్యే సదరు కుటుంబానికి రూ పదివేల ఆర్థిక సాయాన్ని నేరుగా పంపించారు అలాగే పూర్తి వైద్య సేవలు అందించాలని అధికారులను కోరారు తన సొంత ఖర్చులతో తక్షణమే కరెంట్ చర్యలు చేపట్టారు ఆ మేరకు విద్యుత్ శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించడంతో అధికారులు తగు చర్యలు చేపట్టారు వారి కుటుంబంలో ఇరువురికి పెన్షన్ అందేలా చూడాలనిఅధికారులకు సూచించడంతో ఈ సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లానని కుటుంబంలో రెండు పెన్షన్ లు వచ్చేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు గత కొన్ని సంవత్సరాలుగా గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఈ కుటుంబానికి ఆర్థిక నిత్యావసర సరుకులను అందిస్తున్నట్లు గుర్తు చేశారు అలాగే సమస్యను సోషల్ మీడియా ద్వారా బయటకు తెచ్చిన యువకులను ఎమ్మెల్యే బండారు అభినందించారు త్వరిగతిన సమస్య పరిష్కారానికి చొరవ చూపి విద్యుత్ శాఖ డీఈ తహసీల్దారు ఆర్డీఓలను సమన్వయం చేసిన ఎమ్మెల్యే సత్యానందరావు తీరుకి నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు కార్యక్రమములో ఏఎంసి ఉపాధ్యక్షుడు కంఠం శెట్టి శ్రీనివాసరావు మాజీ సర్పంచ్ రెడ్డి తాతాజీ గ్రామ టిడిపి అధ్యక్షులు సూరవరపు రామకృష్ణ టిడిపి నాయకులు మట్ట బాలు కందేరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

## " పాడా "సహకారంతో పారిశుద్ధ్య కార్మికుల భద్రత

### "యూనిసెఫ్" ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం



పిఠాపురం, ఆగస్టు 12 ( ప్రభాతవార్త) పిఠాపురం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ( పాడా ) సహకారంతో యూనిసెఫ్ బృందం ఆధ్వర్యంలో 52 మంది పంచాయితీ అభివృద్ధి అధికారులు (పీడీఓ )కు " పారిశుద్ధ్య కార్మికుల భద్రత, గౌరవం పై సమీక్ష విధానం అనే అంశంపై బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల భద్రత, ఆరోగ్యం, సంక్షేమం కోసం తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించారు. పాడా సహకారంతో నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులకు సురక్షితమైన పని వాతావరణం కల్పించడం, భద్రతా ప్రమాణాలను పాటించడం, ఏం చేస్తున్నావ్ రేపు గత రక్షణ పరికరాల వినియోగం, కార్మికుల హక్కులను పరిరక్షించడం, సరే గౌరవాన్ని కాపాడటం వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. ౦౦పారిశుద్ధ్య కార్మికుల భద్రత, గౌరవం, సంక్షేమానికి "పాడా " అధిక ప్రాధాన్యతనిస్తూ సంబంధిత శాఖల సమన్వయంతో అవగాహన, శిక్షణ, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

## పుంగనూరు గిత్త రూ.3.75 లక్షలు..

### నేషనల్ డైరీ డెవలప్మెంట్ బోర్డు చెన్నై విభాగం కొనుగోలు..



అంబాజీపేట,ఆగస్టు 12, (ప్రభాతవార్త ): పాడి పరిశ్రమాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలు,సహకారం అందిస్తుండడంతో పలువురు పాడి రైతులు పశువుల పెంపకం పై శ్రద్ధ కనబరుస్తున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాన్ని, సహకారంను ఏమీ ఆశించకుండా ఆవుల పెంపకం పై మమకారం పెంచుకున్న ఓ యువకుడు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాడు. అంబాజీపేట మండలం మాచవరం గ్రామానికి చెందిన అడబాల ప్రేమ కుమార్ వివిధ జాతులకు చెందిన ఆవులను, పక్షులను, జంతువులను అభివృద్ధి చేయిస్తూ జంతు-పక్షి ప్రేమికుడిగా పేరుపొందాడు. పేరులోనే "ప్రేమ" ఉన్న నోరులేని జీవాలపై ప్రేమ కురిపిస్తుండంతో అందరి మన్ననలు పొందుతున్నాడు. ప్రేమ కుమార్ దగ్గర ఉన్న పుంగనూరు జాతికి చెందిన గిత్త పలువులను విశేషంగా ఆకట్టుకుంది. విషయం నేషనల్ డైరీ డెవలప్మెంట్ చెన్నై విభాగం కు చేరుకుంది. దీంతో చెన్నై విభాగం బుల్ మేనేజ్మెంట్ సీనియర్ అధికారి లిపిదేవ్ స్వయంగా విచ్చేసి పుంగనూరు గిత్తను పరిశీలించారు. జాతీయస్థాయిలో మంచి లక్షణాలు కలిగిన పుంగనూరు గిత్తగా గుర్తించి రూ 3.75 లక్షలకు ప్రేమ కుమార్ నుండి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా లిపిదేవ్ మాట్లాడుతూ పుంగనూరు గిత్త నుండి వీర్యంను సేకరించి చెన్నై ప్రాంతంలోని పాడి రైతులు వద్ద ఉన్న ఆవులకు పుంగనూరు గిత్త వీర్యాన్ని ఇంజక్షన్ రూపంలో ఇచ్చే పుంగనూరు జాతిని అభివృద్ధి చేస్తామన్నారు. ప్రేమ కుమార్ నుండి కొనుగోలు చేసిన పుంగనూరు గిత్తను మాచవరం నుండి మద్రాస్ కు ప్రత్యేక వాహనంపై తరలించారు. జంతు-పక్షి ప్రేమికుడు ప్రేమ కుమార్ మాట్లాడుతూ తన వద్ద 9 పుంగనూరు గిత్తలు ఉన్నాయని నేషనల్ డైరీ డెవలప్మెంట్ బోర్డు చెన్నై విభాగం వారు ఫిబ్రవరి నెలలో విచ్చేసి 4 గిత్తల నుండి రక్త నమూనాలను తీసుకువెళ్లారన్నారు. మరల 45 రోజులకు ఒకసారి, మరో 45 రోజులకు మరోసారి రక్త నమూనాలను తీసుకువెళ్లి, వీటిలో ఒకటి మంచి లక్షణాలు కలదిగా గుర్తించామని, దానిని చెన్నై ప్రభుత్వం అనుమతితో కొనుగోలు చేస్తామని తెలిపారన్నారు. దాన్లో భాగంగా ఆన్లైన్లో అమౌంట్ చెల్లించి పుంగనూరు గిత్తను తమ వెంట తీసుకెళ్లారని ప్రేమ కుమార్ తెలిపారు.

## ఐదు రోజుల పనిదినాల కోసం బ్యాంకు ఉద్యోగుల నిరసన

### హామీ అమలు చేయాలని డిమాండ్




రావులపాలెం, ఆగస్టు 12 (ప్రభాతవార్త): వారానికి ఐదు రోజుల పనిదినాల విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యూఎఫ్బీయూ పిలుపు మేరకు బుధవారం రావులపాలెంలో బ్యాంకు ఉద్యోగులు నిరసన ర్యాలీ నిర్వహించారు. బ్యానర్లు, ప్లకార్డులతో నినాదాలు చేస్తూ తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. 2022, 2023లో ప్రభుత్వం, ఐబీఏతో జరిగిన చర్చల్లో అన్ని శనివారాలను సెలవులుగా ప్రకటించేందుకు అంగీకారం కుదిరినా ఇప్పటివరకు అమలు కాలేదని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తెలిపారు. బ్యాంకుల్లో సిబ్బంది కొరత, పెరుగుతున్న పని భారం, అధిక లక్ష్యాల నేపథ్యంలో ఉద్యోగుల ఆరోగ్యం, పని సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఐదు రోజుల పనివారాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ జోనల్ సెక్రటరీ సురేష్కుమార్ కానూరి, యూనియన్ జోనల్ సెక్రటరీ వై.గణేశ్వరరావు, చీఫ్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి తదితరులతో పాటు వివిధ బ్యాంకుల ఉద్యోగులు పాల్గొన్నారు.

## శానిటేషన్ వర్కర్లు, నైట్ వాచ్మెన్ల బకాయి జీతాలు చెల్లించాలి

కాట్రేనికోన, ఆగస్టు 12 (ప్రభాత వార్త) ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లు మరియు నైట్ వాచ్మెన్లకు గత ఐదు నెలలుగా పెండింగ్లో ఉన్న బకాయి వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని సి.ఐ.టి.యు మండల కన్వీనర్ విత్తనాల రాంబాబు డిమాండ్ చేశారు. కార్మికుల శ్రమను దోచుకుంటూ వేతనాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వ తీరును తప్పు బడుతూ ఆయన బుధవారం కాట్రేనికోనలో మాట్లాడుతూ గత ఐదు నెలల నుండి జీతాలు ఇవ్వకపోతే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే శానిటేషన్ వర్కర్లు, నైట్ వాచ్మెన్లు ఏమి తిని బతకాలి? వారి కుటుంబాలను ఎలా పోషించుకోవాలి? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఒకవైపు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతుంటే, మరోవైపు చాలీచాలని జీతాలు, అవి కూడా ఆరు నెలలకోసారి ఇస్తే ఈ చిరుద్యోగులు ఎలా బతకాలని ఆయన మండిపడ్డారు. కొన్ని ప్రభుత్వ హైస్కూళ్లలో సుమారు 300 మంది పిల్లలకు కేవలం ఒకే ఒక్క శానిటేషన్ వర్కర్ పనిచేయాల్సి వస్తోందని, దీనివల్ల కార్మికులపై తీవ్రమైన పని ఒత్తిడి పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటి కష్టకాలంలో, కట్టు బానిసల్లా పనిచేస్తున్నా జీతాలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. పాఠశాలల నిర్వహణ, పారిశుద్ధ్య పనుల నిమిత్తం ప్రభుత్వం ప్రతి ఏటా ' తల్లికి వందనం' పథకం కింద లబ్ధిదారులైన తల్లుల ఖాతాల నుండి కొంత మొత్తాన్ని మినహాయించి వసూలు చేస్తోందని రాంబాబు గుర్తుచేశారు. ప్రభుత్వం ఇప్పటివరకు ఆ నిధులను ఎందుకు విడుదల చేయలేదని ఆయన నిలదీశారు. శానిటేషన్ వర్కర్లు, నైట్ వాచ్మెన్ల 5 నెలల బకాయి జీతాలను తక్షణమే వారి ఖాతాల్లో జమ చేయాలి. కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలను ప్రతినెలా క్రమం తప్పకుండా ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు శానిటేషన్ సిబ్బందిని నియమించి, ప్రస్తుతం ఉన్న కార్మికులపై పని భారం తగ్గించాలి.పెండింగ్ జీతాలను విడుదల చేయకపోతే, రాబోయే రోజుల్లో బాధితులను కలుపుకుని సి.ఐ.టి.యు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని విత్తనాల రాంబాబు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## ప్రతి ఒక్కరు ఓటు హక్కును కాపాడుకోవచ్చు




కొత్తపేట, ఆగస్టు 12, (ప్రభాతవార్త) సంబంధిత వాటర్ అధికారికి దరఖాస్తు చేసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును కాపాడుకోవచ్చునని ఆర్డీవో జి వి వి సత్యనారాయణ తెలిపారు ఓటరు నమోదు అధికారి, నెం.47 కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గం ఉ రెవిన్యూ డివిజనల్ అధికారీ అధ్యక్షతన రెవిన్యూ డివిజనల్ కార్యాలయం లో బుధవారం నియోజకవర్గ స్థాయిలో అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులు సహాయ ఓటరు నమోదు అధికారులు తహశీల్దార్లు సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారి ఉద్దేశించి ఆర్డీవో సత్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం నియోజకవర్గం లో 277 పోలింగు కేంద్రాల పరిధిలో బూత్ స్థాయిలో జరుగుచున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ లో అనమలీస్ క్రింద 18 845 మందికి నోటీసులు జనరేట్ చేయడమైనదని తెలిపారు నోటిసులు అమలు జరిపి వారం రోజులు తర్వాత విచారణ సంబందిత సచివాలయం నందు ఎ ఇ ఆర్ ఓ లు విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటారని తెలిపారు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో రేషనలైజెషన్ ప్రక్రియలో భాగముగా నియోజకవర్గములో నాలుగు మండలాలలో కొత్తగా 15 పోలింగ్ కేంద్రములు ఏర్పాటు చేయాలని తెలిపారు డ్రాఫ్ట్ పబ్లికేషన్ 2026 జూలై 31తరువాత మొత్తము 277 పోలింగ్ కేంద్రాల పరిధిలోని మొత్తం ఓటర్లు 2 32 977 గా ఉన్నారన్నారు 18 సంవత్సరములు నిండిన వారు ఓటరు నమోదుకు అర్హులైనవారు 2026 ఆగస్టు 30 తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు తుది వాటర్ జాబితా అక్టోబర్ మూడో తేదీన ప్రచురిస్తారని ఆర్డీవో తెలిపారు సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీ ప్రతినిధులు నుండి సూచనలు సలహాలు స్వీకరించారు అత్యంత ప్రతిష్టాత్మకం గా జరుగుచున్న సర్ కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ స్థాయి ఏజెంట్లు ఎన్నికల సిబ్బందికి సహకరించాలని కోరారు ఈ సమావేశంలో తెలుగుదేశం వైఎస్ఆర్సిపి జనసేన బి.జె.పి కాంగ్రెస్ సి.పి.ఐ బి.యస్.పి పార్టీల నియోజకవర్గ మండల ప్రతినిధులు హాజరయ్యారు

## జిల్లా తూర్పు కాపు సంఘం అధ్యక్షుడిగా సుంకర వెంకటేశ్వరరావు



గోకవరం : ఆగస్టు 12 ప్రభాత వార్త వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా తూర్పు కాపు సంఘం అధ్యక్షుడిగా గోకవరం మండల కేంద్రానికి చెందిన సుంకర వెంకటేశ్వరరావు (రమణ) నియమితులయ్యారు. ఈ సందర్భంగా రమణ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, పార్టీకి తాను చేసిన సేవలను గుర్తించి తనపై అభిమానంతో ఈ బాధ్యతను అప్పగించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనను ఈ బాధ్యతకు సిఫార్సు చేసిన మాజీ మంత్రి, మాజీ పార్లమెంట్ సభ్యుడు, జగ్గంపేట నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోట నరసింహం, ఉభయ గోదావరి జిల్లాల విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ తోట రాంజీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లా తూర్పు కాపు సంఘం అధ్యక్షుడిగా తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని రమణ పేర్కొన్నారు. రమణ నియామకం పట్ల మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## చిన జగ్గంపేటలో వైద్య సిబ్బంది ఫీవర్ సర్వేలెన్స్

### -సీజనల్ వ్యాధులపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన



గొల్లప్రోలు, ఆగస్టు 12,(ప్రభాతవార్త) గొల్లప్రోలు మండలం చిన జగ్గంపేట గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ) వైద్య సిబ్బంది బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగా గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై ప్రత్యేక అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పాఠశాలలో ఫీవర్ సర్వేలెన్స్ (జ్వరాల తీవ్రత పరిశీలన) నిర్వహించారు. అనంతరం వైద్య సిబ్బంది మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే డెంగీ,మలేరియా వంటి ప్రమాదకర వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.దోమకాటుకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని,ప్రతి వారం 'ఫ్రైడే - డ్రైడే' (శుక్రవారం పొడి రోజు) పాటించడం ద్వారా దోమల ఉత్పత్తిని అరికట్టవచ్చని అవగాహన కల్పించారు.దోమల నివారణ పద్ధతులను విద్యార్థులకు ప్రాక్టికల్గా వివరించారు.అనంతరం వైద్య సిబ్బంది గ్రామంలోని వీధుల్లో పర్యటించారు.ఇండ్ల పరిసరాలను పరిశీలించి,పారిశుధ్యం ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు.దోమలు వృద్ధి చెందకుండా ఇండ్ల ముందర మురుగునీరు నిల్వ ఉంచకూడదని,తాగునీటి పాత్రలపై తప్పనిసరిగా మూతలు ఉంచాలని చెప్పారు.జ్వరం,నీరసం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే పీహెచ్సీని ఆశ్రయించి ఉచితంగా వైద్య సేవలు పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో పీహెచ్సీ వైద్య సిబ్బంది,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల,విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ధవళేశ్వరం డాగూరే ఫోటో వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం సమావేశం



ధవళేశ్వరం,ఆగస్ట్12,(ప్రభాతవార్త) ధవళేశ్వరం డాగూరే ఫోటో వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల సంక్షేమం, వృత్తిపరమైన సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం కార్యక్రమాలకు తన వంతు సహకారంగా అనిల్ కుమార్ చౌదరి రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఫోటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమం కోసం సంఘం చేస్తున్న కార్యక్రమాలను అభినందించిన ఆయన, భవిష్యత్తులోనూ తన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు అనిల్ కుమార్ చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు. సభ్యుల సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజలు సహకరించాలి



యు.కొత్తపల్లి, ఆగస్టు 12 (ప్రభాతవార్త) : మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజలు సహకరించాలని ఎస్సై వెంకటేష్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని ఎండపల్లి జంక్షన్ వద్ద బుధవారం పోలీసులు డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత స్థిరపడే సమయంలో మత్తుకు బానిసలైతే జీవితాలు, కుటుంబాలు నాశనమవుతాయన్నారు. యుక్త వయస్సులో సరదాకు చెడు అలవాట్లుకు బానిసలైతే మిగిలిన జీవితం అధోగతేనని, ఇటువంటి వాటికి దూరంగా దూరంగా ఉండాలని సూచించారు. మంచి సమాజ నిర్మాణంలో తల్లిదండ్రులు, ప్రజలు కూడా భాగస్వాములేనన్నారు. కార్యక్రమంలో పోలీసు శా ఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి పర్యటనలో అపశృతి

### బిజెపి మహిళా జిల్లా కార్యదర్శికి తీవ్ర గాయాలు



వి.ఆర్.పురం,ఆగస్టు12,ప్రభాతవార్త రాష్ట్ర ఎస్.టి సంక్షేమ కమిటి చైర్ పర్సన్, రంపచోడవరం నియోజక వర్గ ఎమ్మెల్యే మిరియాల.శిరీషదేవి పర్యటనలో అపశృతి చోటు చేసుకుంది. బుధవారం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా, ఎమ్మెల్యే శిరీషదేవి మండలంలో పర్యటించారు. పర్యటనలో భాగంగా ఆమె రామవరం గ్రామ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించి, వి.ఆర్.పురం వెళ్ళారు. ఆమెను టిడిపి, జనసేన, బిజెపి నాయకులు అనుసరించారు. వీరిలో బిజెపి జిల్లా కార్యదర్శి బొర్రా.కామేశ్వరి ఉన్నారు. ఎమ్మెల్యే కాన్వాయి కి ముందు ద్విచక్ర వాహనం పై ప్రయాణిస్తున్న కామేశ్వరి వాహనాన్ని, ఏదో గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. దీంతో కామేశ్వరి కిందపడిపోయింది. ఈ ప్రమాదంలో ఆమె కుడి చేయి విరిగింది. వెంటనే బాధితురాలిని చికిత్స కోసం చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇక ఇదిలా ఉంటే, రోడ్డు ప్రమాదంలో తాను గాయపడి రోడ్డు ప్రక్కన పడిపోయిఉన్న దృశ్యాన్ని ఎమ్మెల్యే చూసి సైతం ఆగకుండా వెళ్లిపోయారని, క్షతగాత్రులు కామేశ్వరి ఆరోపిస్తున్న వీడియో ఒకటి ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతుంది.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps